Website : www.saisadguruvani.org
దత్త జయంతి ప్రత్యేక సంచిక

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి

సంపుటి-20
అక్టోబర్, నవంబర్, డిశెంబర్ - 2020
సంచిక-4



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

# ఆధ్యాత్మిక-సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - పవర్‌సిటీ

## (2020 జూలై, ఆగష్టు, సెప్టెంబర్ లో నిర్వహించిన కార్యక్రమాలు)



ఈ పేజీ సమర్పించిన వారు :

పూర్తి వివరములకు 21వ పేజీ చూడగలరు

విజయదశమి, దీపావళి, దత్తజయంతి మరియు పూజ్య ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారి జయంతి శుభాకాంక్షలతో...

**శ్రీ సాయి మాస్టర్ సేవా సంఘం** - డోర్ నెం. 6-9-20, కెల్లవీధి, శ్రీకాకుళం.

**ఎస్. సాయిదాస్** - లావేరు **డి. చరణ్** - లావేరు



## పెళ్ళిరోజు శుభాకాంక్షలు

డిశెంబర్ 8వ తేదీన శ్రీకాకుళంలో **పెళ్ళిరోజు** జరుపుకుంటున్న

**శ్రీ హరికృష్ణ పట్నాయక్, శ్రీమతి ఉషారాణి** దంపతుల

వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని అందుకు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని

కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి


సంపుటి - 20 అక్టోబర్, నవంబర్, డిశెంబర్ - 2020 సంచిక - 4

**శ్రీ దత్తసాయి మాస్టర్ సాంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

'దత్త జయంతి' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**




"దిగంబరాయ దివ్యాయ దివ్యరూపధరాయ చ।
సదోదిత పరబ్రహ్మ దత్తాత్రేయ నమో స్తుతే॥"

## చందా వివరములు

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | - | రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - | రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - | రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - | రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - | రూ॥ | 1000/- |

మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224

E-mail : poorna.sai09@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**

## విషయ సూచిక

ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాళిక... లోపలి కవర్ పేజీ
1. విషయసూచిక ..... 1
2. మా మాట ..... 2
3. సీమోల్లంఘన..... 4
4. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ..... 5
5. పండుగలు - పర్వదినాలు ..... 7
6. భక్తి యోగ సాధన ..... 8
7. శ్రీగురు చరితామృతము ..... 9
8. ఒక్క క్షణం ..... 11
9. అవధూత వేణుగోపాల స్వామి ..... 12
10. జిజ్ఞాస..... 13
11. ధ్యానం ఎలా చేయాలి ..... 14
12. గురుదేవ దత్త వైభవం..... 15
13. గురువునెందుకు ఆశ్రయించాలి ..... 16
14. పూర్ణ అంతరంగాలు ..... 17
15. జీవన్ముక్తి..... 20
16. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ..... 21
17. మేము సహితం ..... 22
18. అక్షర యజ్ఞానికి చేయూత, దత్త జయంతి..... 23
19. జన్మదిన శుభాకాంక్షలు..... 24
20. దత్తాత్రేయ స్తోత్రం ..... 28
21. మన సాంప్రదాయాలు ..... 29
22. శ్రీ క్షేత్ర గాణ్గాపూర్ ..... 30
23. శ్రీ గురు చరిత్ర పారాయణ ..... 31
24. పారాయణ ఫలితాలు..... 32
25. బాలవికాశం..... 33
26. హృదయ జ్యోతి ..... 34
27. ఆదర్శమూర్తి శ్రీ ఎక్కిరాల భరద్వాజ..... 35
28. స్ఫూర్తి ప్రధాత (శ్రీ సంజీవరాయ శర్మ)..... 37
29. పుస్తక పరిచయం ..... 38
30. తెలుసుకుందాము ..... 39
31. ఏరిన ముత్యాలు ..... 40








# మా మాట

## పాఠకులకు, రచయిత(త్రు)లకు, ప్రకటనకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు


మానవ జన్మ సార్ధకత కావాలి అంటే నాలుగు సమకూడాలి, ఉత్తముడైన గురువు లభించాలి, ఆ గురువును సేవించుకునే అవకాశం కలగాలి, చేసిన సేవకు గురువు సంప్రీతుడవ్వాలి, సంప్రీతుడయిన గురువు పూర్వజన్మ సంస్కారాలను అనుసరించి ఉత్తమమైన సాధనా మార్గం బోధించాలి. ఈ నాలుగు సమకూడిన నాడు మానవ జన్మకు సార్ధకత చేకూరుతుంది. నేటి కలిప్రభావానికిలోనైన జనులు ఉత్తమ గురువును గుర్తించలేరని భావించే, శ్రీదత్తాత్రేయుడు శ్రీ శిరిడీసాయినాధుడి రూపంలో అవతరించి, అనేక మిషలమీద కార్యకారణ సంబంధంగా తన వద్దకు లాగి, కోరికలు నెరవేర్చి, కష్టాలు తొలగించి, జిజ్ఞాసువులుగా మారిన వారిని, జ్ఞానవంతులుగా, తన స్వరూపులుగా మారుస్తున్నారు సాయిబాబా. కుల, మత, వర్ణాల, భేదాలు లేకుండా సర్వులను ఉద్ధరించే అవతారమూర్తి శ్రీ శిరిడీసాయిబాబా. నేడు ప్రపంచమంతా ఎదురుచూస్తున్న ఆధ్యాత్మిక చక్రవర్తి శ్రీ సాయిబాబా. అటువంటి జగద్గురువు మనకు లభించారు. ఇక గురువు కొరకై అన్వేషణ అవసరంలేదు. ఇక చేయవలసింది గురువుకు సేవ చేయటము, సేవ చేయటము అంటే మనకు వీలు కలిగినప్పుడో, బుద్ధి పుట్టినప్పుడో, అవసరమున్నప్పుడో చేసేది సేవకాదు. సేవ అంటే స్వాతి చినుకుకై ఆలుచిప్ప ఎదురుచూస్తున్నట్లు ఎదురుచూసి, కురిసిన మొదటి నీటి బిందువు ముత్యంగా మార్చుకొని, తనలో అది ఇముడ్చుకున్నట్లు, ఎప్పుడు గురువు ఆజ్ఞాపిస్తారో అని ఆయన నోటిమాటకై ఎదురుచూడటమే. అంతకుముందు సేవ చేశామన్నా, ఆతరువాత చేశామన్నా ఉపయోగము ఉండదు. "సరియైన సమయంలో సరియైన విధముగా, సరియైన పనిచేయటమే యోగము". శ్రీసాయి తన గురుసేవకై చేసిన యోగము అదే. జ్ఞాన బోధకోసం తన గురువువెంట గుహలోనికి ప్రవేశించిన సాయి, 12 సంవత్సరాలు నిరంతరము తన గురువు ఎప్పుడు ఏమి చెప్తారో అని ఎదురుచూస్తూ ఉండిపోయారట. ధ్యానస్థులైన తన గురువు నోటికి ఆహారమందించి, విసర్జించిన మలమూత్రాదులను శుభ్రంచేసి, నిరంతరం తన గురువుపై దృష్టి నిలిపి ఉండిపోయినారట. అట్లా ఏకాగ్ర దృష్టితో చూస్తున్నప్పుడు తన కన్నులు బరువెక్కి, దృష్టికి అంతరాయంగా, కనురెప్పలు మూతపడితే, వాటిని పెరికివేస్తే బాగుంటుందని తలచారట. అదీ గురువు సేవకై ఎదురుచూడటం. **"నా గురువును నేను సేవించినట్లు నన్ను సేవించేవారు ఒక్కరు కూడ కనిపించలేదు"** అన్నారు శ్రీసాయి. అయితే బాబాకు సేవ చేయటము అంటే ఆయనను పూజించటం కాదు, శాలువాలు, నగలు ఇవ్వటం కాదు, ఆలయాలలో కొద్దిసేపు సేవచేయటము కాదు, "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునేవాడు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను, నా ఈ భౌతికదేహం నుండి నా గురువు నన్నెప్పుడో విడుదల చేశారు" అన్నారు శ్రీసాయి. మన ఎదుట నిలచిన సకల చరాచర దృశ్యమానమంతా సాయి స్వరూపమే. ఆ విషయము ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా బోధించినా, అర్ధంచేసుకొని, ఆచరణ చేయనటువంటి మనవంటివారిపై అపారమైన ప్రేమతో సాయి 1918 అక్టోబరు 15వ తేదీ మంగళవారం, విజయదశమి పర్వదినాన తన భౌతికదేహం వీడి, **సృష్టి చైతన్యంలో నిలచి, సర్వవ్యాపకమైనారు**. విజయదశమి అనగా "రాక్షసత్వం పై దైవత్వం గెలుపు" విజయదశమికి, అటు దైవపరంగాను ఇటు గురుపరంగాను ఒక ప్రత్యేకత ఉంది. విజయదశమి అంటే దసరా సరదాల పండుగ. బంధుమిత్రుల కలయికలు, పిండివంటల ఘుమ ఘుమలు ఒకవైపు, మాంస, మద్యాల మత్తు ఇంకొకవైపు, ఎందుకంటే తమోగుణ ప్రధానమైన లోకకంటకుడైన రాక్షసుడు సంహరించబడ్డాడు, ఇక కష్టాలు, నష్టాలు, బాధలు లేవు, వాటిపై విజయం సాధించాం, ఇక అంతా ఆనందమే, అయితే పండుగలు, పర్వదినాలలోని అంతరార్ధము, వాటి అసలైన ఆచరణా విధానాన్ని మరచిపోయి, సుఖమయ ఆనంద మత్తులో ఉన్నవారిని మేల్కొలిపి, జ్ఞాన మార్గంవైపు పయనింపచేయటానికి మరల సృష్టి అంతటా వ్యాపించి ఉన్నశక్తి, శ్రీసాయి రూపంలో అవతరించి, తన దగ్గరకు లాగి "శాస్త్రాలు ఎన్నటికీ అబద్దంకాదు, మంత్రాలు ఎన్నటికీ అబద్ధం కాదు, పనికిరాని అన్వయాన్ని నీ బుర్రలో పెట్టుకున్నావు" అని వాటి నిజతత్వాన్ని ఎరుక పరచి, పండుగ రోజు మాత్రం ఆనందంగా, సరదాగా గడపటానికి ప్రయత్నంచేస్తూ, మిగిలిన జీవితం బాధలతో, వెతలతో గడపటం కాదు, జీవులందరూ నిరంతరం ఆనందంతో జీవించటానికి, రాచమార్గం ఏర్పాటుచేయటానికే సచ్చిదానంద (సత్, చిత్, ఆనంద) స్వరూపుడయిన శ్రీసాయి అవతరించింది. ఆనందం ఎక్కడో లేదు, అది నీలోనే ఉంది, నిరంతరం నీతోనే ఉంది. కోరికల సాలెగూడులో చిక్కుకొని, విలవిల లాడుతున్నావు, "కావాలనే కోరిక విడచి సర్వగతుడైన భగవంతుడిమీద మనస్సు నిలుపు గమ్యం చేరుతావు, ఇక నీ భారములు నాపై పడవేసి నీవు నిశ్చింతగా కూర్చో, అవసరమయినదంతా నేను చేస్తాను, అయితే అందుకు ముందుగా నీ శరీరమనే సత్రంలో అరిషడ్వర్గాలు అనే శత్రువులను గుర్తించి సంహరించు, అప్పుడు నీకు నాకు భేదమనే అడ్డుగోడ తొలగుతుంది. అప్పుడు నీవు శిరిడీలోనే కాదు, సప్త సముద్రాల అవతల ఉన్నా నీవెంట నేను ఉన్నాను అనే అనుభవం కలుగుతుంది నీకు" అని చెప్పటమే కాక, అర్హులైన వారికి ప్రత్యక్ష అనుభవం కూడ ఇచ్చిన సంగతి, సాయిచరిత్ర పరిశీలించిచూస్తే తెలుస్తుంది. కనుక సాయి మనచెంత లేరు, మనగోడు ఆలకించుకోడు అనే భావనను తొలగించటానికే, తాను సమాధిచెందుతూ "నా నామం

పలుకుతుంది, నా మట్టి సమాధానమిస్తుంది, నా సమాధి మీకు జవాబిస్తుంది" అని పలికి, దసరా నాడు విశ్వచైతన్యంలో నిలచారు శ్రీశిరిడీసాయినాధుడు. నవరాత్రులు ప్రారంభమయినాయి, అంటే మనలోని రాగ, ద్వేష, అసూయ, మమకారాలు అనే తమోగుణ ప్రధానమైన రాక్షస గుణాలను గుర్తించి తొలగించుకునే ప్రయత్నం ప్రారంభమయినదని గుర్తెరిగి దాని కనుగుణంగా మసలుకుంటే విజయం వరించినట్లే, అప్పుడు ఇక మనది అంటూ ఏది ఉండదు, అన్నిటా సాయినే, అంతటా సాయినే, విశ్వరూపుడైన సాయి నిజతత్వమెరిగి జీవించటమే సాయికి సేవచేయటమంటే. ఇక దసరా ఒక సరదా కాదు, ఒక బాధ్యత, మనకోసం మనపైన అవాజ్యమైన ప్రేమతో, భౌతికదేహం వీడిన శ్రీసాయి నిజతత్వం ఎరుక గలిగి జీవించటం, ఆర్తులు, అర్థార్థుల స్థితిని దాటి జిజ్ఞాసువులుగా మారటం. అటువంటివారికోసం సాయి అందించిన అద్భుతమైన మార్గం "శ్రీగురుచరిత్ర" పారాయణ. హరివినాయక సాఠె, అన్నాసాహెబ్ ధబోల్కర్ వంటివారికి శ్రీ సాయి దర్శనం, అనుగ్రహం లభించటానికి శ్రీగురుచరిత్ర పారాయణే కారణమయింది, కుశాభావు అనే ఉపాధ్యాయుడి చేత 108 సార్లు శ్రీగురుచరిత్ర పారాయణ చేయించి తన సంపూర్ణ అనుగ్రహం అందించారు శ్రీసాయి. గంగిఘీర్ వంటి మహాత్ముడు, "పేడకుప్పలాంటి శిరిడీ గ్రామానికి కోహినూర్ వజ్రంలాంటి సాయి లభించారు" అని చెప్పినా, ఇంకెందరో మహాత్ములు సాయి తమకంటే అధికుడని, తాము మేకలు కాచేవారము అయితే, సాయి పులులను కాచేవారు అని చెప్పటమే కాకుండా, తమ శిష్యులను సాయి దగ్గరకు పంపిన వారెందరో కలరు. అయినా సాయి సామాన్యమైన వ్యక్తి లాగానే జీవించారు. జగద్గురువునని తన ఆచరణ ద్వారా తెలియజేసినా, అది అర్థంచేసుకొని ఆచరించినవారు అరుదు. అంతేకాక గురువు, గురుతత్వం, గురుసేవ గురించి, పురాణోపాఖ్యానాల సహాయంతో వివరిస్తూ, మన సనాతన ధర్మమంతటికీ మూలమైన ఉపనిషత్తుల, అష్టాదశ పురాణాల, బ్రహ్మసూత్రాల, భగవద్గీతల సారమయిన "శ్రీగురుచరిత్ర" పారాయణ ద్వారా తెలుసుకోమని, జిజ్ఞాసులైన వారికి సూచించారు సాయి. శ్రీగురుచరిత్ర పారాయణ ద్వారా సాయి నిజతత్వమెరిగి, జీవించడం జరుగుతుంది. అట్లా జరిగిననాడు సకల జనావళిని ఉద్ధరించాలనే మిషతో భువిపై అవతరించిన త్రిమూర్తి స్వరూపుడయిన దత్తాత్రేయుడు, మనకు దత్తమై మానవజన్మకు సార్ధకత చేకూరుస్తాడు. దాని పారాయణ వలననే పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు సాయి విశ్వతత్వాన్ని ఆకలింపు చేసుకొని, దత్త సాయి సంప్రదాయములోని అత్యంత ప్రాముఖ్యత వహించిన అవధూత తత్వాన్ని, తాను ఎరిగి, దత్తానుగ్రహంతో సాయిస్వరూపులయిన ఎందరో అవధూతలను, మహాత్ములను తాను దర్శించటమే కాక భక్త జనావళికి వారి దర్శన భాగ్యం లభింపచేశారు. వారు చూపిన మార్గంలో పయనం చేయటానికి చేసే ప్రయత్నంగానే, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ ద్వారా వెలువడే "శ్రీ భరద్వాజ సద్గురువాణి" తన వంతు కర్తవ్యంగా, శ్రీదత్తావతారుల, అవధూతల, మహాత్ముల జీవిత బోధలను అందించటానికి ప్రయత్నం చేస్తున్నది. దానిలో భాగంగానే ఈ సంచికను, "శ్రీదత్తజయంతి ప్రత్యేక సంచికగా" మీ ముందుంచుతున్నాము. దత్త స్వరూపుడయిన శ్రీసాయిని ఆశ్రయించి, సేవించి, సంపూర్ణమైన కృప అందరూ పొందాలనే, వీలయినంతగా శ్రీదత్తాత్రేయ తత్వాన్ని అనేక రూపాలలో అందించటానికి సముద్రంలో నీటి బిందువు అంత మా ప్రయత్నం చేశాము. ప్రయత్నంలో లోపముంటే మాది, అనుమతిచ్చి అనుగ్రహించిన మహిమ శ్రీ దత్త సాయి భరద్వాజులది. ప్రయత్నం మాది, పయనం మీది, అనుగ్రహ ప్రసాదం శ్రీసాయిది.

సద్గురువును తెలుసుకోవటానికి చేసే ప్రయత్నంలో అవరోధాలుగా నిలచిన మానసికమైన రుగ్మతలను జయించడమే నిజమైన విజయదశమి, తద్వారా అమావాస్య చీకటిలో మగ్గుతున్న మన హృదయ కుహరాలలో సద్గురు జ్యోతి వెలిగి, సత్ – చిత్ ఆనంద మార్గంవైపు పయనింప చేసేదే "దీపావళి", మాష్టారుగారు చూపిన నిర్దుష్టమైన సాయిమార్గంలో పయనించటమే వారికి జన్మదిన సందర్భముగా మనమిచ్చే దక్షిణ, అది సమర్పించిన నాడు 'కదలిరాద తనే వసంతం – తన దరికి రాని వనాలకోసం' అన్నట్లు, సాయి నిరంతరం మనచెంత, మనతో, మనలో ఉంటాడు, అదే "శ్రీదత్తజయంతి".

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టుకు సంబంధించిన ప్రతి ముద్రణ అంశాన్ని గత 27 సంవత్సరాలుగా నిర్వహించటముతోపాటు, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్‌కు సంబంధించిన ముద్రణలతో పాటుగా, ప్రత్యేకించి గత 20 సంవత్సరాలుగా "శ్రీ భరద్వాజ సద్గురువాణి" పత్రిక డి.టి.పి, ముద్రణ మొదలైన ప్రతి అంశంలోనూ తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు "యునైటెడ్ పవర్ ఎంటర్‌ప్రైజెస్" అధినేత శ్రీ కె.వి.శ్రీహరి వారి సతీమణి శ్రీమతి కె. సీతాకుమారి. శ్రీ కె.వి.శ్రీహరిగారి మాతృమూర్తి శ్రీమతి కె. అనంతలక్ష్మిగారు తూర్పుగోదావరి జిల్లాలోని వారి స్వగ్రామములో స్వర్గస్తులైనారు. ఆ సందర్భముగా గత నెలరోజులుగా శ్రీహరి దంపతులు ఆకార్యక్రమములో ఉండిపోవటముతో ఈ సంచిక మీ ముందుకు రావటములో కొంత జాప్యమయింది, అన్యధా భావించవలదు. శ్రీమతి అనంతలక్ష్మిగారి ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుడిని ప్రార్థిస్తూ – శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సిబ్బంది మరియు శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు సభ్యులు.

శ్రీ భరద్వాజ సద్గురువాణి ఈ సంచికతో 20 వసంతాలు పూర్తి చేసుకొని 21వ వసంతంలోకి అడుగిడబోతున్న శుభ సందర్భములో 2021 జనవరి, ఫిబ్రవరి, మార్చి సంచికను జన్మదిన ప్రత్యేక సంచికగా, ఎక్కువ పేజీలతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాలని మా ఆకాంక్ష, మీ సహాయ సహకారాలకై రచయిత(త్రు)లు, ప్రకటన కర్తలకూ మా హృదయ పూర్వక ఆహ్వానం.



శ్రీ భరద్వాజ సద్గురువాణి మీ హృదయవాణిగా తీర్చిదిద్దటానికి నిరంతరం మా ప్రయత్నం కొనసాగిస్తుంటాము. అందుకు ఎల్లవేళలా మీ అండదండలు మాకు తోడుండాలి అని కోరుకుంటూ....

**పాఠకులకు, రచయిత(త్రు)లకూ, ప్రకటన కర్తలందరికీ**
**దీపావళి మరియు దత్తజయంతి శుభాకాంక్షలు**

**మీ పబ్లిషర్**
**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# సీమోల్లంఘన

విజయదశమి అనగానే వెంటనే దేవి నవరాత్రులు, దుర్గాపూజ మొదలైనవి గుర్తుకు వస్తాయి. అదే సమయములో సాయి భక్తులకు విజయదశమి పర్వదినాన తన భౌతిక దేహం వీడిన సాయినాథుడు గుర్తుకువస్తారు. అంతకుముందు ఒక విజయదశమినాడు "ఈ రోజే నా సీమోల్లంఘన" అంటూ శరీరం పై వస్త్రాలు తీసివేసి కోపోద్రిక్తుడైన సాయిబాబా 1918 అక్టోబరు 15న, విజయదశమి రోజున తన భౌతిక దేహమనే సీమను వీడి సృష్టిచైతన్యంలో లీనమైనారు. మనలోని అరిషడ్వర్గాలనే సీమలను దాటి చైతన్య స్వరూపుడైన సద్గురువును తెలుసుకొనటానికి ప్రయత్నము సాగించటమే మనం చేసే సీమోల్లంఘన. అట్లా చేసిననాడే మనకు నిజమైన దశమి. అనాదిగా విజయదశమి పర్వదినాన్ని ఒక పండుగలా జరుపుకుంటూ, ఆనందోత్సాహాలతో గడుపుతూ, లౌకిక సుఖసంతోషాలను కోరుకుంటూ, వాటిలో పడి మునిగిపోయే వారికి తెలియజేయటానికే ప్రకృతి స్వరూపిణి అయిన దేవి 'ద్వారకామాయి' రూపంలో అవతరించింది. మన శరీరమనే వాడాలోని దొంగలను గుర్తిస్తూ వాళ్ళను వెడలగొట్టే ప్రయత్నంగా ఒక్క అడుగు మనము ముందుకువేస్తే, తాను పదడుగులు మన వైపు వేసి చివరికంటా వెంటనుండి గమ్యంచేరుస్తానని వాగ్దానం చేయటమేకాక నేటికీ నిత్యసత్యులై తన వాగ్దానాన్ని నెరవేరుస్తున్న శక్తి స్వరూపుడు, సద్గురుమూర్తి శ్రీ శిరిడీ సాయినాథుడు.



"ద్వారకామాయి ఒడిలో చేరిన తరువాత దుఃఖానికి తావెక్కడ" అని అంటూనే, బాబా "ద్వారకామాయి ప్రవేశము ఒనరించినంతనే సర్వ సుఖసంపదలు పొందగలరు" అన్నారు. ఆ మాయి ఒడిలో స్థానము సంపాదించాలనే వారికోసం తన అవతార రూపం ద్వారా దుర్గరూపంలోని దేవి బోధను అవగతం చేసుకుంటే, అది జీవన మార్గదర్శనమై జీవిత గమ్యాన్ని తెలియజేస్తుంది. అది తెలుసుకొని ప్రయత్నం చేయటమే సీమోల్లంఘన, అది జరిగిన నాడే నిజమైన విజయదశమి, అందుకు ఆలంబన శక్తిస్వరూపిణి దుర్గాదేవి రూప-తత్వాన్ని తెలుసుకుందాము. 'దుర్గా దుర్గతి నాశని' అంటారు. అదెలా అవుతుంది అంటే - శరీరమే దుర్గం- అనగా కోట. ఈ దుర్గంలో ఉండే దుర్గయే ప్రాణం. ప్రాణం ఉంటేనే దేహం ఉన్నట్లు. దుర్గానుగ్రహం వల్లే విశ్వమంతా నిలచి ఉంది. దుర్గాదేవి దశభుజాలు, పంచ ప్రాణ, పంచోపప్రాణాలు, దశప్రాణాలకు; పంచజ్ఞానేంద్రియ, పంచ కర్మేంద్రియాలకు సంకేతాలు. దుర్గాదేవి సింహాన్ని అణచియుంచి పైన అధివసించియున్నది. సింహం కామానికి సంకేతం. దాన్ని లొంగదీసికొనాలి తప్ప అంతం చేయకూడదు. కామం నశిస్తే సృష్టికార్యమే భంగపడుతుంది. కాగా ఆమెచేత సంహరింపబడే మహిషుడు దున్నపోతు వంటి క్రోధానికి ప్రతీక. క్రోధాన్ని చంపుకోవటమే మానవునకు అవసరం. ఇలా దుర్గాతత్వం ప్రాణతత్వం కావున, దుర్గకు సమర్పించే పూజానివేదనము ప్రాణాహుతులు సమర్పించటమే. మనలో అట్టి దుర్గాశక్తిని, ప్రాణశక్తిని పెంపొందించుకొనటమే ప్రాణాయామంతోడి యోగంలో ఇమిడియున్న తత్వం. దుర్గ ప్రక్కనుండే లక్ష్మి ధన శక్తి. అది ఉండాలి కాని దివాంధం గుడ్లగూబలాగా కన్నూ మిన్నూ కానని స్థితి పనికి రాదు. దానిని సూచించేదే లక్ష్మి గుడ్లగూబను అణచియుంచి దాని నధిరోహించటం. మరో ప్రక్కనున్న సరస్వతి జ్ఞాన ప్రతీక. అది అత్యవసరం. అసత్ జ్ఞానం వీడి, సత్ జ్ఞానంతో ఉండాలి. దానిని సూచించేదే నీటిని వీడి పాలను స్వీకరించే హంసను వాహనంగా అదుపులో ఉంచుకొనటంలోని ఆంతర్యం. ప్రక్కనే ఉండే కుమారస్వామి సేనాని. దేవసేనాపతి. అతడు వీరత్వానికి ప్రతీక. అట్టి వీరత్వంతో ఆత్మరాజ్యస్థాపన చేయాలి. నెమలి లైంగిక సంబంధంలేని బ్రహ్మచర్యానికి ప్రతీక. అట్టి బ్రహ్మచర్యమునందు ఉండుటచే జ్ఞాననేత్రం, నెమలి కన్నులు, విచ్చుకొనటం జరుగుతుంది. ఇట్టి సాధనలో సిద్ధి గణపతి స్థానం. అకారణంగా అన్నిటినీ నాశనం చేసే లక్షణం ఎలుకది. సిద్ధికి భంగం కలుగ కుండా ఉండాలంటే దానిని అదుపులో ఉంచాలి. అన్నిటికీ అధిష్ఠాతగా ఉన్న శివుడు త్యాగమునకు, అద్వైతస్థితికి ప్రతీక కాగా ఆయన చేతిలోని ఢమరుకం ప్రణవనాదానికి, త్రిశూలం సత్వరజస్తమోగుణ త్రిగుణాలకి ప్రతీక. వృషము అంటే ధర్మము. అదే శివుని వాహనమైన ఎద్దు. అది నాలుగు కాళ్ళపై నుంటుంది. ఇలా పరివార సహిత దుర్గతత్వం మానవునకు మార్గదర్శకమై జీవిత గమ్యాన్ని సూచిస్తుంది. విజయదశమి పర్వదినాన ద్వారకా 'మాయి' వాసుడైన శ్రీసాయి మాత తత్వాన్ని అర్థం చేసుకుని ఆచరించటము ద్వారా మనం సీమోల్లంఘనము కావించి, సద్గురు కృపకు పాత్రులమవుదాము. విజయదశమి శుభాకాంక్షలతో

(అక్టోబరు 25వ తేదీ ఆదివారం 'విజయదశమి' సందర్భముగా ప్రత్యేక వ్యాసం సమర్పణ)

సౌజన్యం : **"త్రివేణీ సంగమము"**

రచన : **కె.వి. రంగారావు**, ఒంగోలు

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

పూర్వ జన్మ సుకృతము వలన, ఇప్పుడు చేసిన పూజలు, వ్రతాలు, ఆచార వ్యవహారాలు, నియమ నిష్టలు, సత్‌ప్రవర్తన, ధర్మనిరతి, సత్యసంధత వలన భగవంతుడు సంప్రీతుడయితే గురువు దగ్గరకు పంపుతాడు. సద్గురువు చెంతకు చేరిన తరువాత ఇక శాస్త్ర షట్కముతో గాని, సాధనా సంపత్తితో గాని అవసరం లేదు, గురువుమాటే వేదవాక్కు. గురు నామమే మంత్రముగా, గురుసేవయే పరమావధిగా జీవించటమే నిజమైన భక్తుడి లక్షణము. అంతకు మించి, చేసిన దేవతార్చన, పుణ్య, తీర్థ క్షేత్రాల సందర్శనము వలన సకల దేవతా స్వరూపుడయిన సద్గురువు సాంగత్యము లభిస్తుంది. గురువు సన్నిధియే సకల తీర్థ క్షేత్రాల, పుణ్యక్షేత్రాల నెలవు కనుక అటుపై గురు ఆదేశము మేరకు చేసిన తీర్థ యాత్రలు మాత్రమే అత్యధిక ఫలితమిస్తాయి. లేకుంటే కేవలం చర్మచక్షువులతో బాహ్యముగా దర్శించిరావటము మాత్రమే జరుగుతుంది. చివరకు ఆధ్యాత్మిక గ్రంథ పఠనముకూడ, సద్గురువు ఆదేశము మేరకు చదివినప్పుడు దానిలోని అంతరార్థము బోధపడినంతగా, స్వయంగా చదువుతుంటే తెలియదు. మన అర్హత, వ్యక్తిత్వమును అనుసరించి ఆచరణాత్మకమైన మార్గంలో పయనింపచేసి, తన స్థితికి చేరుస్తాడు గురువు. జన్మ కారకుడైన భగవంతుడి కంటే ఆ జన్మను సార్థకత మొనరించి, భగవత్ స్వరూపుడిగా మార్చి ఆ స్థితికి తీసుకెళ్ళే గురువే అధికుడు, అది తెలియజేయటానికే, అవతార పురుషులైన శ్రీరాముడు వశిష్టుడిని కుల గురువుగా, విశ్వామిత్రుడిని విద్య నేర్పిన గురువుగా స్వీకరించి సేవించినది, కృష్ణుడు సాందీప మహర్షిని గురువుగా సేవించి, ఆదర్శముగా నిలచారు. "నా దగ్గరకు వచ్చిన ప్రతి పైసాను భగవంతుడికి లెక్క చెబుతాను" అన్నారు శ్రీసాయి. అటువంటి స్థితిని ప్రసాదించే గురువు చెంతకు చేరినప్పుడే, మానవ జన్మ సార్థకత చెందటం ప్రారంభమయినట్లు. ఆవిషయం ఇండోర్‌లో హైకోర్టు జడ్జిగా పనిచేసిన శ్రీ యమ్.బి. రేగే జీవితంలోని కొన్ని సంఘటనలద్వారా ప్రస్ఫుటంగా తెలుస్తుంది.



సంప్రదాయ మరాఠీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన రేగే చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతన కలవాడు అవ్వటమే కాక ఉపనయనము అయిన తరువాత దాన్ని మరింత తీవ్రతరం చేశాడు. ప్రఖ్యాత చిత్రకారుడు శ్రీ రవివర్మ గీసిన ధ్రువనారాయణుడి చిత్రపటాన్ని ఎదురుగా ఉంచుకొని తాను ధ్రువుడిగా భావిస్తూ, శ్రీమన్నారాయణుడిని ధ్యానిస్తూ భృకుటి మధ్య దాదాపు 15 నిముషాలు శ్రీమన్నారాయణుడిని నిలుపుకునే వాడు. ఉన్నత చదువులు చదివి, హైకోర్టు జడ్జి పదవికి ఎదిగిన శ్రీ రేగే అదే సమయంలో అనేక ఆధ్యాత్మిక గ్రంథాలు చదివి ఆధ్యాత్మిక విద్యా సంపదను కూడ పెంచుకున్నాడు.

ఒకనాటి తెల్లవారు జామున శ్రీ రేగేకు మూడు కలలు వచ్చినయ్యి. మొదటి కలలో శ్రీమన్నారాయణుడు, ఎదుట తాను కూర్చొని ధ్యానిస్తున్నట్లు కలవచ్చింది. రెండవ కలలో శ్రీమన్నారాయణుడి ప్రక్కన, తలకు రుమాలు ధరించి, పొడవాటి అంగీధరించి, గడ్డముతో ముస్లింలాగా కనిపించే ఒకవ్యక్తి నిలబడి ఉన్నాడు, శ్రీమన్నారాయణుడు రేగేకు అతనిని చూపుతూ "ఈయన సాయిబాబా, శిరిడీలో ఉంటారు, నీవు ఈయనను ఆశ్రయించు" అని చెప్పేరు. మరికొంత సమయం తరువాత వచ్చిన మూడవ కలలో తాను ప్రయాణంచేస్తూ మార్గమధ్యంలో ఒక ఊరిలో ఆగేడు రేగే. మరాఠీ సంప్రదాయ దుస్తులలో ఉన్న ఒక అతన్ని విచారించగా, ఇది శిరిడీ గ్రామమని, మీరు అడిగే సాయిబాబా, మశీదులో ఉంటారు రమ్మని తీసుకువెళ్ళి, మశీదు లోపల భక్తుల మధ్య కాళ్ళు బారచాపుకుని కూర్చొన్న వ్యక్తిని చూపుతూ "మీరడిగిన సాయిబాబా ఆయనే" అని చెప్పి వెళ్ళిపోయాడా వ్యక్తి, మశీదులోకి సంశయముగా అడుగు పెట్టిన రేగేను చూస్తూనే సాయిబాబా మశీదు (ద్వారకామాయి) మెట్లు దిగి, రేగే దగ్గరకు వచ్చి "రా! నీకోసమే ఎదురుచూస్తున్నాను. వచ్చావా! చాలా సంతోషం" అంటూ రేగేను కౌగలించుకున్నారు బాబా. వెంటనే కల ముగిసి, మెలకువ వచ్చింది రేగేకు, తెల్లవారింది, సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, శ్రీమన్నారాయణుడిని ఆరాధించే తాను, ఒక ముస్లింను ఆశ్రయించటమేమిటి అనుకుంటూ ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకుని తన దైనందిన కార్యక్రమాలలో మునిగిపోయాడు రేగే. ఆ తరువాత కొన్ని నెలలకు కోపర్‌గ్రామ్ తాలూకాలో పర్యటించవలసిన పని పడింది రేగేకు, ఒక గ్రామం గుండా పయనిస్తున్నాడు రేగే.

ఆ గ్రామం ఇంతకు ముందునుంచే పరిచయం ఉన్నట్లు అనిపించి ఎదురుగా మరాఠీ సంప్రదాయ దుస్తులలో ఉన్న ఒక వ్యక్తిని ఇది ఏ గ్రామం అని అడిగేడు రేగే. శిరిడీ గ్రామమని బదులిచ్చాడు ఆ వ్యక్తి. వెంటనే రేగే మస్తికంలో కొన్ని నెలల క్రితం తెల్లవారుజామున వచ్చిన కల దృశ్యంలా కనులముందు కదలాడింది. ఎదుట వ్యక్తి కూడ కలలో కనిపించిన రూపమే, వెంటనే ఆసక్తిగా రేగే, "అయితే ఇక్కడ బాబా ఉన్నారా? ఉంటే ఎక్కడ ఉంటారు" అని అడిగేడు, వెంటనే ఆవ్యక్తి "నావెంటరండి" అని చెప్పి, కొన్ని వీధులగుండా తీసుకొని వెళ్ళి ఒక మశీదు ముంగిట ఆగి, "లోపల భక్తుల మధ్య కాళ్ళు బారచాపుకొని

కూర్చున్నాడే ఆయనే సాయిబాబా" అని చెప్పి వెళ్ళిపోయాడు. మశీదులోకి అడుగు పెట్టిన రేగే భక్తుల మధ్య పరివేష్టితుడైన బాబాను చూసి ఆశ్చర్యపోయినాడు. తనకు కలలో కనిపించిన విధంగానే కాళ్ళు చాపుకొని భక్తుల మధ్య కూర్చున్న అదేరూపం. తనకు వచ్చిన కల దాదాపు పూర్తిగా జరుగుతున్నది, ఇక చివరి అంశము, బాబా వెంటనే మశీదుమెట్లు దిగి వచ్చి "నీ రాకకోసమే ఎదురుచూస్తున్నాను" అని కౌగిలించుకుంటారు అని అనుకుంటూ ఉన్నాడు రేగే, మశీదులోకి అడుగు పెట్టిన రేగే వైపు బాబా ఒకసారి దృష్టి సారించిచూసి వెంటనే భక్తులతో మాట్లాడుతూ ఉండిపోయినారు. కొంతసమయం తరువాత భక్తుల మధ్యనుంచి లేచారు బాబా, "అమ్మయ్య ఇప్పుడు నాకల సంపూర్ణమవ్వబోతుంది" అని అనుకున్నాడు రేగే, కాని బాబా భక్తులు దులిపివేసిన తన ఆసనమైన గోనె గుడ్డమీద వెళ్ళి కూర్చున్నారు. మధ్యాహ్న హారతి ప్రారంభమయింది, హారతి అనంతరం భక్తులు బాబాకు నమస్కరించుకొని, తాము తీసుకువచ్చిన ఆహార పదార్ధాలు కొన్నింటిని అక్కడ కుండలో వేసి, మిగిలింది ప్రసాదంగా తీసుకొని వెళ్ళిపోయినారు. దాదాపు మశీదు అంతా ఖాళీ కాసాగింది. ఒక భక్తుడితో బాబా రేగేను చూపి, రాధాకృష్ణమాయి ఇంటికి భోజనానికి తీసుకువెళ్ళమన్నారు. అన్య మనస్కంగా అతనితో వెళ్ళి భోజనంచేసి వెంటనే మశీదుకు బయలుదేరేడు రేగే, "మధ్యాహ్న సమయంలో బాబా ఏకాంతంగా ఉంటారు, ఆయనను దర్శించటానికి గాని, కనీసం మశీదులోకి అడుగు పెట్టటానికి కూడ తెలిసినవాళ్ళు ఎవరూ సాహసించరు. ఒకవేళ సాహసించేవారికి బాబా దీవెనల సంగతి అటుంచి, తిట్లు, సటకా దెబ్బలు తప్పవు కనుక, విశ్రాంతి తీసుకొని సాయంత్రం బాబాను దర్శించవచ్చు" అన్నాడా వ్యక్తి, రేగే అతని సూచనను సున్నితంగా తిరస్కరిస్తూ, నడక సాగించేడు. చిన్నతనం నుంచి ఆచార వ్యవహారాలు పాటిస్తూ, అనేక ఆధ్యాత్మిక గ్రంథాలు పఠించి, వాటి సారాన్ని గ్రహిస్తూ, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడినే 'ధృవ' భక్తితో సేవిస్తున్న నాకు కల రావటమేమిటి? వచ్చిన కలలో ముస్లిం అయిన బాబాను ఆశ్రయించమని చెప్పి, శ్రీమన్నారాయణుడే శిరిడీ చేర్చటమేమిటి? తన తోటి వారిద్వారా ఆనోట, ఈనోట సాయిబాబా గురించి అంతకుముందు విన్న విషయం కలరూపంలో వచ్చిందా? బాబా కుల మేమిటో, మత మేమిటో జాతి ఏమిటో తెలియదు, ఆచార వ్యవహారాల సమస్యే లేదు, ఫకీర్లు, పేదవారితో తిరుగుతారు, పాడుబడ్డ మశీదులో నివశించి, దానికి ద్వారకామాయి అని పేరు పెట్టి, కుల, మత, జాతి, స్త్రీ, పురుష, వయోభేదం లేకుండా అందరినీ కలుపుతూ, నాలుగు పురుషార్ధాలు ప్రసాదిస్తానని చెప్పేరట. నాలుగవ పురుషార్ధము అయిన మోక్షం సంగతి అటుంచి, కోరికలు నెరవేర్చుకుంటానికి, కష్టాలనుంచి కడతేర్చుకోవటానికి బాబా దగ్గరకు చేరుతున్నారు, బాగుపడుతున్నారు కూడ, అన్ని రకాల ఉత్తమ, ఉన్నత స్థితిలో ఉన్న నాకు కోరికలు లేవు, కష్టాలు అంతకంటే లేవు, సంప్రదాయ పరుడైన తాను బాబాను ఆశ్రయించటమేమిటి? అందుకనే వచ్చిన కలను అంతగా పట్టించుకోలేదు. అయితే తెల్లవారు జామున వచ్చిన కలలు నిజమవుతాయని పెద్దలమాట. అది వాస్తవ రూపందాల్చి దాదాపుగా కల నిజమయింది, అయితే నాకోసం ఎదురుచూస్తున్నా అని కలలో అన్న బాబా, నా దగ్గరకు ఎందుకు రాలేదు? ఎందుకు రాలేదు! ముస్లిం అని ఆయనను నా మనస్సు అంతర్లీనంగా భావించి ఏవగించుకొన్నందుకా, ఐదు ఇళ్లలో బిచ్చమడిగే వాడిని, నేను ఆశ్రయించేదేమిటని భావించినందుకా, త్రికాలాలలో స్నాన సంధ్యాదులు కావిస్తూ పది మందికి ఆదర్శంగా నిలచిన నేను, ఆచార వ్యవహారాలే అసలు పాటించని, కొన్ని వారాలపాటు స్నానమాచరించక, ధరించిన దుస్తులు మార్చకుండా, మాసిపోయి, చినికిపోయిన వాటితోనే కాలం వెళ్లబుస్తున్నాడని భావించినందుకా! భవంతిలో నివసిస్తూ పదిమందికి పట్టెడన్నం పెట్టే తాను, పాడుబడ్డ మశీదులో నివసిస్తూ భక్తులు పెట్టే భిక్షతో బ్రతుకుతున్న వారిని నేను ఆరాధించటమేమిటని భావించినందుకా! సంఘంలో గౌరవ మర్యాదలు, మంది మార్బలము ఉన్న నేను, ఫకీరు అని పిలువబడుతూ, సాధు సన్యాసుల పేద శిరిడీ ప్రజలతో తిరిగే ఆయన పట్ల చులకన భావం అంతరాలలో గూడుకట్టుకున్నందుకా! లేక తాను ఆరాధించే దేవుడు, తాను గృహస్తు అయి ఉండి, సన్యాసిని ఆశ్రయించమనటమేమిటని తిరస్కరించటము వలనా, మరిదేనికి బాబా నన్ను చేరదీయలేదు, ఎందుకు చేరదీయలేదు. దాదాపు 90 శాతం నిజమైన కల, ఆ కొద్దిపాటి జరిగి ఎందుకు సంపూర్ణమవ్వలేదు, అందుకు నేను చేసిన తప్పేమిటి?" అని తీవ్ర మనోఘర్షణతో, అంతర్మధనానికి లోనైన రేగేకు అంతుచిక్కని ఆలోచనలతో తల బ్రద్ధలవుతుందేమోనని అనిపించింది. అందుకే సాటివ్యక్తి వారిస్తున్నా, బాబా కొట్టనీ, తిట్టనీ, అక్కడే అసలు సంగతి తెలుసుకుంటా అని మశీదులోకి అడుగుపెట్టి, అవును బాబాను బదులు ఇవ్వమని నేను అడిగేదేమిటి? అసలు ఇదంతా అంతర్నాటకంగా జరిపిస్తున్న జగన్నాటక సూత్రధారుడు, నా ఆరాధ్య దైవము అయిన శ్రీమన్నారాయణుడినే నిలదీసి అడుగుతా! కలలో చూపించింది ఇలలో సంపూర్ణముగా నెరవేర్చకుండా ఎందుకు ఆపేవు, దానికి కారణమేమిటి, నాకీ అంతర్మధనం ఏమిటి? నేను చేసిన తప్పేమిటి? అని శ్రీమన్నారాయణుడినే నిలదీస్తా. అడగాల్సింది బాబాను కాదు అని నిర్ణయించుకున్న వెంటనే రేగే మస్తికంలో జ్ఞాన కాంతి మెరిసినట్లయింది. ఆ వెలుగులో తనను తాను తరచి చూసుకున్న రేగే, ఒక్క క్షణం మాన్పడి పోయినాడు. అవును శ్రీమన్నారాయణుడిని ఏమని అడుగుతా, ఆయన మాటనే గౌరవించలేని నాకు ఆయన ఎదుట నిలచే హక్కుందా? బాబా ఎవరయితే నాకేమిటి? నేను త్రికరణశుద్ధిగా సేవించి, ఆరాధించే ఆ శ్రీమన్నారాయణుడి మాటనే ధిక్కరించానే, శ్రీరామ, శ్రీకృష్ణ రూపాలలో అవతరించిన శ్రీమన్నారాయణుడు గురువును సేవించి మార్గ దర్శకముగా నిలచి, నన్ను తరింపచేయటానికి నాచెంతకు వచ్చి, బాబాను చూపి ఈయనను నీవు ఆశ్రయించాలి అని చెప్పి, శిరిడీ తీసుకువచ్చి బాబాకు అప్పచెబితే, అభిజాత్యంతో, అహంకారంతో శ్రీమన్నారాయణుడి మాటనే లెక్కచేయకుండా, బాబా దర్శనానికైనా రాకుండా, కనీసం శిరిడీ గురించి కూడ విచారించని నాపై, దేవదేవుడు అయిన శ్రీమన్నారాయణుడు

అపారమైన ప్రేమతో సాయి చెంతకు బాహ్యంగా తీసుకు వచ్చినా, అహంకారంతో, బాబా నాదగ్గరకు రావాలి, వస్తాడనే భావించానే గాని, ఇంతగా తన అవాజ్యమయిన ప్రేమను చూపిన నా ఆరాధ్యదైవమయిన శ్రీమన్నారాయణుడి భక్తుడను అని భావించే నేను ఆచరణద్వారా వారి మాటను అలక్ష్యం చేసేను.

అలనాడు ప్రహ్లాదుడు నారాయణుడి కోసం తండ్రినే ఎదిరించాడే, మరి భక్తుడనని విర్రవీగిన నేను, శ్రీమన్నారాయణుడి మాటను తిరస్కరించాను. నాకు నిష్కృతి లేదు. నా యిష్టాన్నే జయించలేని నేను ఇక త్రిగుణాతీతుడైన గురువు కృపను ఎలాపొందుతాను, ఏది ఏమయినా కాని, నేను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా నా దైవం చూపిన బాబా ఆదరణకు నేను నోచుకోలేక పోయినా, నిరాదరణకు గురిచేసినా, నిర్లక్ష్యంచూపినా, వారి పాదాలను స్పృశించి, నన్ను నేను సరిదిద్దుకునే అవకాశం యివ్వమని ప్రాధేయపడతాను, బాబా తిట్టనీ, కొట్టనీ ఆయనే శరణ్యం అంటూ దృఢ నిశ్చయంతో అంతర్మథనం ద్వారా జ్ఞానామృతాన్ని వెలికి తీసుకున్న రేగే మశీదులో ముందుకు అడుగు వేశాడు, చిరు మందహాసంతో ముందుకు రమ్మని సైగచేశారు బాబా, మహదానందంతో పరుగున వెళ్ళి బాబా పాదాలపై వ్రాలేడు రేగే, అతని తలను నిమిరిన బాబా, రేగేను లేవనెత్తి కౌగిలించుకొని, పక్కన కూర్చుండబెట్టుకొని "నీవు నాబిడ్డవు, ఇతరులు ఉన్నప్పుడు మేము మా బిడ్డలను దూరంగా ఉంచుతాము" అన్నారు బాబా. ఆ మాటకు రేగే కన్నుల వెంట అప్రయత్నంగా అశ్రువులు రాలటం మొదలుపెట్టినయ్యి. అప్పుడు రేగే మదిలో మెదలిన భావం, ఆ తరువాత జరిగిన సంఘటనలను వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

## పండుగలు - పర్వదినాలు

### అక్టోబరు - 2020

2. గాంధీజయంతి
2. శ్రీలాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి
16. శరన్నవరాత్రులు ప్రారంభం
23. శ్రీ సరస్వతీపూజ
24. శ్రీదుర్గాష్టమి, మహర్నవమి
25. విజయ దశమి
25. శ్రీ శిరిడీసాయిబాబా 102వ మహాసమాధిమహోత్సవం
31. వాల్మీకి జయంతి

### నవంబరు

1. మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి జయంతి (తేదీ ప్రకారం)
3. అట్లతద్ది
 శ్రీ పూండీస్వామి ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
6. అవధూత శ్రీ నాంపల్లిబాబా ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
12. శ్రీపాద శ్రీవల్లభస్వామి ఆరాధనోత్సవము (అశ్వయుజ బహుళ ద్వాదశి)
14. నరక చతుర్దశి
 పండిట్ శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి
15. దీపావళి
17. శ్రీకాళహస్తి శ్రీ వేణుగోపాలస్వామి ఆరాధనోత్సవము
18. నాగులచవితి
20. తుంగభద్రానది పుష్కరాలు ప్రారంభం
21. శ్రీ రంగావధూత జయంతి
21. శ్రీకాళహస్తి వేణుగోపాలస్వామి ఆరాధనోత్సవము (తిథిప్రకారం)
29. శ్రీ ధునివాలాదాదా ఆరాధనోత్సవం (తేదీప్రకారం)
 శ్రీ సుధీంద్రబాబు ఆరాధనోత్సవం (తేదీప్రకారం)
29. కార్తీక పౌర్ణమి
30. శ్రీ గురునానక్ జయంతి

### డిసెంబరు


1. తుంగభద్రానది పుష్కరాలు ముగింపు
16. ధనుర్మాసం ప్రారంభం
20. శ్రీ సుబ్రమణ్యషష్ఠి
22. శ్రీ కాలభైరవాష్టమి
24. శ్రీ ఉపాసనీ బాబా ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
25. వైకుంఠ ఏకాదశి, గీతా జయంతి
 శ్రీ మాణిక్యప్రభువు సమాధిప్రవేశం
 శ్రీ సుధీంద్రబాబుగారి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
 క్రిస్మస్
29. శ్రీ దత్త జయంతి
30. భగవాన్ శ్రీ రమణ మహర్షి జయంతి
31. ఆంగ్ల సంవత్సరం (2020) కి వీడ్కోలు మరియు నూతన ఆంగ్ల సంవత్సరం 2021కి ఆహ్వాన ప్రత్యేక సత్సంగమము –పవర్‌సిటీ, వైజాగ్

### జనవరి - 2021

1. ఆంగ్ల నూతన సంవత్సర ప్రత్యేక సత్సంగమము –పవర్‌సిటీ
6. శ్రీ అనఘాష్టమీ వ్రతం
8. శ్రీ పూజ్య చంద్రశేఖరస్వామి ఆరాధనోత్సవం
10. శ్రీ అవధూత శ్రీ అనసూయమాత ఆరాధనోత్సవం
13. భోగి పండుగ
14. మకర సంక్రాంతి, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం,
15. కనుమ, అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవం
26. రిపబ్లిక్ డే
27. హజరత్ శ్రీ తాజుద్దీన్ బాబా జయంతి
30. మహాత్మగాంధీ వర్ధంతి

# భక్తి యోగసాధన


మనలో ఒకరకమైన మార్పురావటానికి అచరించే కర్మగాని, వాక్కుగాని, జ్ఞాన సంబంధమైన అంశంగాని, అనగా మనోవాక్కాయ కర్మలలో ఏదైనాసరే, లేదా మూడింటితోనైనాసరే మనలో మార్పులు తేవటం అనేది సాధించగలిగితే దాన్ని 'పూజ' లేక 'అర్చన' అంటారు.కొంతమంది ఇవన్నీ ఎగ్గొట్టి, మాది జ్ఞానయోగమండీ, అని బుకాయిస్తుంటారు . "నేను మానసిక పూజ చేస్తానండీ" అంటారు. అంటే భౌతికంగా చేయటానికి అతడు సిద్ధపడడు. పూజ మానసికంగా చేసేవాడు భోజనం గూడ మానసికంగా ఎందుకు చెయ్యడు? భోజనం మాత్రం భౌతికంగా చేస్తాడట. పూజ మాత్రం మానసికంగా చేస్తాడట. మానసిక పూజయందు నిజంగా నమ్మకం ఉంటే, భోజనం గూడ మానసికంగానే చెయ్యాలి. మట్టితిని, మంచినీళ్ళు తాగాలి. కాని ఆ పని చెయ్యడు గదా! అందుకని భౌతికమైన ఆచరణకు ఒల్లని వేదాంతం దొంగవేషమౌతుంది. భక్తియోగం దగ్గరికి వచ్చేటప్పటికి ఆచరణే ప్రధానమవటం వల్ల, వేదాంతపు కబుర్లన్నీ తేలిపోతాయి. అందువలన నారదులవారు "భక్తి సాధన పరిపూర్ణత వచ్చిన తరువాత కూడ తోటివారికి ఆదర్శంగా నిలవటానికై సాధన చేస్తూనే ఉండాలి" అని ఉపదేశించారు.




ఎవరైనా ఏపని అయినా సక్రమంగా 12 సంవత్సరాలు కనుక నిరాటంకంగా కొనసాగిస్తే ఆ తరువాత అప్రయత్నంగానే అది కొనసాగుతుంది. అది లౌకికం కావచ్చు ఆధ్యాత్మికం కావచ్చు అందుకనే సి.వి.వి. గారు ఇలా వాగ్దానం చేశారు. "పన్నెండు సంవత్సరములు వరుసగా నన్నుగూర్చి ప్రతిరోజు ప్రొద్దున, సాయంకాలం ప్రేయరు చేసినట్లైతే, అట్టివాడు నన్ను పట్టుకోనక్కరలేదు. నేనే అతన్ని పట్టుకుంటాను. దయ్యమైనా వదులుతుందేమోగాని, నేనాతనినివదలను." భక్తి సాధన పూర్తియైన తర్వాత కూడ పూజాదులు కొనసాగించపలెను, అందువలన చక్కని ప్రయోజనము కలదు. ఒకడు పూజ, అర్చన, ఎలాచేస్తునాడో చూసి అతనిలాగ పూజచేసే వాళ్ళు కొందరు తయారౌతారు. తరువాత క్రమంగా ఎందరో నేర్చుకుంటారు. వారిని బట్టి వారి ఇంట్లో వాళ్ళు నేర్చుకుంటారు. ఈ పద్ధతినే 'శాస్త్ర రక్షణము' అంటారు. ఇంతమంది కూర్చోని పూజ చేస్తుండగా ఒక రికార్డు తయారు చేశారనుకోండి. దాంతో పూజ చేసుకోనే శాస్త్రమని ఒక పుస్తకం పుట్టుతుంది. అంతకంటే ప్రమాణం ఏం ఉంటుంది? అయితే ఇందులో పొరపాట్లు ఉంటేనో? అని సందేహం రావచ్చు. ఇందులో నిజంగా పొరపాట్లు ఉంటే, పూజచేసే ఇంతమందిలో ఎవడికో ఒకడికి తట్టుతుంది. ఇది ఇలా ఉంటే బాగుంటుంది గదా అని. ఎందుకంటే ఇన్ని రూపాలలో ఉన్న దైవం ఒక్కడే గదా అని మనం పూజ చేస్తున్నది. ధర్మం ఎలా తెలుస్తుంది.? ఆ చేస్తూఉన్న శ్రద్ధలో ధర్మం తెలుస్తుంది. "ఆచార ప్రభవో ధర్మః- ఆచారము నుండి ధర్మము ప్రభవిస్తుంది, బయటకు వ్యక్తమవుతుంది లేదా ఆచారము దేనినుండి ప్రభవిస్తుందో అది గూడ ధర్మమే. ఇలాటి వాళ్ళు ఎవరైనా శ్రద్ధగా ఒకళ్ళు ఒక పదేల్లు పూజచేసేటప్పటికి, కనీసం పది పదులు, వందమంది చేస్తారు అలా చేస్తూ ఉండేదాన్ని అర్చనం అంటారు.

గుహుడు రాముణ్ని ఎలా అర్చించాడు? శబరి ఎలా అర్చించింది? " ఓం కేశవాయ నమః, ఓం నారాయణాయ నమః " అని అర్చించిందా? ఆవిడకు వచ్చా ఇవన్నీ ? సంస్కృతంలో పిలిస్తేనే పలుకుతాడా దేవుడు? అదేమీలేదు, 'కేశవాయ' అంటే కేశవుని కొరకు" 'నమః' అంటే 'నమస్కారము' అంతేగదా! ఆ భావన ప్రధానంగాని, సంస్కృత భాషలోనే పిలుస్తేనే దేవుడు పలుకుతాడని ఏమీలేదు. మరి సాలెపురుగు తరించింది. ఏనుగు తరించింది. అవి ఏదేశంలో చదువుకున్నవి? ఏ శాస్త్రములు చదువుకున్నవి? "చెంచు ఏ మంత్ర మూహించెన్" అన్నాడు ధూర్జటి మహాకవి. అసలు మంత్రములు ఎలా పుడతాయి? అవి హృదయాల్లోంచి పుడతాయి, అవతరిస్తాయి. భక్త్యావేశ్యంతో ఎవరైనా అన్న మాటలే తరువాత మంత్రములైనాయి. కావున ఇక్కడ శాస్త్రరక్షణమనగా ఫలాని భాషలో, ఫలాని పద్ధతిలోనే పూజకాని, స్తోత్రం కాని చేసే విధానమనికాదు. ఏ భాషలోనైనా భక్త్యావేశంతో, హృదయమార భగవంతుణ్ని గూర్చి పలికినపుడు ఎవరు పలికినా అవి మంత్రములౌతాయి. పదిమంది ఒక సమయానికి కూర్చోని ఒకే పద్ధతిలో దేవుణ్ని పూజించటం చేసినప్పుడు అదొక సంప్రదాయంగా ఏర్పడి, శాస్త్రరక్షణం జరుగుతుంది. కొన్నాళ్ళయ్యేపాటికి భక్తి అనే కార్యక్రమం ఇందరి హృదయాలలో స్థిరపడుతుంది, పూజ, అర్చనం అనేదానికి అర్థం అది. మనం చేత్తో చేస్తున్నపని, నోటితో చేస్తున్న స్తోత్రం – వీటన్నిట్లో అందరి హృదయాలయందును జనార్ధనుడు అనగా అంతర్యామి స్థాపించుకుంటాడు. పూజకు ఈ స్థాపనే ముఖ్యము. ఇది ముఖ్యముగాని ఎంత స్తోత్రము చేశారు అనేది కాదు. మన ఇష్టం ఏ స్తోత్రమైనా చేయవచ్చు. ఏ పద్ధతిలోనైనా పూజ చేయవచ్చు. ఏది చేసినప్పటికి మన హృదయాల్లో ఇది చేద్దామనే సంకల్పం ఒక్క స్వరూపుడుగా ఉన్న అంతర్యామి అనే చైతన్యం వ్యక్తమై,బాగా మనం దాని అందుబాటులోనికి వచ్చి, ఆ చైతన్యం లోనికి మనం ప్రవేశించేటట్లుగా అది వికాసం చెందటం ముఖ్యం. మనం గ్రహించవలసిన విషయం ఇది. మన హృదయాల్లో మంచి పనిచేద్దామని అనిపించిందనుకోండి. ఆ మంచి పనిని చేస్తున్న కొద్దీ ఏమవుతుంది? అన్పించటం అనేచోట ఉన్న రహస్యం వ్యక్తమౌతుంది. పిమ్మట ప్రకాశమానమౌతుంది. దానియందు మనం స్థిరపడతాం. ఇదీ భక్తియోగమంటే. ఎవడెక్కువ భక్తుడు అని ఉండదు. భక్తిలోనికి ఎవడు ప్రయాణం చేస్తున్నాడు అని ఉంటుంది. భక్తియోగ సాధన చేసినవానికి రావల్సిన స్థితి వచ్చిన తర్వాత గూడ అతడు అదే సాధన చేస్తుంటాడు.

**– కులపతి శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులు**



# శ్రీ గురు చరిత్రామృతము

వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు

"సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకొచ్చినట్లు పిడకలు ఏరుకోవటానికా?" అన్నారు ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయిబాబా. "సద్గురువు ధ్యాసలేకుండా గడిపిన ప్రతి క్షణమూ మృత్యువును పేనేతాళ్ళు" అన్నారు సాయి మాస్టర్ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ. సద్గురువు సమాశ్రయము ద్వారానే మానవ జన్మకు సాఫల్యం చేకూరుతుంది. ఆవిషయాన్నే శ్రీమహావిష్ణువు, మానవుడిగా (శ్రీరాముడిగా) జన్మించి, మనకు ఆచరించి చూపింది. జీవితంలో తెలియని ప్రతి విషయము తెలియజేసే ప్రతిదీ గురుస్వరూపమే. అయితే జన్మ సార్ధకత చెందిస్తూ, నిరంతరం వెంటనుండి నడిపించే సద్గురువు లభించటము ఎంతో దుర్లభము. మన జన్మ సంస్కారము వలన అంతటి గురువు లభించకపోయినప్పటికి, లభించిన గురువును అపారమైన విశ్వాసముతో, మర్కట కిశోరన్యాయం లాగా, అంటిపెట్టుకొని సేవించటము ద్వారా, అనేక రూపాలలో సృష్టి అంతటా ఆవరించి ఉన్న గురువు అనేక రూపాలలో తారసిల్లి ముందుకు నడిపిస్తారు. "గడ్డిపోచనయినా గురువుగా భావించి సేవిస్తే అది గమ్యం చేరుస్తుంది" అని శ్రీ సాయిబాబా బోధలోని ఆంతర్యం అదే. 24 మంది గురువులు నుంచి జ్ఞానం సముపార్జించి ఈ స్థితి పొందేనని యయాతి మహారాజుతో అవధూత చెప్పిన విషయాన్ని అవధూతోపాఖ్యానములో చూడవచ్చు. భూమి, గాలి, నీరు, నిప్పు, ఆకాశం, సాలె పురుగు, పాము, కొండచిలువ, చీమ, పసిబాలుడు, స్త్రీ, వేశ్య మొదలైన అనేక రూపాలలో 24 మంది గురువుల నుండి జ్ఞానం సముపార్జించటమంటే సృష్టిలో ఏ జీవిని, ప్రాణిని చివరకు క్రిమికీటకాదులను కూడ హీనముగా చూడవద్దు అని భావం. భగవంతుని దృష్టిలో మనము ఎంతో, అవి అంతే. భగవంతునిలా (మనిషిరూపం) భౌతికరూపం పొంది, జ్ఞానం కలిగిన మనిషి, సాటి జీవుల జీవితాన్ని గమనించి జ్ఞానం సముపార్జించి, మహనీయుడుగా మారమనే అవధూత బోధలోని ఆంతర్యము. గురుబోధలోని ఆంతర్యాన్ని గ్రహించలేక, తనకు అనుకూలముగా, అనుగుణమైన రీతిలో, తనకు ఇష్టమైన విధముగా గురువును సేవించి, గురువు తనను చేరదీసి ఆదరించి, బోధించి, తనంతటి వాడిని తక్షణమే చేయలేదని, గురునింద చేస్తూ, దూషిస్తూ, హీనజన్మకు దిగజారే విధముగా జీవించే వారందరికీ కనువిప్పు కలిగేలా, నామధారకుడిని నిమిత్తమాత్రునిగా చేసుకుని, సిద్ధయోగి బోధించిన అద్భుతమైన పురాణోపాఖ్యానం, సకల వేదాలు, ఉపనిషత్తులు, పురాణాల సారమైన "శ్రీగురుచరిత్ర"లోని 16వ అధ్యాయములో ప్రస్ఫుటముగా తెలియజేయబడింది.

"తన దేశాటనలో భాగముగా వైద్యనాధము చేరిన శ్రీ నృసింహసరస్వతి స్వామి, తనను అనుసరించి వచ్చిన గృహస్థు, సన్యాసి శిష్యులకు తీర్థయాత్రలకు వెడలమని ఆదేశిస్తూ, వాటి ప్రాశస్త్యాన్ని వివరించిన తీరు, మీ ముఖతఃగా ఆలకిస్తుంటే నాకు వాటిని ప్రత్యక్షముగా దర్శించిన అనుభూతి కలుగుతున్నది, కనుక నాపై దయతో అటుపిమ్మట జరిగిన విషయాలను తెలుపవలసినది" అని చేతులు జోడించి వినమ్రతతో అడుగుతున్న నామధారకుడిని చూస్తూ, " శ్రీగురుడి గురించి ఇంతగా తరచి తరచి అడిగి, ఆసక్తిగా ఆలకించిన వారు ఇంతవరకు నాకు తారసపడలేదు. శ్రీగురు కథాశ్రవణం చేయాలని భావన కలగటమే కాకుండా ఆ దిశగా ప్రయత్నం ప్రారంభించిన మరుక్షణంనుండే ఉత్తమమైన పథంవైపు పయనం కొనసాగటమే కాకుండా అతనిలోని దుష్కర్మ నశించటం ప్రారంభమవుతుంది. కొంతకాలము నుండి అవిద్యామాయలో చిక్కుబడి శయనస్థితిలోకి జారిన నాచిత్తాన్ని నీ పరిప్రశ్న అనే జ్ఞానజ్యోతితో జాగృతమయ్యేలా చేసి, నీవు నాకు ప్రాణ మిత్రుడవయినావు. శ్రీగురుశిష్యశిరోమణి, గురుభక్త చూడామణి అయిన నీవు జీవితాన్ని ధన్యత చెందించుకుంటున్నావు. సచ్ఛిష్యుడవయిన నీ సాంగత్యము వలన నాలో నిబిడీకృతమైన శ్రీగురుచరితామృతము స్మృతిపథమున ప్రకాశిస్తూ, నా ఆంతర్యములో అంతులేని ఆనందాన్ని కలుగజేస్తున్నది. శ్రవణానందముతో తరచి తరచి శ్రీగురుని లీలలు అడుగుతున్న నీవు, గతములో అంతులేని దుఃఖముతో జీవిత యాత్ర కొనసాగిస్తూ, అజ్ఞానాంధకారములో మునిగిపోయి, చివరకు ప్రాయోపవేశానికి (ప్రాణత్యాగము) కూడ సిద్ధమైనావు, శ్రీగురుకథ శ్రవణంతో, నేడు శ్రీగురుచరితామృతమనే సాగరములో ఓలలాడుతూ, ఆనంద డోలికలలో మునిగిన నిన్ను చూస్తూ, నేనూ అదే పారవశ్యాన్ని పొందుతున్నాను, నీవు చేసిన ఈ అత్యుత్తమమైన పని వలన నేను అనంతమైన తుష్టిని, పుష్టిని పొందుతున్నాను. శ్రీ గురుచరిత్ర నీ ద్వారా సకల జనావళికి అందించే మహత్తరమైన అవకాశం కలుగజేసినందుకు, ఇకనుంచి నీ గృహము సకల సంపదలతో


తులతూగటమే కాకుండా, నీ వంశముకూడ పుత్రపౌత్రాదులతో చిరకాలము వర్ధిల్లగలదు. నా వాత్సల్యానికి పాత్రుడవైన నీవు, గురువు అనుగ్రహానికి కూడ పాత్రుడవయినావు. తత్ఫలితముగా రాబోయే కాలములో నీవు, నీవంశము లోకముచే అమిత గౌరవ మర్యాదలతో అష్టైశ్వర్యాలతో, ఆనందమయమైన సుఖ జీవనాన్ని పొందగలవు. ఇది తథ్యము. నామాటను విశ్వసించుము. ఇది నామాట కాదు శ్రీగురుని పలుకు. శ్రీగురుచరిత్ర పారాయణ, శ్రవణ, మనన, నిధి ధ్యాసలయందు నిమగ్నమైన వారుకూడ అద్భుతమైన శ్రీగురు అనుగ్రహాన్ని చవిచూడగలరు. ఇది తథ్యం. శంకకు తావేలేదు. అంతటి మహామహిమాన్వితమైన శ్రీగురుని లీలావిలాసాలను మరింతగా స్మరించుకుంటూ మనము పరమానందాన్ని పొందుదాము".

"శిష్యులందరూ తీర్థయాత్రలకు వెడలిన పిమ్మట శ్రీగురుడు వైద్యనాథములో ఒక ఏకాంత ప్రదేశములో ఉండసాగేరు ఆ సమయములో జరిగిన ఈ సంఘటన పరమాద్భుతమైనది, గురువు యొక్క విశ్వతత్వాన్ని, నిజతత్వాన్ని తెలియజేసే కరదీపిక. శ్రవణాసక్తుడవైన నీకు దానిని వచియించే సమయములో, నాటి శ్రీగురుడి బోధ సర్వులకు మార్గదర్శియై జ్ఞానమార్గంలో నడిపిస్తుంది. జ్ఞానజ్యోతిశిఖరాన్ని అదిరోహింపజేసే, ఆకథామృతాన్ని గ్రోలే ప్రయత్నం కొనసాగిద్దాము" అంటూ నామధారకుడితో శ్రీగురు లీలాశ్రవణం చేయ ప్రారంభించారు శ్రీ సిద్ధయోగీంద్రులు.



శ్రీగురుడు ఒక సంవత్సర కాలం పాటు వైద్యనాథంలో గుప్తముగా ఉండిపోయారు. ముగ్ధమనోహరమైన రూపంతో పరమేశ్వరి అయిన జగదంబిక "ఆరోగ్య ప్రదాయని" పేరిట వెలసిన అద్భుతమైన క్షేత్రం అది, సామాన్యులకే కాదు సాధు సత్పురుషులకు కూడ తక్షణమే ఆదివ్యాధులను శమింపచేసే దివ్యమైన క్షేత్రం అది. కనుకనే మనోహరమైనటువంటి ఆ ప్రాంతము ''శ్రీ వైద్యనాథక్షేత్రమని" పేరు పొందింది. అటువంటి దివ్య క్షేత్రములో శ్రీగురుడు కొంత సమయం గడపదలచారు. దాదాపు ఒక సంవత్సరము పాటు శ్రీగురుడు గుప్తముగా ఉండిపోయారు. వారికి సేవచేస్తూ, నేనూ వారిచెంతనే ఉండిపోయాను. అటువంటి సమయములో ఒక బ్రాహ్మణ ముని శ్రీగురుని చెంతకువచ్చి, అత్యంత భక్తి భావముతో నమస్కరించి, శ్రీగురుని పాదాలచెంత ప్రణమిల్లి, అనేక విధములుగా శ్రీగురుడిని స్తుతించి "స్వామీ! ఎన్నో సంవత్సరముల నుండి నేను తపస్సు కొనసాగిస్తున్నాను, అందరూ నన్ను మునివర్యుడని, సంబోధిస్తూ, గౌరవిస్తూ ఆదరముగా చూస్తున్నారు, అయినను నా మనస్సు ఇంకనూ స్థిరపడలేదు. మనసంతా ఎప్పుడూ ఏదో తెలియని వ్యాకులతతో ఉండిపోతున్నది. దిక్కుతోచని స్థితిలో, మీగురించి తెలుసుకొని, అజ్ఞాన సముద్రంలో మునకలు వేస్తున్న నన్ను జ్ఞాన తీరానికి చేర్చే, సరియైన వారు మీరేనని భావించి మీచెంతకు వచ్చాను. మీ సన్నిధిలో అప్రయత్నముగా నా మనస్సు ప్రశాంతత పొంది, హృదయం హర్షపులకిత మవుతున్నది. కనుక నిశ్చయముగా నన్ను తరింపచేయటానికే ఇచ్చట వేంచేసిన భగవత్ స్వరూపులని, సద్గురువని తెలియబడుతున్నది. అనేక సంవత్సరముల నుండి తపస్సులో మునిగియున్న కారణం వలన, నేడు గురుశుశ్రూష చేసి, తరించే స్థితిలో నా శారీరక, మానసిక స్థితులు లేవు. కనుక జగద్గురువులైన మీరు, మీ అపారమైన కరుణా కటాక్ష వీక్షణములతో నా మనస్సును స్థిరపరచి, నాకు జ్ఞానోపదేశము చేయవలసింది" అని ఆ ముని ప్రార్థించారు. అతని మొరను ఆలకించిన శ్రీగురుడు మందహాసముతో అతనిని పరికించిచూస్తూ, "ముని" అని ప్రజలచే పిలువబడుతూ, ఎంతోకాలముగా తపస్సు కొనసాగిస్తున్న నీవు మునిగా మారటానికి ఏ గురువును ఆశ్రయించి సేవించావు, వారి వలన నీవు సంపూర్ణత్వాన్ని పొందలేకపోవటానికి కారణమేమిటి" అని శ్రీగురుడు ప్రశ్నించగా, ఆ ప్రశ్నకు అతని కన్నుల వెంట జలజలా కన్నీరు జాలువారుతుండగా తన వృత్తాంతము చెప్ప ప్రారంభించాడు.

సకల ఐశ్వర్యము, సకలభోగాలు అనుభవిస్తున్న ఒక ధనవంతుడు తనకు బ్రహ్మజ్ఞానము లేకపోవటము ఒక్కటే లోటు అని భావించి, దానిని శిరిడీలో వేంచేసి ఉన్న శ్రీసాయిబాబా అలవోకగా ప్రసాదించగలరని తెలుసుకొని, ద్వారకామాయిలోని శ్రీసాయి చెంత చేరి, తనకు తక్షణమే బ్రహ్మజ్ఞానము ప్రసాదించమని, పదే పదే సాయిని వేడసాగెను, ఆ సమయములో 5 రూపాయలు నిమిత్తము ఒక బాలుడిని శ్రీసాయి పలుచోట్లకు పంపినా, ఎవరూ ఇవ్వక పోవటముతో, ఆ బాలుడు రిక్తహస్తములతోనే తిరిగి వచ్చేడు. తన గ్రామము నుండి శిరిడీకి రాను పోను టాంగాను బాడుగకు తెచ్చుకున్న ఆ సంపన్నుడు, సమయము మీరుతున్న కొలదీ టాంగా బాడుగ భారము కాగలదని, కనుక "అందరిచే జగద్గురువని కొనియాడబడే మీరు, తక్షణమే బ్రహ్మ జ్ఞానము ప్రసాదించమని" అడుగుతున్న అతని ఆత్రము గమనించిన బాబా, బ్రహ్మజ్ఞానము పొందటానికి కావలసిన అర్హతలు తెలియజేసి, "ఐదు రూపాయలు గురించి, ఇంతవరకు నేను చేస్తున్న ప్రయత్నము గమనిస్తూ కూడా, సన్యాసినైన నేను లౌకిక సంపదకు అర్హుడను కానని భావిస్తూ, నీవు నీ జేబులో 50 ఐదురూపాయల నోట్లు ఉండికూడ, అందులో నుండి ఒక్క దానిని కూడ నాకు ఇవ్వ ప్రయత్నించలేదు. సన్యాసి అప్పు తీసుకొనుటకు ఎట్లు అనర్హుడో, లౌకిక విషయాసక్తులలో చిక్కుబడి, మానసిక సన్యాసము చేయని నీవు కూడ బ్రహ్మజ్ఞానమును పొందుటకు అనర్హుడవు" అని తెలిపేరు శ్రీసాయి.

గురుసన్నిధిని ఆస్వాదిస్తూ, వారి కృపను పొందే విధముగా అర్హతకై మనుగడ సాగించిననాడు, సర్వాంతర్యామి, విశ్వవ్యాపకుడు అయిన గురువు మన చెంత ఉండి దరిచేర్చగలరు. ఆ విషయాన్ని మరింత విశదీకరించే శ్రీగురుచరిత్రలోని 16వ అధ్యాయములో అంతర్గతమైన, శ్రీగురుడు బ్రాహ్మణ మునికి చేసిన జ్ఞానోపదేశాన్ని వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.




# ఒక్క క్షణం !

అది ఒక చిన్న కొండ. ఆ కొండ మీద ఓ పూరిగుడిసె! ఓ ముసలిభార్యాభర్త, వారికొడుకూ కోడలూ ఆ ఇంట్లో ఉండేవారు. అంతాబాగానే ఉంది. పొద్దున లేచి గుడిసెలోంచి బయటకు రాగానే విశాలమైన ప్రపంచం కనిపిస్తుంది. ఎదురుగుండా సూర్యుడు ఉదయిస్తూ పలకరిస్తాడు. కొండ కింద ఉన్న ఊరిలో ఇంటిపెద్దాయినా, ఆయన కొడుకూ పనికి వెళ్తారు. రోజంతా ఒళ్లు వంచి పనిచేసి, మర్నాటికి సరిపడా సంపాదించుకొని ఇంటికి చేరతారు.

ఓ రోజు తండ్రీకొడుకులు ఎప్పటిలాగే పనికి బయల్దేరారు. ఆ సాయంత్రం వారి ఇంటి ముందుకి ఓ నలుగురు మనుషులు వచ్చారు. చారెడు మీసాలు, బారెడు గడ్డంతో వారంతా చాలా చిత్రంగా ఉన్నారు. కానీ వారి మొహాలు మాత్రం తేజస్సుతో వెలిగిపోతున్నాయి. 'ఎవరయ్యా మీరు! పాపం దారి తప్పి వచ్చినట్లున్నారు. రండి కాసిని మంచినీళ్లు తాగండి. మాతో కలిసి భోంచేయండి. ఈ రాత్రికి ఇక్కడే విశ్రాంతి తీసుకోండి', అంటూ ఇంటావిడ సాదరంగా ఆహ్వానించింది.



ఇంటావిడ మాటలకు ఆ నలుగురూ చిరునవ్వు నవ్వి 'మరేం ఫర్వాలేదు. మేము ఈ అరుగు మీదే కూర్చుంటాము. మీ ఇంట్లోవారంతా వచ్చిన తర్వాతే మేము ఇంట్లోకి వస్తాము' అని చెప్పారు. మరికాసేపటికి తండ్రీకొడుకులు ఇద్దరూ అక్కడికి చేరుకోనే చేరుకున్నారు. ఇంటి బయట ఉన్నవారి గురించి ఆ ఇంటావిడ వారితో చెప్పింది. వెంటనే ఆ ఇంటి పెద్దాయన బయటకు వెళ్లి– 'ఇంట్లో వారమంతా వచ్చేశాము. దయచేసి లోపలకి రండి' అంటూ ఆహ్వానించాడు.

'మేము నలుగురమూ ఒకేసారి లోపలకి రావడం కుదరదు. మాలో ఒకరు కీర్తికి ప్రతినిధి, మరొకరు విజయానికి సూచన, ఇంకొకరు డబ్బుకి చిహ్నం, నేను ప్రేమకు ప్రతిరూపాన్ని. మాలో ఎవరు మీ ఇంట్లోకి మొదటగా రావాలో నిర్ణయించుకోండి' అని వారిలో ఒకరు చెప్పారు. వారి మాటలు విన్న ఆ పెద్దాయన ఇంటిలోకి వెళ్ళి అందరితో ఆ విషయం చెప్పాడు. అందుకు "ఇందులో పెద్దగా ఆలోచించాల్సింది ఏముంది? ముందు డబ్బుని లోపలకి రమ్మనండి. ఈ పేదరికంతో చచ్చిపోతున్నాను', అన్నాడు కొడుకు.

'అబ్బే డబ్బుదేముంది! ఇవాళ ఉంటుంది, రేపు పోతుంది. కీర్తి శాశ్వతం కదా. ముందు ఆ కీర్తిని లోపలకు రమ్మని పిలవండి', అని చెప్పింది కోడలు.

'ఇన్నాళ్లూ నేను జీవితంలోని ప్రతి సందర్భంలోనూ ఓడిపోతూనే ఉన్నాను. ఇప్పటికైనా నేను విజయాలను అందుకోవాలని అనుకుంటున్నాను. నేను విజయాన్నే లోపలకు పిలుస్తాను', అన్నాడు తండ్రి.

'భలేవారే! మనం అరాయించుకోలేనంత డబ్బు, డప్పు కొట్టుకునేంత కీర్తి, తలపొగరెక్కేంత విజయం లేకపోయినా ఇన్నాళ్ళూ సుఖంగా ఉన్నామా లేదా! అందుకు కారణం మన మధ్య ఉన్న ప్రేమే! ఆ ప్రేమ మన జీవితాలలో లేకపోతే మిగిలినవి ఏవుండి మాత్రం ఏం లాభం? నా మాట విని వెళ్లి ఆ ప్రేమను లోపలకు పిలవండి', అని గట్టిగా చెప్పింది భార్య.

ఆవిడ మాట అందరికీ సబబుగానే తోచింది. వెంటనే వెళ్లి 'మీలో ప్రేమకు ప్రతినిధి ఎవరో ముందుగా రండి!' అని పెద్దాయన పిలవగానే అందులో ఒకరు లేచి లోపలకి అడుగుపెట్టారు. విచిత్రం! ప్రేమ లోపలకు అడుగుపెట్టగానే మిగతావారు కూడా ఆయన వెంటనే లోపలకు వచ్చేశారు.

'మీరు ప్రేమని కాకుండా మిగతా ఏఒక్కరిని ఎంచుకున్నా, మిగతా ముగ్గురూ తిరిగి వెళ్లిపోయేవారు. ఎందుకంటే ప్రేమ ఉన్న చోట విజయం ఉంటుంది. విజయం ఉన్నచోట డబ్బు, కీర్తి ఉంటాయి. మిగతా లక్షణాలు అలా కాదు! ఒకటి ఉంటే మరొకటి ఉండకపోవచ్చు!' అన్నాడు విజయానికి ప్రతినిధిగా ఉన్నవాడు. అప్పటి నుంచీ వారి జీవితాల్లోనూ, మనసుల్లోనూ ఏ లోటూ లేకుండా పోయింది.

ఒకరు ఎవరినైనా హృదయపూర్వకంగా ప్రేమిస్తే వారి ప్రేమ పొందటానికి తన ప్రాణం పణంగా పెట్టి ఎంత కార్యానికైనా సంసిద్ధులు అవుతారు. అటువంటి అవాజ్యమైన ప్రేమను భగవంతుడి పట్ల కలిగి ఉంటే దానిని "భక్తి" అని, వారిని 'భక్తుడు' అంటారు. భగవంతుడు తన భక్తునికి బానిసయై చరిస్తాడు. అందుకు సక్కుబాయి, మీరాబాయి, నామదేవు, తుకారాం, గోరా కుంభార్

మొదలైనవారు ఉదాహరణ. భగవంతుడు అపార కరుణామయుడు, ప్రేమమూర్తి అని అంటాము. వారి ప్రేమకు పాత్రులైనవారికి జీవితంలో ఏ కొరతా ఉండదు. విశ్వజనీయకమైన అటువంటి ప్రేమను గుర్తించి, తదనుగుణంగా జీవించమనే శ్రీసాయిబాబా బోధ. ఆత్మజ్ఞానము కోసం అన్వేషణలో భాగంగా అరణ్యంలోకి తన మిత్రులతో కలసి వెళ్ళిన సమయంలో అక్కడి బంజారా తమపై చూపిన అపారమైన ప్రేమను గుర్తించి శ్రీసాయి, ఆయనను తన గురువుగా భావించి, తనను ఐదుగంటలపాటు బావిలో తల్లక్రిందులుగా వ్రేలాడదీసినా, 12 సంవత్సరాలు ఒక గుహలో ధ్యానస్థులై ఉండిపోయినా అహర్నిశలు వారిని సేవించి వారి కృపకు పాత్రులై జగద్గురువుగా భాసించారు శ్రీ శిరిడీసాయిబాబా. "నా గురువును నేను సేవించినట్లు నన్ను సేవించేవారు ఒక్కరుకూడ కనిపించలేదు" అన్నారు శ్రీసాయిబాబా. శ్రీ సాయికి శిష్యులము ఎటూ కాలేకపోయినాము, మరి భక్తులమవుదామా! అయితే సాయిలాగ 12 సంవత్సరాలు కేవలం వేపాకు తిని వారిని సేవించ నక్కరలేదు, భక్త హనుమాన్, భక్త ప్రహ్లాద, తుకారాం, మీరాబాయి, పాండురంగడుగా మారకపోయినా, "అసూయను జయించి, అవతలివాడు మేలు పొందితే మనము ఆమేలు పొందేప్రయత్నం చేద్దాము లేదా వారికి సహకరిద్దాము. నీవు చూసేదంతా కలసి నేను, నీవు నాలో ఉన్నావు, నేను నీలో ఉన్నాను అనే భావన చేస్తుండు, ఎవరిని ఆదరించినా, ద్వేషించినా అది నాకే చెందుతుందని గుర్తించి జీవించమన్న" శ్రీసాయిబాబా బోధలోని ఒకదానినైనా ఆచరణకు ఉపక్రమించి, భక్తవశంకరుడు, అపారప్రేమమూర్తి అయిన శ్రీ శిరిడీసాయినాధుడి ప్రేమామృతాన్ని మరింత గ్రోలటానికి మన ప్రయత్నం మరింత తీవ్రతరము చేద్దాము. విజయదశమినాడు విశ్వవ్యాపకుడైన శ్రీ శిరిడీసాయినాధుడికి మనమిచ్చే దక్షిణ కావాలి అది. మరి మీరేమంటారు.

విజయదశమి శుభాకాంక్షలతో...

సంకలనం : **వి.వి.పూర్ణచంద్రరావు**

# అవధూత శ్రీశ్రీశ్రీ శివశంకర వేణుగోపాలస్వామి

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి 1969వ సం॥ మహారాష్ట్రలోని నాందేడు గ్రామం నుండి శ్రీకాళహస్తికి వచ్చిన శ్రీ శివశంకర వేణుగోపాలస్వామి జుబ్బా, పైజామాతో వచ్చారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల దర్శన అనంతరం వారిస్థితి మారి, వారిసొంత వూరికి వెళ్ళకుండా పట్టణ పురవీధులలో తిరిగేవారు, కాలక్రమేణా వారు ధరించిన వస్త్రములు మాసి, చిరిగి, ఒక్కొక్క వస్త్రం పోతూ వచ్చాయి. ఊడిపోయిన వస్త్రములను తిరిగి ధరించకుండా స్వామి దిగంబరంగా తిరుగుతూ ఉండేవారు. ఒకరోజు ఒక తల్లి వాళ్ళ పాపకు ఆరోగ్యం బాగులేదని ఏడుస్తూ వైద్యుడు వద్దకు తీసుకు వెళ్ళింది. పాపను పరీక్షించిన వైద్యుడు ఇకలాభంలేదు తీసుకు వెళ్ళండని చెప్పగా, ఆ తల్లి ఏడుస్తూ వెళ్ళుతున్న సమయములో స్వామి చూసి, వారి పరిస్థితిని గ్రహించి, మందులను వ్రాయించి పాపకు వేయించమని చెప్పారు. ఆ మందులు వాడిన తరువాత పాపకు ఆరోగ్యం కుదుటపడింది. ఒకరోజు ఆయనను



వెతుక్కుంటూ వారి కుటుంబ సభ్యులు కారులో వచ్చారు. ఆయను రమ్మని బలవంతం చేశారు కానీ ఆయన రాను వెళ్ళండని వారికి చెప్పారు. అయినా వారి కుటుంబ సభ్యులు బలవంతంగా కారులో ఎక్కించుకొన్నారు. కానీ కారు స్టార్ట్ కాలేదు ఎంత ప్రయత్నంచినా కారు స్టార్ట్ కాకపోవడంతో చుట్టూ చూస్తున్న ప్రజలు వారిని ఎందుకు ఇబ్బంది పెట్టేది ఇక్కడేవదలి వెళ్ళండని చెప్పడమైనది. అంతటితో వారి కుటుంబసభ్యులు స్వామిని కారులో నుంచి క్రిందకు దించి, వీరు డాక్టరు అని చెప్పి వారి గురించి వివరాలు అక్కడివారికి చెప్పి బయలుదేరగా కారుస్టార్ట్ అయినది. కాలక్రమేన రోజు రోజుకు ఇలాంటి మహిమలు చూసినవారు, విన్నవారు, ఆయన మామూలు వ్యక్తికాదని గ్రహించి అవధూతగా గుర్తించారు. కాలక్రమేణ ప్రతిరోజు భక్తులు ఆయనను దర్శించుకొనేందుకు బయట ప్రాంతాల నుండి కూడ వచ్చేవారు. స్వామి ఒకరోజు వారి భక్తులతో ఫలానారోజు నేను సమాధి చెందుతానని, నన్ను భరద్వాజతీర్థం (లోబావి) నందు సమాధి చేయమని కోరగా, ఏంది స్వామీ ఆ అడవిలోన సమాధి చేయాల్సింది అక్కడకు వచ్చి వెళ్ళేందుకు సౌకర్యాలులేవు. అనగా తప్పదు అక్కడకు రావాలంటే కొండ ఎక్కి దిగవలసిందే. రాబోయే కాలంలో భరద్వాజతీర్థం ఒక నందనవనం అవుతుందని, పెద్దపెద్ద భవనాల నిర్మాణం జరుగుతుందని అన్నారు స్వామి. గతంలో స్వామి చెప్పిన విధముగా ఇప్పటికి ఒక్కొక్కటి జరుగుతున్నవి. శ్రీ వేణుగోపాలస్వామివారు 1977వ సంవత్సరం నవంబర్ 17వ తేదీన గురువారం కార్తీకశుద్ధ సప్తమినాడు మహాసమాధి చెందినారు. అదే రోజు భరద్వాజతీర్థం సమీపములో (లోబావి) మహాసమాధి చేయడం జరిగింది. ఈ సమాధివద్దచేయు ఆధ్యాత్మిక సాధనలన్నీ సత్ఫలితాలు ఇస్తాయి. ఇచ్చుటప్రదక్షిణ, నమస్కారం, సద్గ్రంథపారాయణ, ధ్యానం చేసిన అత్యుత్తమ ఫలితాన్ని పొందవచ్చు. సకల శుభములు చేకూరగలవు.


(నవంబరు 21వ తేదీ కార్తీకశుద్ధ సప్తమి శనివారం అవధూత శ్రీశివశంకర వేణుగోపాలస్వామి ఆరాధనోత్సవము (తిథిప్రకారం) సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీ విజయకుమార్**, తిరుపతి

# జిజ్ఞాస

వివిధ సందర్భాలలో భక్తులు అడిగిన ప్రశ్నలకు భగవాన్ శ్రీ రమణమహర్షి ఇచ్చిన సమాధానాలను డిసెంబరు 30వ తేదీ వారి జయంతి సందర్భముగా మీకందిస్తున్నాము). – సంపాదకుడు

**ప్రశ్న: గురుకృప అంటే ఏమిటి? ఆత్మసాక్షాత్కారానికి అది ఎలా దారి చూపిస్తుంది?**



**మహర్షి :** గురువు అంటే ఆత్మ. ఒక్కొక్కప్పుడు మనిషి జీవితంలో అసంతృప్తికి గురి అవుతాడు. అతడు తనకున్న దానితో తృప్తి చెందడు. దైవప్రార్థన మొదలైనవానిద్వారా తన కోర్కెలు నెరవేర్చుకో జూస్తాడు. తద్వారా అతని మనస్సు క్రమంగా పవిత్రమౌతుంది. అతడు దైవాన్ని గూర్చి తెలుసుకో గోరుతాడు. ఐహిక వాంఛలను తృప్తి పరచుకోవటంలోకంటే, అతనిలో దైవకృపను పొందాలన్న తపన పెరుగుతుంది, అంతట దైవకృప అభివ్యక్తము కానారంభిస్తుంది. భగవంతుడు గురువు రూపంలో భక్తునికి దర్శన మిస్తాడు. సత్యాన్ని గురించి బోధచేస్తాడు. తన సాన్నిధ్య మహిమ చేత అతని మనస్సును ప్రక్షాళన మొనరిస్తాడు. భక్తుని మనస్సు బలం పుంజుకొని, అంతర్ముఖమయ్యేందుకు యోగ్యమవుతుంది. ధ్యానం వల్ల అది మరింత శుద్ధమై, శాంతమై, ఈషణ్మాత్ర స్పందనైనా లేకుండా ఉండిపోతుంది.

గురువు 'బయట', 'లోపల' కూడా ఉంటాడు. అంతర్ముఖ మయ్యేందుకు, మనస్సును బాహ్యగురువు లోపలికి ఒక త్రోపు త్రోస్తాడు. ఆత్మసన్నిధికి చేరేందుకు, మనస్సును అంతర గురువు లోపలికి ఒక గుంజుగుంజుతాడు. అలా మనస్సుకు శాంతి చేకూర్చుతాడు. గురుకృప అంటే అదే. ఈశ్వరుడు, గురువు ఆత్మ వీనిలో భేదము లేదు.

**ప్రశ్న: గురువును కనుగొనటం ఎలా?**

**మహర్షి :** సర్వవ్యాపకుడైన భగవంతుడు అవ్యాజమైన కృపచేత, తన ప్రియభక్తునిపై జాలి వహించి, అతని పరిణితికి అనుగుణమైన రీతిలో ప్రత్యక్షమవుతాడు. భక్తుడా గురువును మానవ మాత్రుడని భావించి, రెండు భౌతిక దేహాల నడుమ ఉండే విధంగా ఆయనతో సంబంధాన్ని పెట్టుకో జూస్తాడు. మానవదేహాన్ని దాల్చి వచ్చిన భగవంతుడు లేక ఆత్మ అయిన ఆ గురువు భక్తుని హృదయంలో మార్పు తెస్తాడు. తాను పోయే దారి తప్పు అని అతడు గ్రహించేలా చేస్తాడు. అతడు తనలోని ఆత్మను సాక్షాత్కరించుకొనేంతవరకూ సరియైన దారిలో అతనికి మార్గదర్శనం చేస్తాడు.

**ప్రశ్న: భక్తుడు అప్పుడు ఏమి చేయాలి?**

**మహర్షి :** అతడు గురూపదిష్టమైన రీతిగా నడుచుకోవాలి, తనలో తాను మునిగి సాధన చేయాలి. గురువు 'అంతరం'లోను ఉన్నాడు, 'బాహ్యం'లోను ఉన్నాడు. కనుక నిన్ను లోనికి నెట్టేందుకు అనుగుణమైన పరిస్థితులు కల్పించి, అదే సమయంలో కేంద్రం వద్దకు నిన్ను లాగుకొనేందుకు వీలుగా అంతరాన్ని సిద్ధ మొనరిస్తాడు. అలా బయటినుండి ఒక త్రోపు త్రోసి, లోపలినుండి ఒక గుంజు గుంజుతాడు, అలా నీవు కేంద్రంలో స్థిరంగా నిల్చి ఉండేటట్లు చేస్తాడు.

నీ ప్రయత్నాల ద్వారా లోకాన్ని జయించవచ్చునని నీవు భావిస్తున్నావు. కానీ బయట నీకు ఆశాభంగం కలిగి, నీ చూపు లోనికి తిరిగినప్పుడు, నీవు అనుకుంటావు, 'ఓహో! మానవశక్తిని మించిన మహాశక్తి ఒకటి ఉన్నది!'

అహంత మదించిన ఏనుగు వంటిది మనస్సు. ఏనుగును వశంలోకి తేవాలంటే అది ఒక సింహానికే సాధ్యం. అంతకంటే తక్కువ శక్తి గలదేదీ దానిని నిగ్రహించలేదు. అట్టి సింహమువంటివాడు గురువు. గురువు యొక్క చూపు పడిన మాత్రాన ఏనుగువంటి అహంత గజగజ వణకి, మరణిస్తుంది.

నీవు అనేవాడవు లేకుండా పోవటంలోనే నీ యొక్క ఘనత ఉంటుందని క్రమంగా నీవు గ్రహిస్తావు. ఆ స్థితి లభించాలంటే, నిన్ను నీవు సమర్పించుకోవాలి. అప్పుడే తన ఉపదేశాన్ని స్వీకరించేందుకు యోగ్యమైన స్థితిలో నీ వున్నట్లు గురువు కనుగొని, నీకు తగిన మార్గదర్శనం చేస్తాడు.

**ప్రశ్న: మన సహజస్థితి ఆనందమంటారు అది ఏ విధముగా ఉంటుంది?**

**మహర్షి :** పరిపూర్ణానందం – బ్రహ్మం, పరిపూర్ణశాంతి, ఆత్మ, సంస్థితమైనదంతా అదే. ఆ చైతన్యమే. ఆనందం ఆ ఆత్మయొక్క స్వరూపం. పరిపూర్ణమైన ఆనందమే కాని ఆత్మ మరేమీ కాదు. ఉండేదల్లా ఆ ఆనందమనబడేదే. ఆ సత్యాన్ని తెలుసుకొని, ఆత్మలో ఉంటూ, ఆనందాన్ని నిత్యము ఆస్వాదించవలెను. ఎవరైనా తన ఆనందం బయట కారణాల వల్లగాని, సంపద వల్లగాని కలుగుతుంది అని అనుకుంటే, అతని సంతోషము, సంపదతోపాటు పెరిగితే పెరిగి, తరిగితే తరగాలి కదా! కాబట్టి ఏ సంపదా లేకపోతే అతని సంతోషమూ శూన్యమైపోతుంది. కాని, మనిషి అనుభవమేమిటి? ఇట్లాగే ఉంటుందా? గాఢనిద్రలో మనిషికి ఏ సంపదా ఉండదు. అతని దేహమే ఉండదు. అయినా అసంతుష్టిగా ఉండదు. పైగా ఎంతో సంతోషంగా ఉంటాడు. మంచి నిద్రకావాలని అందరికీ ఉంటుంది కదా! అంటే సంతోషమనేది మనిషి లోపలే సహజంగా ఉంది. అది బయటి పరిస్థితుల మీద ఆధారపడి లేదు. అకళంకమైన ఆనందంకోసం తెలుసుకోవాలంటే ఆత్మసాక్షాత్కారం చేసుకోవాలి.

# ధ్యానం ఎలా చేయాలి?

ఆచార్య శ్రీ భరద్వాజ దేవోభవ. నేను ధ్యానాన్ని అభ్యసించే మొదటి రోజుల్లో ధ్యానం సరిగ్గా కుదరక సతమతమయ్యేవాడిని. ఈ విషయం మాస్టారు గారితో చెబితే, "నీవు డైరీ వ్రాయనిదే ధ్యానం సరిగ్గా కుదరదు" అని శెలవిచ్చారు. "డైరీ ఎలా వ్రాయాలో తెలియదు సార్" అన్నాను నేను. ఏముందీ ధ్యానానికి కూర్చున్న తరువాత నీకేమి ఆలోచనలు వచ్చాయో అవి డైరీలో విపులంగా వ్రాయి. వ్రాయటము అయిపోగానే మరలా ధ్యానం మొదలుపెట్టు. మరలా ఆలోచనలు వస్తే వాటిని కూడా విపులంగా వ్రాయి. ధ్యానం కుదరడములేదు అనే ఆలోచనమాని, ఎంతసేపు ధ్యానానికి కూర్చుందామనుకున్నావో, అంత సేపూ కూర్చొని వచ్చిన ఆలోచనలు డైరీలో వ్రాస్తూ ధ్యానం చేస్తూ గడుపు. ఇట్లా ఒక వారం రోజులు అయిపోయిన తరువాత నీవు వ్రాసిన డైరీ తీసుకొని నాదగ్గరకు రా! మిగతాది చెబుతా" నన్నారు మాస్టారు గారు. నేను అలాగే చేశాను. డైరీ తీసుకొని వారం రోజుల తరువాత మాస్టారుగారి దగ్గరకు వెళ్ళాను. దానిలో ఏమి వ్రాసి ఉన్నానో చూడకుండానే మాస్టారుగారు రెండవ పాఠం చెప్పారు. అది జీవితంలో మరచిపోలేనిది.



"1. వాచా శూరత్వం ఆపి, క్రియా శూరత్వం చూపు.

2. నీ ధ్యేయమంతా చిత్తశుద్ధి కలదని, అది పరమపవిత్రమైనదని తలచి, ఆ డైరీలోని విషయాలను వివేక విచారములతో విడమరచి వ్రాస్తూ సాధ్యమైనంతవరకు జీవితంలో ధ్యానానికి విఘ్నం కలిగించే పనికిమాలిన విషయాలను వదలి వేసేందుకు గట్టి కృషి మొదలుపెట్టు. అప్పుడు సాయి నీపై కరుణిస్తాడు. సర్వము సమకూడుతుంది.

ఒక జీవి ఏవేవి అనుభవించాలో అవన్నీ ముందే నిర్ణయమై నీ ఆలోచనలతో ప్రమేయము లేకుండానే నీకు లభ్యమయ్యేటట్లు భగవంతుడు ముందే ఏర్పాట్లు చేసి ఉన్నాడు, అనే సత్యాన్ని ఎన్నడూ మరువబోకు" అని ముగించారు.

మొదట వడ్డీవ్యాపారానికి సంబంధించిన ఆలోచనలు, ఆ తరువాత మా తల్లిగారు నడిపే చిన్న అంగడికి సంబంధించిన ఆలోచనలు, ఇంట్లో ఉండే దూడ, బఱ్ఱెల ఆలోచనలు, ఆ తరువాత స్కూలులో స్నేహితులతోటి, గత సంభాషణల గురించిన ఆలోచనలు మొదలగు విషయాలు అన్నీ క్రమంగా మానుకోవడంతో శ్రీసాయిశుని దయ, కృప నాపై వర్షింప మొదలు పెట్టింది. కనుక మాస్టారుగారి సలహాలోని గొప్పతనమేమిటో తెలిసి రావటం మొదలు పెట్టింది.

**పారాయణ :-**

పూజ్య శ్రీ మాస్టారుగారితో పరిచయ మయ్యాక మాస్టరుగారు ఇతరులతో చెబుతున్న అతి ముఖ్యమైన విషయం నా హృదయానికి హత్తుకున్నది. "భగవంతుడు మన నుండి నిజంగా కోరేది ఏమిటనుకున్నావు? మన కాలము, మనస్సు - ఈ రెండూ తప్ప మిగిలినవన్నీ మన తృప్తి కొరకు సమర్పించేవే కానీ ఆయన కోరేవి మాత్రం కావు" అన్నారు. ఆ మాట నా కెంతో హృదయానికి హత్తుకొని ఉదయం 6 గం॥ల నుండి 9 గం॥ల వరకు పారాయణ, పూజ, ధ్యానాలలో గడపాలనుకొని మొదలు పెట్టాను. పారాయణ మొదలుపెట్టక ముందే శ్రీ సాయిలీలామృత మంతా క్షుణ్ణంగా వంటబట్టించుకొని ఉన్నాను. పారాయణ మొదలుపెట్టిన వెంటనే పారాయణ జరుగలేదు. మొదలు పెడుతూనే ఒకటే ఏడుపు. ఒక నెల అయినా, కనీసం ఒక్క పారాయణ కూడా చేయలేక పోయాను. నా బాధను మాస్టారుగారికి చెప్పుకున్నాను. మాస్టారు గారు "నీవు కన్నీళ్ళు కార్చేటప్పుడుగాని, ఆతర్వాత గానీ నీవేమి ఆలోచిస్తుంటావో చెప్పగలవా?" అని అడిగారు. "ఏముంది సార్ సాయి లీలామృతమంతా ఏకరవు పెట్టి, వాళ్ళ కట్లా చేశావు కదా? వీరికట్లా చేశావు కదా? మరి నన్నిలా దూరము చేసి అశ్రద్ధచేస్తున్నావేమి స్వామి? నా తప్పేమిటో నాకు చెప్పకూడదా? అని సాయితో నిష్ఠూరాలాడడంతో కాలమంతా గడిచిపోతుంది. ప్రతి నిత్యం ఇదే గొడవ అయిపోయింది. ఈ పారాయణ వగైరా లేకుంటేనే హాయిగా ఉండేవాణ్ణి, ఇదెందుకు సార్!" అని నిస్పృహతో మాట్లాడేను.

మాస్టారు గారు ఎంతో ఉత్తేజంగా, ఉత్సాహంగా అన్నారు, "ఈ విషయం నీవు ఎవరితోను చెప్పవద్దు. ఈ సాధనలన్నీ చేసేది ఒకే ఒక ధ్యేయం సాధించేందుకు. ఆ ధ్యేయం ఏమిటంటే మనస్సు నిగ్రహించబడటం. దానం, స్వధర్మో నియమో యమశ్చ, శ్రుతంచ శాస్త్రాణి సద్వ్రతాని సర్వే మనో నిగ్రహ లక్షణాం తాహః" అన్నారు. "ఈ సాధనాలేమీ చేయకుండానే నీ మనస్సు సాయినాథునిపై లగ్నమవడమంటే సాయి నీపై కృప చూపినట్లే. ఎన్ని పారాయణలు చేసామనే లెక్క గాకుండా, సాయితో ఎంత సేపు ఉండగలిగాము అనే దాన్ని లెక్కలోకి తీసుకుంటూ, ఇదే విధంగా ఇంకా కొన్నాళ్ళు చేస్తూపో, చాలా సంతోషం, లెక్కకు పారాయణలు చేసేవారిని గురించి నీవు ఆలోచించవద్దు. వారిని గురించిన ధ్యాసే నీకక్కరలేదు" అని సలహా ఇచ్చారు.

(అక్టోబరు 30వ తేదీ శుక్రవారం పూజ్య శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారి జయంతి సందర్భముగా సమర్పణ)

రచన : **శ్రీ పెసల సుబ్బరామయ్య,** గొలగమూడి.

# గురుదేవదత్త వైభవం

విశ్వము యొక్క సృష్టి స్థితి లయములనే మహాకార్యములలో ఎందరు దేవతలు పనిచేయుచున్నారో వారందరి రూపములలోను పనిచేయుచున్న ఏకైక దైవం దత్తాత్రేయుడు. ఆయన యొక్క అనంతకోటి కళ్యాణగుణములు ధరించిన వివిధ రూపములే దేవతలందరు. దేవతలందరి వేషములు ధరించిన ఏకైక వేషధారి దత్తపరబ్రహ్మమే. దేవతలందరి ద్వారా కర్తవ్య నిర్వహణము చేయుచున్న దైవము దత్తాత్రేయుడే. దేవతలందరికి వారి వారి కర్తవ్యములను నిర్దేశించి చక్కని సమన్వయంతో పని చేయించే మహా ప్రజ్ఞాస్వరూపమైన గురుతత్వము దత్తాత్రేయుడే. ధర్మగ్లాని సంభవించినప్పుడు విష్ణువు లేదా శివుడు లేదా ఆదిపరాశక్తి అంశతో భువిపై అవతరించి అసురులను సంహరించే భగవదవతారములు కూడా దత్తుడు ధరించిన రూపములే. అంతేకాదు ఈ విశ్వములోని సమస్త ప్రకృతి, ప్రాణికోటి రూపములన్నీ దత్తుడు ధరించినవే. అందుకనే విష్ణు సహస్రనామములు "విశ్వం విష్ణుః" అనే నామంతో మొదలవుతుంది. విశ్వస్వరూపుడు దత్తుడే. దత్తుని మరో పూర్ణ రూపమైన శ్రీకృష్ణుడు అర్జునుడికి అనుగ్రహించిన విశ్వరూప సందర్శనమును



పరిశీలిస్తే మధ్య మూడు ముఖములు త్రిమూర్తులవే. కాబట్టి ఆ విశ్వరూపము దత్తాత్రేయుడిదే. మహావిష్ణువు యొక్క పూర్ణరూపము, కలియుగదైవము యైన వేంకటేశ్వరస్వామి కూడా దత్త స్వరూపమే. దీనికి నిరూపణగా శ్రీవేంకటేశ్వర సహస్రనామావలిలో మూడు నామములు కనబడతాయి. ఓం అనసూయానందనాయ నమః, ఓ అత్రినేత్రానందనాయనమః, ఓం త్రిమూర్తిమతేనమః అనేవి ఆ నామాలు. భగవద్గీతలో "పురుషోత్తమప్రాప్తియోగం"లో చెప్పిన పురుషోత్తముడు శ్రీ దత్తాత్రేయుడే. పురుష సూక్తములో వర్ణింపబడిన విరాట్ పురుషుడు శ్రీ దత్తాత్రేయుడే. ఇలా భగవతత్త్వం లేదా దైవతత్వమంతా శ్రీ దత్తాత్రేయుడులోని ఒక అంశం.

ఇంక రెండవ అంశం తెలుసుకొందాం. బ్రహ్మాండముల యొక్క సృష్టి స్థితిలయముల యొక్క వ్యూహారచనచేసి, నిర్వహిస్తున్న మహాప్రజ్ఞా సమన్వితమైన మహాసంకల్పమే గురుతత్వమని, అదే దత్తాత్రేయుడని క్రిందటి అధ్యాయంలో చెప్పుకొన్నాంకదా. కనుక ప్రకృతి ధర్మములు, దేవతాధర్మములు, జీవుల ధర్మములు వీటన్నిటికి ఆధారము లక్ష్యముయైన విశ్వ ధర్మములు బోధించి ఆచరింపజేసే మహాగురు స్వరూపము దత్తాత్రేయుడే. ఆయనే విశ్వగురువు. అంటే విశ్వంగా మారి, విశ్వములో ఎవరినుండైనా, దేనినుంచైనా, ఎక్కడినుంచైనా, బోధ చేయగలిగిన విశ్వవ్యాప్తమైన గురుతత్వం అని అర్థం. అన్ని కాలాల్లో, అన్ని దేశాల్లో, అన్ని గురురూపాల్లో జ్ఞానబోధ చేయుచున్న ఏకైక గురుతత్వం దత్తాత్రేయుడే. అందుకని దత్తుని యొక్క నామాల్లోకి సార్ధకమైన నామం "గురుదేవదత్త" అనే నామం. అంటే గురువు, దైవము రెండూ తానేయైన దత్తుడని విశేషార్థం. బ్రహ్మాండ పురాణంలో గురుదేవదత్త వైభవం ఇలా మనోహరంగా వర్ణించబడింది.

మందారవృక్షం క్రింద మణిపీఠమున్నది. దానిపై శ్రీ దత్తాత్రేయుడు ఆసీనుడైయున్నాడు. జటల చుట్టూ మల్లెలు, జాజులు, మెడలో మణిహారాలు, ఫణిహారాలు రుద్రాక్షహారములు, మొలపై బంగారు మొలతాడు ధరించి, వామాంకమున యోగలక్ష్మియైన అనఘాదేవి (మధుమతీదేవి), వెనుక కామధేనువు, నలువైపుల శ్వానముల (శునకములు) రూపంలో వేదపురుషులు ఉన్నారు. సనకసనందనాది యోగులు, సప్తఋషులు, సాధుసత్తములు, నవనాథులు పరివేష్టించి యుండగా, పాశము అంకుశము, పరాశక్తి, నాగేశ్వరి, కామప్రద, భువనేశ్వరి, సర్వభూతజాలము, అష్టసిద్ధులు, అష్టైశ్వర్యములు, సకల దేవతలు, దానవులు చేతులు జోడించి నమస్కారముద్రలోనున్నారు. భక్తవరదుడైన శ్రీదత్తప్రభువు చిరునవ్వుతో అభయముద్రతో కోరిన కోర్కెలు అనుగ్రహించుచుండెను. శ్రీ దత్తప్రభువు శంఖచక్రములను, గదాపద్మములను, ఢమరు త్రిశూలములను, కమండలము, జపమాలను హస్తములయందు ధరించియున్నారు. అత్రిమహర్షి అనసూయాదేవి ఉన్నతాసనములపై కూర్చుని కన్నుల పండుగగా దత్తకుమార వైభవమును తిలకించుచున్నారు. సోదరులైన చంద్ర దుర్వాసులు వికసితవదనములతో శ్రీదత్తప్రభువుని వీక్షిస్తున్నారు. చల్లని పిల్లగాలులు వీచుచున్నవి. గంధర్వులు చెవులకింపుగా గానం చేస్తున్నారు. ఆ గానానికి అప్సరసలు పరవశంతో మనోహరంగా నాట్యం చేస్తున్నారు. ప్రకృతియంతయు పులకించి మనోరంజకంగా ఉన్నది. శ్రీ దత్తప్రభువు తన కరుణా కటాక్షయోగదృష్టిని నలుదిక్కుల ప్రసరింపజేస్తున్నారు. శ్రీ దత్తస్వామిని పరివేష్టించియున్న ఋషులు, మునులు, యోగులు, దేవతలు, భక్తులు అందరునూ సర్వమును మరచి దత్తుని యొక్క పరబ్రహ్మ చైతన్యముతో అంటే విశ్వచైతన్యముతో తాదాత్మ్యము పొంది భావ సమాధిలోనికి పోయి ''దత్తోహం! దత్తోహం! దత్తోహం!'' అంటూ అద్వైతామృతయోగానుభూతిలో పరవశించిపోతున్నారు.

అంతేకాదు, శ్రీ దత్తస్వామి యొక్క దినచర్యను పురాణాలు ఇంకా ఇలా వర్ణిస్తున్నాయి. దత్తాత్రేయుడు సహ్యాద్రి నివాసి. రాత్రి సమయంలో మాహుర్‌గఢలో (మాతాపురం) శయనిస్తారు. ఉదయస్నానం కాశీలో గంగానదిలో చేసి, కురుక్షేత్రంలో ఆచమనం చేసి, గిర్నార్, గాణుగాపూర్‌లలో మధ్యాహ్నికం నెరిపి, ధూతపాపేశ్వరంలో భస్మధారణ గావిస్తూ, కర్ణాటకంలో సంధ్యావందన మాచరించి, కొల్హాపురంలో భిక్షను అర్థిస్తూ, పండరీపురంలో గంధము, తిలక ధారణచేస్తూ, పాంచాలేశ్వరంలో భుజిస్తూ, తుంగభద్రలో జలపానం చేసి, బదరీ కేదార్‌నాథ్‌లలో

శాస్త్ర శ్రవణం చేస్తూ, తిరిగి గిర్నార్ వెళ్ళి విశ్రాంతి తీసుకుంటూ, సాయం సంధ్యావందనం పశ్చిమ సముద్ర తీరంలో నిర్వహించుకొంటారు. దీనివల్ల పూర్ణపరబ్రహ్మ స్వరూపి, యోగనాధుడైన దత్తస్వామి ప్రతిరోజూ ఆసేతు హిమాచలం తిరుగుతుంటాడని, ఆయన పాదస్పర్శతో పునీతంకాని ప్రదేశం అణువంతైనా భారతదేశంలో లేనేలేదని అర్థమవుతుంది. యోగ్యులైన సాధకులకు, భక్తులకు ఎక్కడైనా సరే నిత్యం దర్శనమిచ్చి అనుగ్రహిస్తుంటారని స్పష్టమవుతున్నది. అసలు యోగనాధుడైన శ్రీదత్తస్వామి నిరంతర సంచారం వల్లనే భారత భూమి "యోగభూమి"గా ప్రసిద్ధికెక్కింది.

శ్రీ దత్తాత్రేయుడి గురించి శ్రీమద్భాగవత పురాణం, బ్రహ్మాండ, మార్కండేయ, పద్మ, మత్స్య, బ్రహ్మవైవర్త, స్కాంద, విష్ణు పురాణములలోను, హరివంశము, కాశీఖండనములలోను చెప్పబడి ఉన్నది. పురాణములలోని తత్వరహస్యములను, ధర్మసూక్ష్మములను వివరించడంలో జీవితం పండిపోయిన పురాణ ప్రవచన బ్రహ్మ బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రిగారు పద్దెనిమిది పురాణములలో ఎక్కడో అక్కడ కొద్దిగానైనా, విశేషంగానైనా దత్తస్వామి ప్రస్తావన ఉందని సాధికారికంగా తెలియజేస్తున్నారు. ఇప్పుడు మనకు లభిస్తున్న శ్రీదత్తాత్రేయగురుచరిత్ర, శ్రీదత్త దర్శనము, శ్రీదత్త పురాణము, శ్రీ దత్త భాగవతము, శ్రీదత్తమహిమ మొదలగు గ్రంధములన్నీ వ్యాసప్రోక్తమైన వివిధ పురాణములనుండి శ్రీ దత్తస్వామికి సంబంధించిన వృత్తాంతములన్నిటిని ఇటీవలకాలంలో సంకలనం చేయగా రూపొందినవే. అంతేకాని వ్యాసమహర్షి నేరుగా, ప్రత్యేకంగా శ్రీదత్తుని పేరిట పురాణమేది వ్రాయడం జరగలేదు.

శ్రీదత్తాత్రేయుల వారి గురించి పురాణములలో లభించే చరిత్రకంటే తత్వద్రష్టలు, మహర్షులు, దత్త ఉపాసకులు, దత్త ప్రసన్నులు, పూర్ణ దత్తావతారములుగా కీర్తింపబడుతున్నవారు తెలియజేస్తున్న తత్వ విశేషములే ఎక్కువగా లభిస్తున్నాయి. శ్రీ దత్తాత్రేయుల వారి పేరిట యుగయుగాలుగా లభిస్తున్న యంత్ర, మంత్ర, తంత్ర శాస్త్ర గ్రంధములనేకం ఉన్నాయి. ప్రసిద్ధమైన దత్తమంత్రములలో చాలా వాటికి శబరరూపియైన శివుడే ఋషిగా చెప్పబడ్డాయి. కాబట్టి ఇంతవరకు దత్తస్వామి గురించి చెప్పిన తత్వజ్ఞాన రహస్యముల దృష్ట్యా పురాణములలోని దేవీదేవతలు, అవతార పురుషుల మరియు పూర్ణ జ్ఞాన స్వరూపులు, గురుస్వరూపులైన మహర్షులు వీరందరి లీలావైభవమును గురువుదేవదత్త లీలా వైభవంగానే గ్రహించి గురుభక్తులైన మన మందరము ఆనందించెదము గాక!


**ఓం ద్రాం సకలదేవీదేవతావిశ్వగురుస్వరూపాయ దత్తాత్రేయాయనమః**

రచన : **శ్రీ పి.యస్.ఆర్. విజయభాస్కర్**, నిడదవోలు

# గురువునెందుకు ఆశ్రయించాలి

ఆధారం, అండలేనిదే మానవుడు వుండలేడు. ప్రతి మానవునికి ఏదో ఒక ఆధారం వుండనే వుంటుంది. ఆధ్యాత్మిక విషయానికి వస్తే భక్తునికి భగవంతుడు, శిష్యునకు గురువు ఆధారంగా వుంటారు. అయితే యిందులో కూడ ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు! ఉదాహరణకు, ఒకసారి శ్రీశైలం ప్రాజెక్టులో ఉద్యోగం చేస్తుండే ఒక ఇంజనీరు, స్వామి వారి వద్దకు వచ్చి, ప్రాజెక్టు పనుల గురించి వివరిస్తూ, ఆ తరువాత "స్వామీజీ! ఎట్టివారైనా ప్రారబ్ధకర్మలు అనుభవించక తప్పదని అంటుంటారు కదా? అలాంటప్పుడు మీలాంటి గురువులను కాని, దేవతలను కాని ఎందుకు ఆశ్రయించాలి, ఎందుకు కొలవాలి? దానివలన గలిగే ప్రయోజనమేమిటి?" అని అడుగగా వారు "నీవు యింతకు ముందు జలప్రవాహ వేగానికి ఆగలేక పెద్దపెద్ద బండరాళ్ళు నదిలో కొట్టుకొని పోయేటివి అని చెప్పావు కదా? అంతటి ఉధృతమైన ప్రవాహంలో పడి కొట్టుకొనిపోవడానికి బదులుగా, చిన్న చేప పిల్లలు ఆ ప్రవాహానికి సులభంగా ఎదురేగి పోగలవు కదా? ఆ విషయం నీకు తెలుసు కదా? అలాగే అన్యులు ప్రారబ్ధమనే ప్రవాహంలోపడి కొట్టుకుపోతుంటే దైవ కృపకు, గురుకృపకు నోచుకున్న అదృష్టవంతులు మాత్రం ఆ చిరుచేపపిల్లల్లా, ఆ ప్రారబ్ధకర్మలను సులభంగా అధిగమించ గలరు. ఆ కృపాకటాక్షమే వారికి ఆ కష్టాలను సమర్ధవంతంగా ఎదుర్కొనే మనోధైర్యాన్ని ప్రసాదిస్తుంది". "మొదట్లో మనము ఎన్నో శ్లోకాలు, స్తోత్రాలు ఎన్నెన్నో చేస్తాము. వీటి వల్ల భాగ్యవశాత్తు గురుదర్శనం లభిస్తుంది. గురువు యొక్క దర్శనమైన తరువాత గురువు ఏమి చేస్తారంటే, ఈ నామాలన్నీ ఒక నామంలో ఉన్నాయి అనే సత్యాన్ని తెలియజేసి దానిని మంత్రంగా ఉపదేశిస్తారు. ఒక్కొక్కసారి మన మనసులో ఏ దేవుని తలచుకోవాలనిపిస్తే ఆ దేవున్ని ఉపాసిస్తూ ఉంటాము. ఈ విధంగా పలురకాలుగా ఎందరో దేవతలను ఉపాసిస్తూ ఉంటాము. కానీ గురువు యొక్క దర్శనము అయన తరువాత భగవంతుడు ఒక్కడే. ఒకే రూపంలో ఉన్నాడు. అంటే గురువు అనేక నామాల నుండి ఏక నామానికి, అనేక రూపాల నుండి ఏక రూపానికి తీసుకువస్తారు. ఒక్కొక్కసారి నిరాకారానికి కూడ తీసుకువస్తారు. అప్పుడు ఆ భక్తుడు ఏక రూపానికి, తనకు భేదంలేదని గ్రహించి, తనే ఆ రూపం అనే సత్యాన్ని గ్రహిస్తాడు". పూర్ణపురుషులైన గురువును పొందడం అంత సులభం కాదు. అందుకు తపనతో కూడిన ఉపాసన అనేది ఎంతో అవసరం. అయినా జ్ఞాని విజ్ఞాని అవుతాడని చెప్పినట్లుగా, ఎవరి సంస్కారాన్నిబట్టి వారు ఆ స్థాయికి తగిన గురువు చెంతకు చేరుతారు. ఇందుకు సహాయపడే కొన్ని మార్గాలు కూడా ఉన్నాయి. అందులో ఒకటి 'హంస సోహం" పఠనం. "హా" కారం-శివ శబ్దం; "సా" కారం-శక్తి శబ్దం. శివ-శక్తి ఏకమైన శబ్దమే గురుశబ్దం. అంటే శివుడు మరియు శక్తి ఐక్యమైనటువంటిది (ఏకమైనటువంటిది) హంసశబ్దం. ఆ హంసశబ్దమే గురువు కనుక హంసమంత్రం జపించేవారికి గురువు స్థూలంగా లేకపోయినా నిరంతరం ఆ మంత్రం జపించడంవలన సూక్ష్మ రూపంలోనైనా గురువులభిస్తాడు అన్నారు మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి. (నవంబరు 1వ తేదీ మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి జయంతి సందర్భముగా సమర్పణ)

రచన : **శ్రీ సాయిదాస్ స్వామి,** హైదరాబాద్



# పూర్ణ అంతరంగాలు

"సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమైన ప్రయత్నం సాధన" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. జన్మతః సంక్రమించిన సంస్కారాలలోని ఉత్తమమైన వాటిని పెంపొందించుకుంటూ, ఉత్తమ సంస్కారాలను అలవరచు కోవటమే అసలైన సాధన. అందుకు సజ్జన సాంగత్యము సాటిలేని సహకారమవుతుంది. అయితే సత్పురుషుల సాంగత్యము అంత తేలికగా లభించేది కాదు. అందుకు తీవ్రమయిన తపన, అన్వేషణ, ఎంతో అవసరము. త్రికరణశుద్ధిగా చేసే ఈ ప్రయత్నమే సాటిలేని సద్గురువు చెంతకు చేర్చుతుంది. అసలైన సాధన ఇక అక్కడ నుండే ప్రారంభమవుతుంది. భానుడి ప్రకాశంతో సర్వం గోచరించినట్లు, సద్గురువు సన్నిధిలో మనలోని భావాలు ఒక్కొక్కటి బహిర్గతమవుతాయి. విజ్ఞతతో వాటిని గుర్తించి తొలగించుకోవడం ద్వారా, మనలోని అజ్ఞాన తిమిరాలు తొలుగుతూ జ్ఞానప్రకాశం పొడ చూపుతుంది. హృదయమనే క్షేత్రంలో జ్ఞానమనే బీజము నాటగానే ఫలాలు అందుకోవటానికి ఆధ్యాత్మికత అంటే కనికట్టు విద్య కాదు, నిష్ఠ సబూరి అనే దక్షిణ చెల్లించి శాయశక్తులా శ్రమిస్తేగాని, జ్ఞానము లభించదు. జ్ఞానసూర్యుడైన సద్గురువు సాన్నిధ్యం మనలోని జ్ఞానాన్ని ప్రజ్వలింపచేస్తుంది. భగ భగ మండే అగ్నితో చేరిన కట్టెకూడ అగ్నియై భాసిస్తుంది, అయితే అందులో తమోగుణము అనే తడి తొలిగిన తరువాతే, అంతవరకు, అగ్నితో చేరి ఉంటేనే! అదేవిధముగా సద్గురువు చెంత చేరగానే మనలోని జ్ఞానం ఉదయించకపోవచ్చు. అందుకు అవరోధమయిన అహంకార, దురహంకారాలు, ఇష్టా అయిష్టాలు, రాగద్వేషాలు ఇంకా ఎన్నో రీతుల అంతర్లీనముగా దాగి ఉన్న తమోగుణాల తడి తొలగితేగాని సద్గురుకృపకు పాత్రులం కాలేము. "కేవలం పుస్తక జ్ఞానం సరిపోదు, అందులోని విషయాలను అర్థంచేసుకొని, ఆచరణకు ఉపక్రమించిన నాడే ఫలితం చేకూరుతుంది. అది పదునైన కత్తిమీద నడక లాంటిది, యావత్ శక్తిని వినియోగించి, అతి జాగరూకతతో, అడుగు ముందుకు వేయాలి" అంటారు శ్రీ సాయినాధుడు, "సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన" అంటారు పూజ్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ.

స్వలాభాలకోసం సద్గురువు చెంతకు చేరి, అనుకున్నది నెరవేరగానే, సాయికృప తమపై అపారముగా ఉన్నదని, తాము సాయి గురువులమని భావిస్తూ, సాయికృప పంచటానికే తాము ఆధ్యాత్మిక కూటములు ఏర్పాటు చేస్తున్నామని తాము భ్రమిస్తూ, దరిచేరిన వారిని భ్రమలలో చిక్కింపచేసే వారందరికీ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆచరణే గీటురాయి.

తన అన్నగారైన శ్రీ కృష్ణమాచార్యులగారి తనయుడు, తన ఉపనయన సమయములో పరమ పదించటముతో, మాష్టారుగారు కలతచెంది, తీవ్రమయిన అన్వేషకులై, 1963వ సంవత్సరములో మొట్టమొదటి సారి శిరిడీచేరి, ఫిబ్రవరి 9వ తేదీ శ్రీసాయినాధుని సన్నిధిలో దాదాపు 5 1/2 గంటలపాటు సమాధిస్థితి అనుభవించి, శ్రీసాయి విశ్వచైతన్యాన్ని అనుభవములోనికి తెచ్చుకొని, శ్రీసాయి దర్శనంతో తనలోని సందేహాలు నివృత్తి కాగా, విశ్వవ్యాపకుడైన శ్రీశిరిడీసాయి విశ్వతత్త్వాన్ని, విశ్వరూపాన్ని అవగతం చేసుకుంటూ, శ్రీసాయి స్వరూపులైన అనేక మంది అవధూతలను, మహాత్ములను

దర్శిస్తూ, వారందరి చేత శ్రీసాయి అనుంగుబిడ్డడుగా కొనియాడబడి ''సాయిమాస్టర్''గా వినుతికెక్కెరు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజగారు. శ్రీసాయి సన్నిధిలో తనకు అద్భుతమైన అనుభవం కలిగిన తరువాత కూడ, "శ్రీసాయి విశ్వబోధను సంపూర్ణముగా అనుభవంలోకి తెచ్చుకోవటానికి దాదాపు 12 సంవత్సరాలు శోధకుడిలా తిరిగేను" అంటారు శ్రీ భరద్వాజగారు. శ్రీసాయి స్వరూపులై బాసించే అవధూతల, మహాత్ముల దర్శనానికి వెళ్ళినప్పుడు, వారిని శ్రీసాయిబాబాకు ప్రతిరూపంగా, తనలోని భావాలకు వారు నిలువుటద్దంలా భావించి, తనను తాను సరిచూసుకుంటూ, సరిచేసుకుంటూ అంతర్ముఖులై, తనను తాను ప్రశ్నించుకుంటూ, పరిణితిచెందుతూ వారి సంపూర్ణ కృపకుపాత్రులైన తరువాత కూడ సామాన్యులు గానే జీవించారు శ్రీ భరద్వాజగారు. అందుకు మచ్చు తునకలు, వారు దర్శించి అందించిన మహాత్ముల జీవితచరిత్రలు (ఆనందమాయి, శ్రీరాఖాడీబాబా, చీరాలస్వామి, శ్రీ పాకలపాటి గురువుగారు మొదలైనవి) ఎన్నో కలవు. ఆ చరిత్రలు మన సంస్కారాల మార్పుకు కరదీపికలు.

మాత ఆనందమాయి దర్శనానికి నైమిశారణ్యంలో జరుగుతున్న భాగవతసప్తాహానికి వెళ్ళి, ప్రవేశ పత్రం లేనికారణంగా రెండు రోజులు ఆ అడవిలో, మంచులో తడుస్తూ, ఆకలి, నిద్రను ఓర్చుకుంటూ శ్రీసాయి కృప తనపై కలగకపోవటానికి కారణమేమిటని తనను తాను ప్రశ్నించుకున్నారే గాని, తనకు అవకాశం కల్పించలేదని శ్రీసాయిని నిలదీయలేదు. పర్యవసానం, భాగవతసప్తాహం చేసిన శ్రీ అఖండానందస్వామి వారి ఆశీస్సులకు, శ్రీ ఆనందమాయి అనుగ్రహానికి పాత్రులవ్వటమే కాక, అటుపిమ్మట జరిగిన సంఘటనతో గురుసంప్రదాయానికి తలమానికం వంటి "శ్రీగురుచరిత్ర"ను తెలుగులో మనకందించారు శ్రీ భరద్వాజగారు.

చీరాల శ్రీధరరావుగారి ఆసుపత్రిలో టైఫాయిడ్ జ్వరంతో చేరినా, తన అన్వేషణ మానకుండా, అవధూత శ్రీ చీరాలస్వామిని దర్శించి వారు పెట్టిన పరీక్షలలో తన ఇష్టా అయిష్టాలను జయించి, వారిచేత ఎర్రస్వామి అని ప్రేమతో పిలిపించుకుంటూ, వారి సంపూర్ణమైన అనుగ్రహానికి తాను పాత్రులవ్వటమే కాకుండా, ఎందరినో స్వామివారి అనుగ్రహానికి పాత్రులను చేశారు. అన్వేషకులకు మార్గదర్శకులైన శ్రీ భరద్వాజగారు.

శ్రీ పాకలపాటి గురువుగారి సన్నిధిలో, మంత్రోపదేశాల పేరిట జరిగే తంతుని నిగ్గుదేల్చుకొని, నేటి పరిస్థితుల దృష్ట్యా శ్రీశిరిడీసాయి సంప్రదాయం, ఎంతటి మహోన్నతమయినదో వారి ద్వారా గ్రహించి, ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయినాధుని చెంతకు అత్యంత సులువుగా చేరే మార్గం మనకు సుగమం చేసి, బాబుగారి ఆదేశంతో గృహస్థులై నిలచి, లక్షలాది మందికి మార్గదర్శకులైనారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. ఎందరో మహాత్ములచే తమకంటే అధికులని ప్రశంసించబడి, అవధూతలచే "సాయి ముద్దుబిడ్డడు"గా పిలవబడ్డ శ్రీభరద్వాజగారు, శ్రీసాయి మిఠాయి అయితే, తాను అది చుట్టిన కాగితం అని, మిఠాయి ఆస్వాదించి, జీవితాన్ని మధురానందమయం చేసుకోమని చెబుతారేగాని తాను గురువునని ఎక్కడ ప్రకటించుకోలేదు. ఒక సత్సంగమములో "శ్రీసాయినాధ జై", "గురు భరద్వాజ జై" అని ఒకరు అనగా, ఆ మహరాజ్ చెంత మనం సేవకులమే గాని, అధికులము కాదు, అని అతనిని వారించిన వారి వినమ్రత, తమ శిష్యులచే అనేక బిరుదులతో కీర్తింపచేసుకుంటూ, ప్రచారం చేయించుకునే నేటి "శ్రీసాయి గురువులకు", ఇది ఎంత భిన్నమో కదా! మహాత్ముల సాంగత్యము లభించిన తరువాత మనలోని కుసంస్కారాలు అంతరించాలి, వాటిని గుర్తించి తొలగించుకోవటానికి తీవ్రమయిన ప్రయత్నం, అందుకు తగ్గ ఆత్మవిమర్శ ప్రారంభంకావాలి. మహాత్ముల సాంగత్యం బాహ్యాడంబరాలను తొలగించి, అంతర్ముఖులను చేస్తుంది. చివరకు వారంతటి వారిగా తీర్చిదిద్దుతుంది. చాలా సంవత్సరాల క్రితం ఎక్కడో చదివిన పరమాద్భుతమైన కథ ఒకటి లీలగా గుర్తుకు వస్తున్నది, జ్ఞాపకాల దొంతరలనుండి జాలువారినంత మేరకు మీతో పంచుకోవటానికి ప్రయత్నం చేస్తాను.

ఒక ఊరికి దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో ఒక సాధువు ఆశ్రమం నిర్మించుకుని జీవించసాగేరు. ఎప్పుడో అవసరమయినప్పుడు, అత్యవసర వస్తువులకోసం తప్ప ఊరిలోకి వచ్చేవారు కాదు. ఇలా కొంత కాలం గడిచింది. ఆ ఊరిలోని సంపన్నుల సంతానం అయిన సత్యంకి ఆధ్యాత్మికతపై మక్కువ కలిగి, ఒక గురువు దగ్గర ఉపదేశం పొందాలనే అభిలాష కలిగింది. అందునిమిత్తమై, సమాచారము సేకరించగా, ఊరిచివర చాలా సంవత్సరాలనుంచి ఒక సాధువు ఉంటున్నారని ఆయన చాలా ఉన్నతుడు అని, వారి ద్వారా ఉపదేశం పొందమన్న పెద్దల మాటను అనుసరించి, సాధువు ఆశ్రమానికి బయలుదేరేడు సత్యం. గతంలో నాలుగైదు సార్లు, ఊరిలో వారు ఎదురైన ఘటన గుర్తుతెచ్చుకుంటూ, వారి గురించి ఊహించుకుంటూ, ఆ సాధువు నివశించే కుటీరం చెంతకు చేరేడు సత్యం. చాల విశాలమైన ఉద్యాన వనం, మధ్యలో ఒక చిన్నపాటి నలుచదరమైన కుటీరం అది. ఆరుబయట రెండు అరుగులు, దూరంగా ఒక బావి, చుట్టూ అనేక ఫల, పుష్ప వృక్షాలతో నిండి, ముని వాటికను తలపింపచేస్తున్నది ఆ ప్రదేశము. వెదురు తడికతో పొందికగా నలుచదరంగా నిర్మించబడిన కుటీరం పైన రెల్లు గడ్డితో కప్పబడి ఉండి, ముఖద్వారం ఒక చిన్న తడికతో మూయబడి ఉంది. సమయం ఉదయం 10 గంటలు కావస్తున్నది. కుటీరం చెంత చేరిన సత్యం రెండు నిముషాలు ద్వారం చెంత వేచి ఉండి, తన రాక తెలియజేయాలని "స్వామీ! స్వామీ!" అని రెండుసార్లు గట్టిగా పిలిచాడు, వెను వెంటనే కుటీరంలో నుండి "ఎవరది" అని గద్దించిన స్వరం వినబడింది. "నేను స్వామి! పక్క ఊరిలో ఫలానా సంపన్నులవారి అబ్బాయి సత్యాన్ని, మీతో పని ఉండి వచ్చాను" అంటూ తన వివరాలు సవివరంగా చెప్పేడు సత్యం.వెను వెంటనే లోపలనుండి బిగ్గరగా "నేను చచ్చిన తరువాత రా!'' అని బదులువచ్చిన తీవ్రమయిన ఆ కంఠధ్వని విని, ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు సత్యం, "ఈ సమయంలో రాకూడదేమో",

అని భావిస్తూ, తనను ఎంతో ఆదరంతో లోనికి ఆహ్వానిస్తారు ఆ సాధువు అని భావించి వచ్చిన సత్యం ఊహించని ఆ సంఘటనతో నిరాశాభయంతో వెను తిరిగేడు. దానినుంచి తేరుకోవటానికి కొన్ని రోజులు పట్టింది సత్యానికి. వెళ్లకూడని సమయంలో వెళ్ళి, వారి తపస్సుకు అంతరాయం కలిగించానేమో, అందుకే ఆ సాధువుకు అంత కోపం వచ్చింది. మంచి సమయం చూసి వెళదామని నిర్ణయించుకొని, మధ్యాహ్న సమయములో ధ్యానంలో ఉండకపోవచ్చు అని భావిస్తూ, ఆసమయంలో ఆ సాధువు కుటీరం ముంగిట నిలచేడు సత్యం. ఆరోజు ఆకాశాన సూర్యుడు ఎందుకో తీక్షణంగా త్రొంగిచూస్తున్నాడు, అయినా సాధువు చల్లని చూపుకోసం కుటీరం ద్వారాన్ని చిన్నగా తడుతూ చప్పుడు చేశాడు సత్యం. “ఎవరది” అంటూ మరలా లోపలనుండి గంభీరమయిన స్వరం. “సత్యాన్ని, మీరు ఊరిలోకి వచ్చినప్పుడు నాలుగైదుసార్లు ఎదురయ్యేను నేను, నన్ను చూస్తే మీరు గుర్తుపడతారు, ఇంతకు ముందుకూడ మీకోసం వచ్చాను నేను” అని అన్నాడు సత్యం. “నేను చచ్చిన తరువాత రా! అని చెప్పేనుగా” మరింత తీక్షణంగా లోపలినుండి బదులురావటంతో మాన్పడిపోయాడు సత్యం. ఆయన వద్ద ఉపదేశం తీసుకోవాలని నేను వస్తే, ఆయన చచ్చిన తరువాత “నేను వచ్చి ఏమిచేస్తాను, బహుశ వారి విశ్రాంతి సమయంలో వచ్చి వారి ఏకాంతాన్ని భంగపరచానేమోనని” అనుకుంటూ విషణ్ణ వదనంతో వెను తిరిగేడు సత్యం. ఏరి కోరి వెళితే ఎదురయిన తిరస్కారభావంతో పట్టుదల పెరిగిన అతను, మరికొన్ని రోజుల తరువాత తిరిగి ఆశ్రమానికి బయలుదేరేడు. ఉదయం, మధ్యాహ్నం వెళితే తిరస్కరింపబడ్డాను కనుక చల్లని సాయంకాల సమయం అన్ని విధాలుగా అనువుగా ఉంటుందని భావించి, ఆ సమయంలో కుటీరం ముందు నిలచేడు. మరల యధాస్థితి, కుటీరం ద్వారం తడికతో మూయబడి ఉంది. కొంతసేపు ఓపిగ్గా ఎదురుచూశాడు, స్వామి బయటకు వస్తారేమోనని, వచ్చే సూచనలు ఏమి కనిపించటం లేదు, లోపలనుండి అలికిడి కూడ లేదు. ద్వారం తెరుచుకుని లోపలికి వెళదామా అని ఒక్క క్షణం అనిపించినా, సభ్యత కాదని భావిస్తూ మౌనంగా ఉండిపోయాడు అతను. జగతిని తన అరుణకిరణాలతో ప్రభావితం చేసిన భానుడు, నెమ్మదిగా పశ్చిమదిశవైపు తన పయనం కొనసాగిస్తూ గిరులమాటుకు వెళ్ళిపోయాడు. చీకటి పరదాలు, పరుస్తున్నది, వాటిని తొలగిస్తూ, కలువరేడు తన పయనం ప్రారంభించాడు. భానుడి కిరణాలతో ఉత్తేజం పొందిన ప్రకృతి, శశాంకుడి చల్లని స్పర్శతో ఉల్లాసంగా ప్రకృతి ఒడిలో సేదతీరటం ప్రారంభించింది. సూర్యకాంతులతో విరసిన పూబోణులు, ముకుళించుకుంటూ క్రీనీడల్లోకి జారుకుంటున్నాయి. ఉషాకిరణాలు, శశి రేఖలుగా మారినయ్యి. అయినా సాధువు దర్శనం కాలేదు, చివరి ప్రయత్నంగా చిన్నగా దగ్గి, ద్వారంపైన శబ్దంచేశాడు. “ఎవరది” చాలా తీక్షణంగా వినిపించింది లోపల నుంచి, నెమ్మదిగా గొంతు సవరించుకొని, వీడండి, గతంలో కొన్నిసార్లు మీ దర్శనం కోసం వచ్చాడే వాడే వీడు” అని సమాధానమిచ్చాడు సత్యం. ఈ సారి లోపలినుంచి బదులులేదు, ఏమి జరగబోతుందో ఈసారి ఏమాట వినవలసి వస్తుందో అని ఊపిరి బిగపట్టి ఉండిపోయాడు. కొన్ని క్షణాలు నిశ్శబ్దం రాజ్యమేలింది. లోపలినుంచి ఎవరో వస్తున్న అడుగులు సవ్వడి, కిర్రుమని శబ్దం చేస్తూ కుటీరం ద్వారానికి ఉన్న తడిక నెమ్మదిగా తెరుచుకుంది. రెండడుగులు వెనుకకు వేసి నుంచున్నాడు సత్యం. కుటీరంలో వెలుగుతున్న చిరుదివ్వె వెలుగులో పసిడి కాంతులతో మెరుస్తున్న సాధుస్వరూపం దర్శనం అయ్యింది. తేజోవంతమయిన ముఖం, చంద్రకాంతితో పోటీపడే పొడవాటి గడ్డం, మొలకు తెల్లని వస్త్రంతో సాధువు వాకిట ముంగిట నిలచారు. “ఎవరు నాయనా నీవు” అని మృదుస్వరంతో ప్రశ్నించారు. అనుకోని ఆ సంఘటనతో మనస్సులో మధురమైన అలజడులు చెలరేగుతుండగా మాటలు కూడగట్టుకొని “మీ దర్శన, ఉపదేశం కోసం వచ్చిన వాడు వీడే స్వామి” అని వినమ్రతతో బదులిచ్చాడు సత్యం. రెండడుగులు ముందుకు వేసి, కుటీరం బయటికి వచ్చి, అనుసరించమని సైగచేస్తూ, నెమ్మదిగా ముందుకు సాగి, ఉద్యానవనంలోని ఒక అరుగుపై ఆశీనులైనారు ఆ స్వామి. ఆయనను అనుసరించిన సత్యం, వారి సంజ్ఞతో నేలపైని ‘పచ్చిక’ తివాసిపై వారి పాదాలచెంత ముకుళిత హస్తాలతో ఆశీనుడైనాడు. చిరునవ్వులు చిందిస్తూ, అర్ధనిమీల నేత్రులై, అర్ధపద్మాసనంలో కూర్చొని ఉన్న వారి పూర్ణచంద్రబింబము వంటి మోములోని వర్చస్సుకు మంత్రముగ్ధుడై చూస్తూ, వారి ఆదేశంకోసం తన యావదృష్టి వారిపై నిలిపి మౌనంగా ఉండిపోయాడు సత్యం. క్షణాలు, నిముషాలై, గంటలుగా మారుతున్నాయి, ప్రకృతిమాత శరత్‌కాలపు మంచుతెరల ముసుగులో ఒదిగిపోతున్నది. పున్నమి వెన్నెలరేడు తన నులివెచ్చటి వెన్నెల జలతారు సర్వత్రా పరుస్తూ ఆకాశ సౌధంలో పైపైకి పయనిస్తున్నాడు. పున్నమి వెన్నెల స్పర్శతో, రేగిన మధుర భావనలతో పూలు గుస గుస లాడుతుండగా, సన్నగ వీచే చల్లగాలికి, వటపత్రాలు తమ కదలిక సవ్వడులు జతపరుచుచుండగా, పారిజాతాలు, చిరునవ్వుల దొంతరలో, సుమధురాన్ని వెదజల్లుతుండగా, ప్రకృతిమాత పారవశ్యంతో ఉండిపోయింది. వాటి నడుమ మస్తికంలో మెదిలే ఆలోచనా స్రవంతిలో మునిగేడు అతను. “సంపన్నుల గారాబు బిడ్డనైన నేను, ఎంతో ఆశతో మొదటిసారి దర్శించినప్పుడు పూర్తి వివరాలు తెలియజేసినా “నేను” చచ్చిన తరువాతే రమ్మనారు, రెండవసారి సంక్షిప్తంగా నా గురించి తెలియజేసినా, మరల “నేను” చచ్చిన తరువాతే రమ్మన్నారు, ఈసారి నా గురించి పూర్తిగా ఏమి చెప్పకపోయినా వీరి దర్శనభాగ్యం కలిగింది. ప్రశాంతమైన వారి సాన్నిధ్యాన్ని ప్రసాదించారు. గతంలో చేసిన తప్పేమేటి, నేడు చేసిన ఒప్పేమిటి? బాహ్యాన్ని మరచి అంతరంగిక లోతుల్లోకి జారుకున్నాడు అతను. సాధు దర్శనంతో అంతరంగములో విచ్చుకున్న జ్ఞానకుసుమం విషయాలోచన సుగంధం వెదజల్లసాగింది. మొదటిసారి అహంకారంతో, నా సంపద, గౌరవాలు, నా గొప్పదనాన్ని తెలియజేశాను. రెండవసారి, నా గురించే గొప్పగా తెలియజేశాను. మూడవసారి ‘నా’ గురించి ప్రస్తావన లేక వాడుగా మారిన నాడు వారి సాన్నిధ్యం లభించింది. నిండు సభలో వస్త్రాపహరణ జరుగుతున్న సమయంలో ద్రౌపది బాహ్యం మరచి

ఎలుగెత్తి, చేతులు చాచి మూడవసారి పిలిచినప్పుడే కదా పరమాత్మ అనుగ్రహానికి పాత్రురాలయింది. "నేను" అనే భావన ఉన్నంత కాలం, భగవంతుని సంపూర్ణ కృపకు పాత్రులము కాలేము. అంతేకాదు వారి స్వరూపాలయిన వారి దర్శన, స్పర్శనము, అనుగ్రహం లభించదు. స్వామి, పరుషంగా మాట్లాడిన ప్రతిసారి ఎలాగయినా వారి ద్వారానే ఉపదేశం పొందాలనే నాలోని మొండి పట్టుదల, ముమ్మారు వారి సన్నిధికి లాక్కువచ్చి, అప్రయత్నంగా నాలోని మార్పుకు కారణమయింది. వారు చంపమంది "నేను" అనే అహంకారాన్ని, అది చచ్చిన తరువాత రమ్మని మొదటినుండి వారు ఉపదేశిస్తూనే ఉన్నారు "నేను" అనే భావన నామమాత్రం తొలగిన మరుక్షణం వారి దర్శనం భాగ్యం లభించింది. "నా" అహంకారాన్ని వీడి వారి కృపకు పాత్రులవుతాను! సాధుదర్శనం చేసుకోవాలనే తపనతో వారి సన్నిధికి రెండుసార్లు వస్తేనేనాలో ఇంత మార్పు కలిగితే, వారి ప్రత్యక్ష సాన్నిధ్యం ఇంకెంత ఫలితాన్ని ప్రసాదిస్తుందో కదా! ఇంతకుమించి వేరొక ఉపదేశం కావాలా! వారి దర్శన సాంగత్యము చాలదా నాజీవితం సాఫల్యం చెందటానికి. ఇంతకాలము నా చదువు, సంపద, సౌకర్యాలు ఇవ్వలేని పరమానందాన్ని , ప్రశాంతతను అప్రయత్నంగా అనిర్వచనీయమైన వారి సన్నిధిలో పొందగలుగుతున్నాను, అది సుస్థిరం చేసుకుంటే జీవితానికి ఇంతకుమించి ఏమికావాలి, అదే నిజమైన సచ్చిదానందం. నిరంతరం దానిని పొందే విధముగా జీవితాన్ని మార్చుకోవాలి, అదే నిజమైన మార్గం, అదే స్వామి నాకు ఉపదేశించదలచింది, ఉపదేశిస్తున్నది" అని తనలో తాను ఆత్మవిమర్శ చేసుకుంటున్న సత్యం క్రమేపీ బాహ్యానికి వచ్చి, వికసించిన వదనంతో, ముకుళించిన హస్తాలతో, కనురెప్పలు విప్పారుతుండగా, చూపు స్వామి పాదాలపై నుంచిపైకిసాగి పున్నమిచంద్రుని వంటి వారి ముఖబింబముపై చూపు నిలిపి పారవశ్యంతో ఉండిపోయాడు సత్యం. "అర్థమయిందా" అన్నట్లుగా మూసిన పెదవులపై నుండి జాలువారిన చిరు మందహాసంతో, నేత్రాలు జతగూడి మౌనంగా పలుకరించారు. పరమానందంతో పాదాలపై వ్రాలిన అతని మస్తికముపై తన చేయి ఉంచి నిమిరేరు ఆ స్వామి. అలౌకికమైన తన్మయత్వంలో మునిగిపోయాడు సత్యం. సాధకుల హృదయాల్ని ఉద్దీపం చేసిన కార్తీకపున్నమి రేడు పశ్చిమానికి తన పయనం సాగిస్తుండగా, జగతిని జాగృతం చేయటానికి సూర్యనారాయణుడు, తూర్పున ఉదయించ సాగేడు. భానుడి నులివెచ్చని కిరణాల స్పర్శతో శరద్రుతువులోని మంచుతెరల ముసుగును తొలగించుకుంటూ, మంచుతో తడిసిన పుష్పాలు వయ్యారంగా ఒళ్ళు విదిలించుకుంటూ, వికసిస్తూ వెదజల్లే సుగంధము ప్రకృతితో మమైక్యం చెందగా, పత్రాలపైని నీటి బిందువులు, ముత్యాలుగా జాలువారుతూ, మృదువుగా సవ్వడి చేస్తున్నాయి. రెక్కలు విదిలిస్తూ పక్షులు తమ కిలకిల రావాల మేలుకొలుపుతో జగతిని జాకృతం చేస్తున్నాయి. ప్రకృతిలోని ప్రతి కదలికా ఎంతో అద్భుతంగా గోచరిస్తూ, అలౌకికమైన ఆనందాన్ని పంచుతూ, సందేశమిస్తున్నట్లుగా గోచరించింది అతనికి. వాటితో మమైక్యం చెందిన సాధువు దృక్కులు "బోధించేదేముంది చూసి నేర్చుకో!"మనే వారి ఉపదేశాన్ని మదిలో నింపుకొంటూ, తన్మతయత్వంతో ముందుకుసాగేడు అతను.

"అహంకారమనే (నేను అనే) మట్టిబొమ్మలు సాయిలీలామృత ప్రవాహంలో కరిగిపోవుగాక" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు.

కార్తీక పౌర్ణిమ శుభాకాంక్షలతో...

మీ **వి.వి.పూర్ణచంద్రరావు**

## జీవన్ముక్తి

జీవన్ముక్తి..... ఉర్వారుక మివ బంధనం అంటే అదే! ఇసుకలో ఆడుకొంటున్న పిల్లల్ని చూస్తుంటాం. అద్భుతంగా గుడి కడతారు. తీరికగా అలంకారాలు అద్దుతారు. తోచినంత సేపు హాయిగా ఆడుకుంటారు. పొద్దు వాలేటప్పటికి, ఆ కట్టడాలన్నింటినీ చటుక్కున కూలదోస్తారు. కిలకిల నవ్వులతో నిశ్చింతగా ఇంటి దారి పడతారు. అక్కడి ఆ నిర్మాణాలకు సంబంధించిన మమకారాలు, వియోగ దుఃఖాలు ఏవీ వారికి ఉండవు. 'అంతగా అయితే మరునాడు వచ్చి మళ్ళీ కడతాం. పోయేదేముంది' అనే ధీమాతో పిల్లలందరూ 'సొంతిళ్లకు వెళ్లిపోతారు. 'త్ర్యంబకం యజామహే....' అనే మృత్యుంజయ మహామంత్ర సారాంశమూ అదే. జీవితాన్ని ఎంతైనా నిర్మించుకో... ఆత్మీయ బంధాలెన్నింటినో పెంచుకో.... ప్రేమానురాగాల్ని గాఢంగా పంచుకో... ఆట ముగిసే సమయానికి, వాటిని అదే విధంగా సునాయాసంగా తెంచుకో" అని ఆ మంత్రం బోధిస్తుంది. వాటికి, మనిషికి మధ్య ముడి 'ఉర్వారుక మివ బంధనం'లా ఉండాలంటుంది. పచ్చి దోసకాయ ముచికకు, దోసతీగకు మధ్య బంధం ఎంత గట్టిగా ఉంటుందంటే, ఆ కాయను పట్టుకు లాగితే ఆ తీగ మొత్తం వచ్చేస్తుంటుంది. అవి ఒకదాన్ని మరొకటి అంత గట్టిగా పట్టుకొని ఉంటాయి. అదే రీతిలో మనిషి తన చుట్టూ ఉన్న పరివారంతో, ప్రపంచంతో బంధాన్ని అంత గట్టిగా పెనవేసుకొని ఉంటాడు. పిల్లలు ఇసుక గూళ్ళు కట్టినంత ప్రీతిగా తన, తనవారి జీవితాల్ని తీర్చి దిద్దుకుంటాడు. దోసపండు మిగుల మగ్గేనాటికి పరిస్థితి మారుతుంది. ఉన్నట్లుండి ఆ తీగ నుంచి అది చటుక్కున విడిపోతుంది. అప్పుడు చూస్తే ముచిక గాని, తీగ గాని ఎండి ముదిరిపోయినట్లు ఉంటాయి. అంతవరకు ఆ రెండూ ఒకదానితో మరొకటి గాఢంగా, బలంగా అతుక్కునే ఉన్నాయా? అనే అనుమానం వస్తుంది. ప్రపంచంలో అన్నింటినీ చివరన తెంచుకోగలిగితే, "ఈ ఆత్మ నిత్య' అని నమ్మగలిగితే మృత్యుభయాన్ని అధిగమించడం సాధ్యమవుతుంది. సాయంత్రం అయ్యేసరికి పిల్లలు నిశ్చింతగా సొంతింటికి తిరిగి వెళ్లిపోయినట్లు, ఈ అద్దె ఇంటితో అనుబంధాన్ని వీడాలన్నదే ఆ మంత్రం యొక్క మహోపదేశం. 'దేహం వీడి వెళుతున్నాను' అనేది అసురీ భావం. 'అద్దె గృహాన్ని వీడుతున్నాను' అనేది అమృతభావన. అలా అమృతత్వ స్థితిలోకి చేరుకోవడమే ముక్తి అనిపించుకుంటుంది. మనిషి జీవించి ఉండగానే సాధించాల్సిన స్థితి అది. అందుకే దాన్ని 'జీవన్ముక్తి' అంటారు.

సేకరణ : **శ్రీ అనంత సాయి**, వైజాగ్

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం
## (2020 జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలలో నిర్వహించిన కార్యక్రమాలు)

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2020 జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. నానాటికి కోవిడ్ 19 (కరోనా వైరస్) విజృంభించటముతో ప్రభుత్వపు నియమ నిబంధనములకు, వ్యక్తిగత భద్రతలకు లోబడి, ఆ యా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. గతంలో సామూహికముగా నిర్వహించిన అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొన్ని సంక్షిప్తము చేయటము, సామాజిక సేవా కార్యక్రమాలను నేరుగా ఆ యా వ్యక్తుల ముంగిటనే చేరువయ్యేలా చేయటము జరిగింది.

ప్రతినెల 'శ్రీ సాయిభరద్వాజ ఆపన్నహస్తం' పేరిట దివ్యాంగుల, అతి నిరుపేద, వితంతు కుటుంబాలకు నెలకు సరిపడా అందించే నిత్యావసర వస్తువులను జూలై, ఆగష్టు, సెప్టెంబరు మాసములలో (కరోనా నేపధ్యములో) ఆ యా ప్రదేశాలలోని సత్సంగ సభ్యులద్వారా వారి ఇంటి ముంగిటనే అందజేయటమైనది.

అంతేకాక శ్రీకాకుళంజిల్లాలోని అరసవిల్లి, శ్రీకూర్మం, తూలుగు, వమరవల్లి, శిలగాం గ్రామాలలో మరియు శ్రీకాకుళం పట్టణంలోని కోవిడ్ కంటోన్‌మెంట్, రెడ్‌జోన్‌లలోని అతి నిరుపేద దివ్యాంగులకు, అనాథ వయోవృద్ధుల 120 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ఆ యా ప్రదేశాలలోని సభ్యులచే, ట్రస్టు ప్రతినిధి శ్రీ సిహెచ్. కిరణ్ ఆధ్వర్యములో ఉచితముగా అందజేయటమైనది.

శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని దాదాపు 300 మంది రోగులకు, నిరుపేదలకు, శ్రీ అన్నదాన సమితి ఆధ్వర్యములో జరిగే నిత్యఅన్నదానికి, వారానికి ఒకసారి ప్రతినెల కూరగాయలు అందజేయటమైనది.

అంతేకాక కోవిడ్ సందర్భముగా అతి నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

జూలై 1వ తేదీ తొలిఏకాదశి సందర్భముగా సద్గురుపాదుకాక్షేత్రంలో లోకకళ్యాణార్ధము శ్రీ దత్త సాయి భరద్వాజులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించటం జరిగింది.

గురుపూర్ణిమ సందర్భముగా పి.యమ్.సి. ఛానల్‌లో "గురుపూర్ణిమ విశిష్టత – సాయిసంప్రదాయము" గురించి ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ఆధ్యాత్మిక ప్రవచనము చేయటమైనది.

జూలై 4వ తేదీ గురుపూర్ణిమ సందర్భముగా శ్రీ దత్త సాయి భరద్వాజులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి 'శ్రీసాయినాథ స్థవనమంజరి' ఏకాహ పారాయణ చేయటమైనది. 'శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్త,ం' పేరిట, సేవాకార్యక్రమాలు నిర్వహించటమైనది.

ఆగష్టు 5వ తేదీ శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా సద్గురుపాదుకాక్షేత్రంలోని పాదుకలకు (25 సంవత్సరాల క్రితం శ్రావణ బహుళ విదియనాడు మొదటిసారిగా పాదుకామహోత్సవము ప్రారంభమయింది) విశేష పూజలు నిర్వహించటమైనది.

ఆగష్టు 17వ తేదీ హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా ఆరాధనోత్సవము సందర్భముగా లోకకళ్యాణార్ధము "శ్రీ తాజుద్దీన్‌బాబా చరిత్ర" పారాయణ చేయటమైనది.

ఆగష్టు 22వ తేదీ శ్రీ గురుసిద్ధారూఢస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా స్వామి పాదుకలకు విశేషపూజ నిర్వహించి, "శ్రీసిద్ధారూఢస్వామి చరిత్ర" ఏకాహ పారాయణ చేయటమైనది.

ఆగష్టు 22వ తేదీ వినాయక చవితి మరియు శ్రీపాదశ్రీవల్లభుల జయంతి పురస్కరించుకొని, పాదుకాక్షేత్రంలో విశేష పూజలు నిర్వహించి, శ్రీగురుచరిత్రలోని 1వ అధ్యాయము నుండి 10వ అధ్యాయము వరకు పారాయణ చేయటమైనది.

ఆగష్టు 23వ తేదీ శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధనోత్సవము పురస్కరించుకొని, పాదుకలకు విశేష పూజలు చేసి, లోకకళ్యాణార్ధము "శ్రీ గజానన్‌మహరాజ్" చరిత్ర పారాయణ చేయటమైనది.

ఆగష్టు 24వ తేదీ అవధూత శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవము పురస్కరించుకొని, లోకకళ్యాణార్ధము స్వామి ఉపయోగించిన వస్త్రము, పాదుకలకు విశేష పూజచేసి "శ్రీ వెంకయ్యస్వామి చరిత్ర'' పారాయణ చేయటమైనది. సేవాకార్యక్రమాలు నిర్వహించటమైనది.

సెప్టెంబరు 1వ తేదీ అనంతపద్మనాభ చతుర్ధి సందర్భముగా విశేషపూజలు నిర్వహించటమైనది

సెప్టెంబరు 3వ తేదీ అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా స్వామి వారి పాదుకలకు విశేషపూజ నిర్వహించి "శ్రీ చీరాలస్వామి" చరిత్ర పారాయణ చేయటమైనది.

సెప్టెంబరు 26వ తేదీ అధిక అశ్వయుజ మాసము శుద్ధ దశమి సందర్భముగా లోకకళ్యాణార్ధము శ్రీ శిరిడీసాయిబాబాకు పంచామృతాభిషేకము నిర్వహించి సంక్షిప్త ''బాబాచరిత్ర'' పారాయణ చేయటమైనది. వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించటమైనది.

ప్రతి గురువారము ట్రస్టు ఆధ్వర్యములో స్థానిక సాయిబాబా మందిరములో లోకకళ్యాణార్ధము ప్రత్యేక ధుని పూజ శ్రీ కిరణ్ ఆధ్వర్యములో నిర్వహించటమైనది.

కోవిడ్ నిబంధనలు అనుసరించి ఆ యా కార్యక్రమాలు నిర్వహించటమే కాకుండా, ఆ యా సందర్భాలను పురస్కరించుకొని, నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, వస్త్రాలు, ఇతర వస్తు సామాగ్రి ఉచితముగా అందచేయటమైనది.

ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల వివరాలను సంక్షిప్తముగా అందజేయటమైనది.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

# మేము సహితం

ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలలో భాగముగా శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2020 జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, కరోనా వ్యాప్తి నేపధ్యములో కోవిడ్-19 నిబంధనలకు లోబడి నిర్వహించటమైనది.

'శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం' పేరిట, ప్రతి నెల 50 మంది అతి నిరుపేద, దివ్యాంగులు, వితంతువులకు నెలకు సరిపడే నిత్యావసర వస్తువులను కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతినెల వారి ఇంటిముంగిటనే అందజేయటమైనది.

అంతేకాకుండా శ్రీకాకుళంజిల్లాలోని అరసవిల్లి, శ్రీకూర్మం, తూలుగు, వమరవల్లి, శిలగాం గ్రామాలలోనూ, శ్రీకాకుళంలోని కోవిడ్ కంటోన్‌మెంట్, రెడ్‌జోన్ ప్రాంతాలలోని అతి నిరుపేద, దివ్యాంగుల మరియు అనాధ వృద్ధులకు 120 కుటుంబాలకు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ట్రస్టు తరపున ఉచితముగా అందజేయటముతో పాటు స్థానిక రిమ్స్ ఆసుపత్రిలోని వ్యాధి పీడితులకు అన్నదాన నిమిత్తము, ప్రతివారము 300 మందికి సరిపడా కాయగూరలు మరియు స్థానిక అన్నదాన సంస్థ ద్వారా వృద్ధులకు, నిరుపేదలకు ఇంటి వద్దనే ఆహార పంపిణీ కార్యక్రమానికి నిత్యావసర వస్తువులు అందజేయటమైనది. కొంతమంది అతి నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేయటమైనది. శ్రీకాకుళంలోని అనాథ ఆశ్రమ వసతి గృహాలలోని బాలబాలికలకు ప్రతివారం ఉచితంగా పాలు అందజేయటమైనది. సామాజిక సేవయే సాయి సేవగా భావిస్తూ, అర్హులైన వారికి చేయూతనిచ్చే ఈ బృహత్తరమైన కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఇతర ప్రాంతవాసులు కూడా సహృదయముతో తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. చేయూతనిస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా మా హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనాలు. శ్రీ దత్త సాయి భరద్వాజుల కృపానుగ్రహముతో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ, మరింతగా సాయి (సేవా) కార్యక్రమాలలో పాల్గొనే శక్తి వారికి కలగాలని, శ్రీ దత్తప్రభువును ప్రార్థిస్తూ, సహకరించిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తునాము.

## సహాయ సహకారములు అందించిన సహృదయులు

| | |
|---|---|
| శ్రీ సలాది రామకృష్ణ, కూర్మన్నపాలెం, వైజాగ్ | 10,000/- |
| శ్రీ ఆర్. సూర్య శ్రీనివాస్, సైనికపురి, హైదరాబాదు | 7,000/- |
| శ్రీ తాన శ్రీధర్, నర్సాపురం, తెలంగాణ | 6,000/- |
| శ్రీమతి డా॥యమ్.శ్యామలాదేవి, ప్రొఫెసర్, పంజాబ్ యూనివర్సిటి | 5,000/- |
| శ్రీమతి బి. మహలక్ష్మి నాయుడు, విశాఖపట్నం | 5,000/- |
| శ్రీ బి. కృష్ణం నాయుడు, విశాఖపట్నం | 5,000/- |
| శ్రీ ఓలేటికుమార్, జంగారెడ్డిగూడెం | 4,000/- |
| శ్రీమతి పెద్దింటి సావిత్రి బాలకృష్ణ, నర్సీపట్నం | 4,000/- |
| శ్రీ జి. సత్యవరప్రసాద్, శ్రీమతి లత అక్కయ్యపాలెం | 3,016/- |
| శ్రీ కె. నరసింహమూర్తి, విజయవాడ | 3,000/- |
| శ్రీ కె. రమేష్‌బాబు, శ్రీహరిపురం, వైజాగ్ | 3,000/- |
| శ్రీ యస్. శుభాకర్, తాడేపల్లి, గుంటూరు జిల్లా | 3,000/- |
| శ్రీ ఆర్. అప్పలరాజు, ఆర్.ఆర్.వి.పురం | 2,000/- |
| శ్రీ వై. మురళి, విజయనగరం | 2,000/- |
| శ్రీమతి కె. హైమ, అప్పలరాజు ఎన్‌టిపిసి, పరవాడ | 2,000/- |
| శ్రీ సిహెచ్. త్రినాథరావు, కూర్మన్నపాలెం, వైజాగ్ | 1,500/- |
| ఒక సాయిభక్తుడు | 1,116/- |
| ఒక సాయిభక్తుడు | 1,116/- |
| శ్రీ కె. శరత్‌చంద్రబాబు, కూర్మన్నపాలెం, వైజాగ్ | 1,116/- |
| శ్రీ జొన్నలగడ్డ బుచ్చయ్య, ఇబ్రహీంపట్నం | 1,116/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 1,111/- |
| శ్రీ పి. రామచంద్రరావు, ఇసుకతోట, వైజాగ్ | 1,111/- |
| శ్రీ ఎమ్. సత్యన్నారాయణమూర్తి, హైదరాబాదు | 1,000/- |
| ఒక సాయిభక్తుడు | 1,000/- |
| శ్రీ జి. సాయిసూరజ్, కూర్మన్నపాలెం, వైజాగ్ | 601/- |
| శ్రీమతి బి. అనసూయ, మధురవాడ, విశాఖపట్నం | 504/- |
| శ్రీ బి.పి. శంకరనారాయణమూర్తి, మధురవాడ, వైజాగ్ | 504/- |
| శ్రీమతి సిహెచ్. కృష్ణవేణి త్రినాథరావు, కూర్మన్నపాలెం, వైజాగ్ | 501/- |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 500/- |
| శ్రీ జె. సాయి, శ్రీకాకుళం | 352/- |
| శ్రీ పి. బాలాజీరావు, గాజువాక | 250/- |
| శ్రీ బి. కృష్ణారావు, అక్కయ్యపాలెం, వైజాగ్ | 109/- |
| శ్రీ బి. విజయశంకర్, అక్కయ్యపాలెం వైజాగ్ | 105/- |
| శ్రీమతి బి. వెంకటలక్ష్మి, అక్కయ్యపాలెం వైజాగ్ | 104/- |
| శ్రీ సిహెచ్.వి.యస్.బి. ఆచార్య, కరేడు, ప్రకాశంజిల్లా | 100/- |

**ధన, వస్తు రూపేణా మీ విరాళములు పంపవలసిన చిరునామా :**


**శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు (రిజిష్టర్డ్)**

**ప్లాట్ నెం.13, పవర్‌సిటీ, శ్రీ గౌతు లచ్చన్న నగర్ దగ్గర,**
**చిన గొర్లెవాని పాలెం, పరవాడ (మ), విశాఖపట్నం - 531021**

**సెల్: 9849645224 , 08924529690**

E-mail : poorna.sai09@gmail.com
Visit : www.saisadguruvani.org
Facebook : SriShiridiSaiSevaTrust


**Sri Shiridi Sai Seva Trust**
**Online A/C No. 09551001106492**
**IFSC Code: ANDB0000955**
**Andhra Bank, Ukkunagaram**
**(Used for RTGS and NEFT Transactions)**

# అక్షర యజ్ఞానికి చేయూత

'అక్షర రూపములో శ్రీ శిరిడీసాయిని ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే సంకల్పముతో గత 20 సంవత్సరాలనుండి "శ్రీ భరద్వాజ సద్గురువాణి" ఆధ్యాత్మిక పత్రిక ద్వారా, సత్సంగ యజ్ఞాన్ని నిర్వహిస్తూ, వేలాదిమంది పాఠకులకు హృదయవాణియై, శ్రీసాయితత్వ సంప్రదాయ ప్రచారములో అగ్రగామిగా నిలచిన "శ్రీ భరద్వాజ సద్గురువాణి" కేవలం 200 రూపాయలకు జీవిత సభ్యత్వముతో ప్రారంభించి, 2 దశాబ్దాలు గడుస్తున్నా, పేపరు, ముద్రణ, రవాణాలో అనూహ్యముగా అనేక మార్పులు జరుగుతూ, ప్రతి పత్రికకు, ముద్రణాభారం పెరుగుతున్నా, అంకిత భావంతో సభ్యత్వ రుసుములో స్వల్ప మార్పులతో, దాదాపు 50% రాయితీతో 20 సంవత్సరాలుగా మీ అందరి సహకార, అండదండలతో కొనసాగిస్తున్నాము. "అన్ని దానాలలో అన్నదానం మిన్న, అయితే అది ఆరోజు ఆకలి మాత్రమే తీరుస్తుంది. విద్యాదానం శాశ్వత జీవనానికి మార్గం సుగమం చేస్తుంది. ఆధ్యాత్మిక విద్య, జీవనంతోపాటు, జీవితాన్ని సాఫల్యం చెందిస్తుంది" అన్న 'శ్రీ భరద్వాజ వాణి' ని అనుసరించి కొనసాగించే, బృహత్తరమైన ఈ అక్షర యజ్ఞానికి ఎందరో సహృదయులు, ప్రకటనల రూపేణా, మరియు ముద్రణకు ఆర్థిక సహాయము మొదలైన అనేక రూపాలలో తమవంతు సహాయ సహకారములు అందిస్తున్నారు.

ప్రత్యేకించి శ్రీ కె. కరుణారెడ్డి (యు ఎస్ ఏ) వారి మిత్ర బృందం ప్రతి సంవత్సరము శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలకే కాకుండా, "శ్రీభరద్వాజ సద్గురువాణి" ప్రచురణకు తమవంతు సహాయమందిస్తున్నారు. వారికి మా ప్రత్యేక హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనాలు. శ్రీ వి. దుర్గాదాసు, (శ్రీకాకుళం) గత మూడు నెలలలో దాదాపు 53 మందికి తాను స్వయముగా సభ్యత్వ రుసుము చెల్లిస్తూ, చందాదారులుగా చేర్పించటమే కాకుండా ఆర్థిక సహాయమందించారు. సద్గురువాణి పత్రిక పట్ల వారికి గల ఆదరాభిమానములకు కృతజ్ఞతాభివందనాలు.

"శ్రీ భరద్వాజ సద్గురువాణి" ద్వారా జరిగే అక్షర సత్సంగ యజ్ఞానికి చేయూతనిచ్చిన వారి వివరాలు ఈ క్రిందపొందుపరుస్తున్నాము.

| | | |
|---|---|---|
| 1. | శ్రీ కె. కరుణారెడ్డి మరియు మిత్ర బృందం (యు ఎస్ ఏ) | 82,449/- |
| 2. | శ్రీ వై. ధర్మారావు, బరంపురం, ఒరిస్సా | 5,000/- |
| 3. | శ్రీ వి. దుర్గాదాసు, శ్రీకాకుళం | 5,000/- |
| 4. | శ్రీ మండలి కోటేశ్వరరావు, గుంటూరు | 1,000/- |
| 5. | శ్రీ ఆర్. సంతోష్, దువ్వాడ, వైజాగ్ | 1,000/- |

శ్రీ దత్త సాయి భరద్వాజుల కృపానుగ్రహముతో వీరందరూ మరింతగా, శ్రీసాయి సేవలో పాల్గొనే శక్తి కలగాలని కోరుకుంటూ కృతజ్ఞతాభివందనాలతో.... **– మేనేజరు**

**Sri BHARADWAJA PUBLICATIONS**
**Online A/C No. 09551001106491**
**IFSC Code: ANDB0000955**
**Andhra Bank, Ukkunagaram**
**(Used for RTGS and NEFT Transactions)**

**గమనిక :** శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు నిర్వహించే సేవా కార్యక్రమాలకు మరియు పత్రికకు చందా రుసుము ఆన్‌లైన్ ద్వారా బ్యాంకులో డబ్బు జమచేయు వారు తమ పూర్తి వివరాలు **98496 45224 సెల్ నెంబరుకు** మెసేజ్ ద్వారా గాని, లెటరు ద్వారా గాని తెలియజేయగలరు. **– మేనేజరు**

ఓం శ్రీ సాయినాథాయనమః ఆహ్వానము శ్రీ భరద్వాజ గురవేనమః



## దత్తజయంతి మహోత్సవములు



**వేదిక**

**శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం**
**ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, పరవాడ, విశాఖ - 21**



**తేదీలు**

**2020 డిసెంబరు 29 మరియు 30**
**(మంగళ, బుధ వారములు)**

**దత్త జయంతి మహోత్సవ కార్యక్రమాల సంక్షిప్త వివరములు**

**2020 డిసెంబరు 29 మరియు 30 (మంగళ, బుధ వారములు) తేదీలలో జరిగే నిత్య కార్యక్రమములు**

ప్రతి రోజూ భక్తుల గోత్రనామాదులతో పూజ, సాయంత్రం శ్రీ గురుచరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనములతో పాటు, **29వ తేది** శ్రీ గురుచరిత్ర ఏకాహ పారాయణ, **30వ తేది** శ్రీ దత్తాత్రేయుడి క్షీరాభిషేకం, గురుపూజలు మరియు వివిధ సామాజిక సేవ మొదలైన అనేక విశేష కార్యక్రమములు నిర్వహించబడును.

**గమనిక :** కోవిడ్ 19 నియమ నిబంధనలను అనుసరించి నిర్వహించబడే కార్యక్రమములలో తదనుగుణముగా పాల్గొనగోరుతున్నాము.

నిర్వహణ : **శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు** (రిజిష్టర్డు)
ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర, పరవాడ (మం) విశాఖ - 531 021.
సెల్ : 9849645224

# జన్మదిన శుభాకాంక్షలు

అక్టోబరు 6వ తేదీన గాజువాక, శ్రీనగర్‌లో జన్మదినము
జరుపుకుంటున్న శ్రీ అల్లు సింహాచలం నాయుడు,
శ్రీమతి ఈశ్వరమ్మల కుమారుడైన
**చి॥ శ్రీరామ్** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

అక్టోబర్ 18వ తేదీన హైదరాబాద్‌లో జన్మదినము
జరుపుకుంటున్న శ్రీ ఎమ్. ఉమామహేశ్వర రావు
శ్రీమతి ఎమ్. నాగలక్ష్మిల కుమారుడైన
**చి॥ ఎమ్. రామ సుబ్బారావు** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.



అక్టోబర్ 23వ తేదీన శ్రీకాకుళంలో
జన్మదినము జరుపుకుంటున్న
శ్రీ సి.హెచ్. మురళీకృష్ణ
శ్రీమతి సి.హెచ్. మీనాక్షిల కుమారుడు
**చి॥ సి.హెచ్. నాగ కిరణ్** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని
కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళి రోజు శుభాకాంక్షలు



**నవంబరు 24వ తేదీన గోవా(మహారాష్ట్ర)లో**
**పెళ్ళిరోజు జరుపుకుంటున్న**
**శ్రీ కె.సాయి సందీప్, శ్రీమతి సాయి ప్రత్యూష** ల
**వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని**
**కోరుకుంటూ మరియు**
**డిసెంబరు 8వ తేదీన జన్మదినం జరుపుకుంటున్న**
**శ్రీమతి కె.సాయి ప్రత్యూష** కు
**శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ కృపానుగ్రహం అందించాలని**
**కోరుకుంటూ శ్రీ భరద్వాజ సద్గురువాణి తన**
**శుభాకాంక్షలందజేస్తున్నది.**

## జన్మదిన శుభాకాంక్షలు



నిర్దుష్టమైన సాయి సంప్రదాయాన్ని అందరికి అందుబాటులోకి తేవటానికై
**"శ్రీ భరద్వాజ సద్గురువాణి"** పత్రిక స్థాపించి, గత రెండు దశాబ్దాలుగా
వాడవాడలా సాయివాణిని అందించుటయేకాక ఆ బృహత్తరయజ్ఞంలో
మాకుకూడ సేవాభాగ్యము కల్పించిన

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి**

**శ్రీమతి వి.ఎస్. లక్ష్మి పూర్ణచంద్రరావు**

**డిసెంబర్ 9వ తేదీన జన్మదినము జరుపుకుంటున్న**
శుభ సందర్భములో శ్రీ దత్తసాయి మాస్టర్, తన సంపూర్ణ కృపానుగ్రహము
అందించి **"శ్రీ భరద్వాజ సద్గురువాణి"**, అందరి హృదయవాణిగా
తీర్చిదిద్దే శక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తూ జన్మదిన శుభాకాంక్షలతో.

**కార్యవర్గము - శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్** - పవర్‌సిటీ
**సత్సంగ సభ్యులు - శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు, విశాఖపట్నం**

# శ్రీ దత్తాత్రేయ అపరాధక్షమాపణ స్తోత్రం

ఓ దత్తాత్రేయ! మానసిక, వాచక, శారీరక రూపములలో అమృతము, సహజము అయి సంసారసముద్రమును దాటించేటటువంటి నీ నామమును నా నాలుకతో ఉచ్చరించ లేకపోయాను. ఓ దయాజలధి! నీ దయార్ద్ర హృదయముతో నేను చేసిన అపరాధములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

ఓ సర్వవ్యాపి దత్తాత్రేయ! నా కఠినమైన, దురదృష్టమైన పాపముల వలన పూర్వజన్మలో నీ నామ స్మరణం చేయలేక పోయాను. సర్వజ్ఞుడు, సర్వకారకుడు, అయిన ఓ దయాజలధి! నీ దయార్ద్రహృదయముతో నేను చేసిన పాపములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

మాతృగర్భంలో ఈ మాయా ప్రపంచంలో మాయచే బంధింపబడి నిన్ను తెలుసుకొనలేకపోయాను. ఓ దయాజలధి! నీ దయార్ద్రహృదయముతో నేను చేసిన పాపములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

జన్మించిన తరువాత నా అజ్ఞానంతో నీ నామస్మరణం చేయలేకపోయిన నన్ను ఓ దయాజలధి! నీ దయార్ద్రహృదయముతో నేను చేసిన పాపములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

ఓ కరుణా హృదయా! బాల్యము వలన క్రీడా ఆసక్తి చిత్తుడనై నీ నామస్మరణ చేయలేకపోయిన నన్ను నీ కృపతో రక్షించి, ఓ దయాజలధి! నీ దయార్ద్రహృదయముతో నేను చేసిన పాపములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

ఓ దయార్ద్రహృదయా! యవ్వనంలో విషయవాసనల మీద ఆసక్తితో నీ నామస్మరణ చేయలేక పశ్చాత్తాప చింతనతో వేడుతున్నాను. ఓ దయాజలధి! నీ దయార్ద్రహృదయముతో నేను చేసిన పాపములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

ఓ కరుణా హృదయా! వృద్ధాప్యం, అనారోగ్యం, అసక్తి, దయనీయస్థితి వలన నీ నామస్మరణ చేయలేదు. ఓ దయాజలధి! నీ దయార్ద్రహృదయముతో నేను చేసిన పాపములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

హే కరుణాసాగర దత్తప్రభో! ఓ కృపాసింధూ! ఎన్నో జన్మలనుంచి అజ్ఞానంతో నేను చేసిన మానసిక, వాచక, శారీరక పాపముల నుంచి నీవు తప్ప రక్షించువారు ఎవరూ లేరు. ఓ దయాజలధి! నీ దయార్ద్రహృదయముతో నేను చేసిన పాపములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

ఓ దత్తాత్రేయ! నీ నామస్మరణ చేయక, నిన్ను పూజించక, నీ లీలలు గానం చేయక, నీ స్తోత్రములు పఠింపక వ్యర్థంగా గడిపిన నేను పశ్చాత్తాపంతో వేడుకుంటున్నాను. ఓ దయాజలధి! నీ దయార్ద్రహృదయముతో నేను చేసిన పాపములను క్షమించుము, క్షమించుము, క్షమించుము.

ఓ దత్తప్రభో! మీ వంటి అపార దయాసాగరులు ఎవరు లేరు. నాలాంటి అపరాధులు ఇంకెవరూ లేరు. అపరాధులకు, శరణాగతులకు మీరు మాత్రమే ఆధారము. భూమి మీద పాదము జారి పడిపోయినప్పుడు భూమి ఎలా ఆధారమో, ఆ ప్రమాణంగా నాలాంటి అపరాధులకు మీరు మాత్రమే ఆధారము.

ఓదత్త గురు! అన్ని శాస్త్రాల సారం అయిన ఈ స్తోత్రం నీ శిష్యుడు వాసుదేవానంద సరస్వతి చే విరచితం. నీ కరుణాపూరితమైన అనుగ్రహం దీనిని పఠించిన వారి మీద వర్షింపజేసి వారి పాపములను తొలగించి, మీ దయార్ద్రహృదయముతో సచ్చిదానంద స్వరూపం అయిన మీ మీద నా మనస్సు నిలుచునట్లు అనుగ్రహించి, కరుణతో రక్షించు.

ఇతి శ్రీ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ వాసుదేవానంద సరస్వతీ విరచితం శ్రీ దత్తాత్రేయ అపరాధ క్షమాపణ స్తోత్రం సంపూర్ణమ్.

శ్రీదత్తశరణంమమ! శ్రీపాదశరణంమమ! శ్రీసాయిశరణంమమ!

(డిసెంబరు 29వ తేదీ మంగళవారము శ్రీదత్తజయంతి సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి కె. సీతాకుమారి**, విశాఖపట్నం

## శ్రీదత్తస్వామి

భగవంతుడు ఇంద్రియాలకు, మనస్సుకూ గోచరించడు. గనుక అట్టి విశ్వాసము, భక్తి దృఢమవటము ఆస్తికులకు కష్టం. అట్టిది ప్రసాదించమనే అందరూ ఆయనను ప్రార్థింపజూస్తారు. కాని ప్రార్థన విశ్వాసం పైన, విశ్వాసం అనుభవం పైన ఆధారపడతాయి గనుక అది కూడ సరిగా కుదరదు.

మరొకవంక దైవవిశ్వాసమవసరం లేదని, నీతిగల జీవితమే చాలుననుకొనే వారికి గూడా నీతిగా వుండడమెందుకు సరియైనదో స్పష్టంగా తెలియదు.

అటువంటప్పుడు ఆస్తికులకు ఆధ్యాత్మిక జీవనము, తదితరులకు నైతిక జీవితము ఎలా సంభవము?

ఇందుకు సమాధానం మహనీయులు, మత గ్రంథాల వలన మనకులభిస్తుంది. మానవులకు తన ఉనికిని స్వల్పంగానైనా తెలిపి సన్మార్గానికి ఆకర్షించడానికి పరమాత్మయే ప్రేమతో బద్ధకంకణుడయ్యాడు. సృష్టి స్థితి లయకారకుడు, పరమ సత్యము తానే అయిన పరమాత్మ యోగమూర్తియైన శ్రీదత్తాత్రేయ స్వామిగా భూమిపై అవతరించాడు".

**– పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# మన సాంప్రదాయాలు

## వివాహం

మానవజీవితంలో మరపురానిది వివాహబంధము. ఇది స్త్రీ పురుషులకు జీవన మైత్రినిచ్చునది. శారీరక స్థితిగతులతో విడదీయరానిది. భవిష్యద్దారులకు పునాది లాంటి మార్గాలకు అనువైనది. దీనినే దాంపత్యబంధం అంటారు విజ్ఞులు. ధర్మార్థకామాదులకు అనువై విరాజిల్లుచున్నదే వివాహము. ఇది సర్వమతాలకు వారి వారి సంప్రదాయ ప్రమాణములతో అంగీకరించుచున్నది.

బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, సన్యాసము అనెడి ఆశ్రమ ధర్మాలు నాలుగుఉన్నాయి. అందులో రెండవదియగు గృహస్థాశ్రమము ప్రధానమైనది. సంతానాది పుణ్యములకు అలవాలమైనది. మోక్షార్ధపథము పొందించునది. ఎందువలన అనగా యతి, బ్రహ్మచారి, విద్యార్థి, గురు, పోషకుడు, బాటసారి, వృత్తిలేనివాడు. ఈ ఏడుగురు భిక్షకులు గృహస్థులను ఆశ్రయించి జీవిస్తూ తమ జీవన గమనమును సాగించెదరు. వారి సేవయే మోక్షార్థి పథమునకు మార్గమని భావము.

గృహస్థాశ్రమమునకు ప్రతి పురుషుడు ఒక స్త్రీని పొందుపరచుకొని జీవన స్రవంతి యందు కీర్తిని సాధించుకొనును. వారిద్దరి మైత్రితో కూడిన సంతానముతో పితృఋణము, గురు ఋణము, దేవ ఋణము ఇత్యాది ఋణములు తీర్చుటకు అవకాశము ఉన్నది. అందుకే స్త్రీ పురుషుల అనుబంధానికి నైతిక బలం, సామాజిక బలం, గౌరవ మర్యాదలు మున్నగునవి ఒకరి వల్ల మరొకరు పొందుతారు. ఇదియే వివాహబంధం అంటారు. వివాహమనెడి తంతువునందు మంత్రోచ్చారణముల అల్లిక మన పూర్వాచార పరాయణులు మనకు బోధించి, మనలను ఆచరింపచేసినారు. ఇదియే పెళ్ళి, పెండ్లియను పేరుతో విరాజిల్లుచున్నది.

### ఆడపడుచు చేత పెళ్ళికొడుకును చేయించేదెందుకు?

ఆడపిల్ల పుట్టింటి నుంచి అత్తారింటికి వెళ్ళగానే తన పుట్టింటితో అనుబంధమూ, హక్కులూ పోయాయనీ, దూరమయ్యానని బాధపడుతుంటుంది. అలాంటిదేమీ లేదు ఈ ఇంట్లో నీ హక్కు అలానే ఉందని చెప్పి, వివాహ సమయంలో తోడపుట్టిన వాడిని పెండ్లికొడుకును చేయించటం దగ్గర్నించి ఆమెకు లాంఛనాలు ఇప్పించటం వరకూ తన ఇంటి పిల్లగా ప్రాధాన్యత కల్పిస్తారు.

అలాగే తాము పోయిన తర్వాత ఆడపిల్లను మగపిల్లలు పట్టించుకోరేమోనని ముందు నుంచి ప్రతి శుభకార్యానికి ఆడపిల్ల తప్పనిసరి అని, ఆమె చేతుల మీదగానే ఏదైనా ప్రారంభించాలని చెప్పటమే ప్రధాన ఉద్దేశ్యము.

### వివాహమైన స్త్రీలు తమ ఇంటి పేరు ఎందుకు మార్చుకుంటారు?

ఒక కుటుంబములో సాధారణంగా భర్త వయస్సులో పెద్దవాడు కనుక వాడు ఇంటి యజమాని అవుతాడు. వివాహమైన తర్వాత స్త్రీ తన ఇంటి పేరు మారుట వలన, కుటుంబ సభ్యుల మధ్య గట్టి ఐక్యతాభావము ఏర్పడుతుంది. ముఖ్యముగా ఈ సంప్రదాయము 'సమాజంలో స్త్రీ తన కుటుంబ పరువు, గౌరవ మర్యాదలు భుజాన్న మోస్తానని, వాటిని పెంచుతానని' బాధ్యత స్వీకరించినట్లుగా చెబుతుంది. ఈ సంద్రాయము స్రీ యొక్క వైవాహిక స్థితిని చెప్పడమే కాక, సమాజంలో ఆ స్త్రీ ఏ కుటుంబానికి చెందినది? ఎవరి భార్య? అని చెబుతుంది. భారతీయ కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండటానికి ఈ సంప్రదాయము ఒక కారణము.

### మట్టెలు ఎందుకు ధరిస్తారు?

హిందు వివాహ సంప్రదాయంలో కాలి మట్టెలకు ఉన్న ప్రాధాన్యత అంతాఇంతా కాదు. వివాహం జరిగిన దగ్గర్నుంచి మంగళసూత్రంతో పాటుగా, కాలి మట్టెలు కూడా సౌభాగ్యానికి చిహ్నంగా మారతాయి. ఇంతకీ కాలి మట్టెలు ఎందుకు ధరిస్తారు. వీటి వెనుక ఏమన్నా అంతరార్థాలు ఉన్నాయా అంటే కారణాలు కనిపించక పోవు.

### వెండితోనే ఎందుకు?

బంగారం లక్ష్మీదేవితో సమానం కాబట్టి నడుము భాగం నుంచి కిందకి ధరించే ఆభరణాలు బంగారంతో చేయించ కూడదన్నది ఒక నమ్మకం. ఇక బంగారంతో పోల్చుకుంటే వెండికి విద్యుద్వాహకత చాలా ఎక్కువ. తద్వారా భూమికీ, శరీరానికి మధ్య ఒక అనుసంధానంగా కాలిమట్టె పనిచేస్తుందనీ...ధరిత్రి మీద నుంచి వెలువడే శక్తి తరంగాలను శరీరానికి అందజేస్తుందని నమ్మకం.

### రెండో వేలికే ఎందుకు?

మన శరీరంలోని నాడులన్నీ చేతులు, కాలి వేళ్ళలో కేంద్రీకృతమయ్యాయని ప్రాచీన వైద్యం చెబుతుంది. కాబట్టి మన చేతులు, కాళ్ళలోని ఒక్కొక్క ప్రాంతం మీద ఒత్తిడి తీసుకురావడం వల్ల ఒక్కొక్క అవయవం పనితీరును ప్రభావతం చేయవచ్చునంటారు. అలా కాలికి ఉండే రెండో వేలి మీద ఒత్తిడి ఏర్పడినప్పుడు గర్భాశయపు పనితీరు మెరుగుపడుతుందని చెబుతున్నారు. తద్వారా రుతుసంబంధమైన సమస్యలు, సంతానం కలగడంలో ఏర్పడుతున్న ఇబ్బందులు తొలగిపోతాయంటున్నారు.

### పెళ్ళి తరువాతే ఎందుకు?

స్త్రీకి వివాహం అయ్యిందని తెలిపేందుకు కాలి మట్టెలు ఒక చిహ్నం. ఆమెను తల్లిగా భావించాలనీ, ఆమెతో మర్యాదగా మెలగాలనీ ఒక సూచన. పైగా కొన్ని ప్రాంతాలలో భర్త చనిపోయినా కూడా ఆమె సోదరులు ఎవరన్నా జీవించే ఉంటే, రెండు మట్టెలలో ఒకటే తీసివేసే సంప్రదాయం ఉంది. ఆమెకు రక్షగా ఇంకా ఆమె సోదరులు ఉన్నారన్న హెచ్చరిక ఇందులో కనిపిస్తుంది.

# "అష్ట తీర్థ దత్తక్షేత్రం - శ్రీక్షేత్ర గాణ్గాపూర్"

శ్రీగురుడు దాదాపు 34 సంవత్సరాలు తన లీలావిలాసాలకు కేంద్రంగా చేసుకొని, తన నిర్గుణ పాదుకలను ప్రతిష్ఠించిన ప్రదేశం కర్ణాటకలోని గుల్బర్గా దగ్గరి శ్రీక్షేత్ర గాణ్గాపురం. శ్రీగురుడు గాణ్గాపురంలో ఉన్న మఠంలోకి రాకముందు కొంతకాలం గాణ్గాపురం గ్రామ చివర ఉన్న భీమ-అమరజా సంగమము దగ్గరి మేడి చెట్టు దగ్గర నివసించేవారు. నిత్యం సంగమంలో స్నానం చేసి, అనుష్ఠానం కొనసాగించి, గ్రామములోకి భిక్షకు వచ్చేవారు. గొడ్డుబోయిన గేదెను పాడి గేదెగా మార్చిన శ్రీగురుని లీల ఆనోట ఈనోట పాకి చివరకు ఆ రాజ్యమేలే రాజు చెవినిబడి, శ్రీగురుడిని దర్శించుకొని, వారిని గ్రామములో నివసించి ప్రజలను అనుగ్రహించమని వేడుకోవటంతో, శ్రీగురుడు గ్రామములోకి ప్రవేశిస్తూ ఒక పాడుబడ్డ మఠం దగ్గర రావిచెట్టుపై ఉన్న బ్రహ్మరాక్షసుడికి విముక్తి కలిగించి, ఆ పాడుపడ్డ ఇంటినే తన మఠంగా మార్చుకొని దానిలో నివసించి, తన అవతార పరిసమాప్తి చేయదలచినప్పుడు తమ నిర్గుణ పాదుకలను ప్రతిష్ఠించినది ఆ మఠంలోనే. నేడు అందరూ దర్శించుకునేది నాటి మఠంలోని పాదుకలనే. శ్రీగురుడు నిత్యము మఠం నుంచి భీమ-అమరజా సంగమానికి ఒక వేడుకగా వెళ్ళి, అక్కడ తన అనుష్ఠాన కార్యక్రమాలను ముగించుకొని తిరిగి తన మఠంకు వచ్చేవారు. మఠం దగ్గరనుండి భీమ-అమరజా సంగమం వరకు గల సప్త తీర్థాలు నిత్యము శ్రీగురుని పాదస్పర్శతో పునీతమయినవి. మఠంకు వెనుకగల హిప్పరిగి గ్రామంలో ఉన్న ఎనిమిదవ తీర్థమయిన మన్మథతీర్థం సాక్షాత్తు ఒక అద్భుత లీలకు నిదర్శనం. అటువంటి ఎనిమిది తీర్థాల ప్రాశస్త్యాన్ని శ్రీగురుడు ఆ యా సందర్భాలలో తన భక్తులకు తెలియచేసిన వివరాలను డిసెంబరు 29వ తేదీ మంగళవారం దత్తజయంతి సందర్భముగా మీకందిస్తున్నాము. గాణ్గాపూర్‌లోని భీమ-అమరజా సంగమముతో పాటు మిగిలిన తీర్థాలలో కూడ స్నాన మాచరించి (ఇప్పుడు ప్రతి ప్రదేశములో మార్గ సూచికలు, తీర్థం పేరు, చిన్న గుడి, స్నాన ఘట్టాలు కలవు) నిర్గుణ పాదుకలను దర్శించుకొని పునీతులు కాగలరని ఆకాంక్ష.



**భీమ-అమరజా సంగమం :** గంగ-యమునా సంగమం కంటే కూడ పవిత్రమైనది. పూర్వము ఒకప్పుడు దేవతలకు రాక్షసులకు జరిగిన భయంకరమైన యుద్ధములో జాలంధరుడనే రాక్షసుని ధాటికి చనిపోయిన దేవతలను బ్రతికించమని దేవేంద్రుడు ప్రార్థించగా, మృత్యుంజయుడైన శంకరుడు అమృత భాండాన్ని ప్రసాదించి, చనిపోయిన దేవతలను పునర్జీవింప చేసెను. చివరికి ఆ పాత్రలో మిగిలిన అమృతం కొద్దిగా భూమిమీద పడి "అమరజా" అనే నదిగా ప్రవహిస్తున్న సంజీవని వంటి ఈ నీరు, సర్వ పాపాలను, బాధలను, వ్యాధులను, అపమృత్యు భయాన్ని, బ్రహ్మహత్యాది పాపాలను సహితం తొలగించగలదు.

**మనోరథ తీర్థము :** అశ్వత్థ వృక్షం దగ్గరున్న ఈ తీర్థంలో స్నానం చేస్తే నిశ్చయంగా మనోరథాలన్నీ నెరవేరుతాయి. భక్తితో అశ్వత్థాన్ని పూజించే వారికి కలి ప్రభావము అంటక, ఆ వృక్షంలో సదావసించే శ్రీగురుని దర్శనం లభిస్తుంది.

**సంగమేశ్వర్ :** శ్రీశైలంలో మల్లిఖార్జునుని వలె సంగమేశ్వరుడైన సదాశివుడు ఈ క్షేత్రంలో సుస్థిరంగా ఉన్నాడు. దీనిని గురించి ఒక పురాణోపాఖ్యానమున్నది. పూర్వం భారద్వాజస గోత్రుడైన బ్రాహ్మణుడు నిరంతరం భక్తితో ఈశ్వరుని ఆరాధించి, పూర్ణ విరాగియై, ఈశ్వర సాక్షాత్కారం పొందుతుండేవాడు. ఆనంద పారవశ్యంతో ఒళ్ళు మరచి తిరిగే అతనిని లోకులు పిచ్చివాడనుకునే వారు. ఒకనాడు అతని సోదరులు కాశీకి వెళుతూ అతనిని కూడా రమ్మనగా, తనకు కాశీ విశ్వేశ్వరుడు దగ్గరలోనే ఉన్నాడని అతడు బదులిచ్చెను. అప్పుడు ఆ సోదరులు తమకు కూడ విశ్వేశ్వరుని చూపవలసినది అని అడుగగా, ఆ విప్రుడు సంగమంలో స్నానం చేసి, ఈశ్వరుని ధ్యానించి, ప్రార్థించగా, అక్కడే కాశీ క్షేత్రము, కాశీలోనున్న దైవరూపాలన్నీ దర్శనమిచ్చాయి. అంతటితో అతడు మహాజ్ఞాని అని అందరూ తెలుసుకున్నారు. ఈ క్షేత్రం సాక్షాత్తు కాశీయే.

**పాపవినాశ తీర్థం :** పాపవినాశ తీర్థ స్నానం సర్వ పాపాలను ప్రక్షాళనం చేస్తుంది. శ్రీగురుని పూర్వాశ్రమములో వారికి సోదరియైన రత్నాదేవికి పూర్వ జన్మ కర్మ వలన కుష్టువ్యాధి వచ్చింది. ఆ వ్యాధిని నివారించమని ప్రార్థించగా శ్రీగురుడు ఆమెను నిత్యము పాపవినాశ తీర్థములో స్నానం చేయమని, ఒక్కొక్క స్నానానికి ఏడు జన్మల పాపం నశించిపోతుంది అని చెప్పారు.

**కోటి తీర్థం :** ఈ తీర్థంలో చేసిన స్నానానికి కోటి గోవులను దానమిచ్చిన ఫలితము, ఇక్కడ చేసిన దానానికి కోటిరెట్లు ఫలితముంటుంది.

**రుద్రపాద తీర్థం :** ప్రయాగలోని త్రివేణీ సంగమములో స్నానం చేసిన ఫలితం కలుగుతుంది.

**చక్ర తీర్థం :** కేశవస్వామి దగ్గరనున్న చక్రతీర్థ స్నానము జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.


**మన్మథ తీర్థం :** కల్లేశ్వరుని దగ్గరనున్న ఈ తీర్థంలో స్నానం చేసి శ్రీశైలమల్లిఖార్జునితో సమానమైన కల్లేశ్వర లింగాన్ని పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి.

శ్రీదత్తజయంతి శుభాకాంక్షలతో...

సేకరణ : **శ్రీమతి వై. సాయిశిరీష**, బెంగుళూరు

# "శ్రీగురుచరిత్ర" పారాయణ

సకల వేదాల, ఉపనిషత్తుల, పురాణాల సారము "శ్రీగురుచరిత్ర". త్రిమూర్తి స్వరూపుడయిన దత్తాత్రేయుడు కలియుగములో అవతరించిన మొదటి (శ్రీపాద శ్రీవల్లభులు తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం) రెండవ (శ్రీ నృసింహ సరస్వతి – కరంజా – మహారాష్ట్ర) అవతారముల జీవిత లీలా విలాసముల చరిత్రే "శ్రీగురుచరిత్ర". శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి, శ్రీ రంగావధూత, శ్రీ నానూ మహరాజ్ మొదలైన మహాత్ములెందరో నిత్యము శ్రీ గురుచరిత్ర పారాయణ ద్వారా, దత్తానుగ్రహము సంపూర్ణముగా పొంది, దత్త స్వరూపులైనారు.




శ్రీగురుచరిత్ర 108సార్లు పారాయణ అనంతరమే శ్రీ కుశాభావు శ్రీ శిరిడీసాయినాధుని సంపూర్ణమైన అనుగ్రహము పొందగలిగేడు, అంతేకాక సాయి చరిత్రకారుడైన శ్రీ అన్నాసాహెబ్ ధబోల్కర్, శ్రీ సాఠే, శ్రీ నానాసాహెబ్ చందోర్కర్ మొదలైన వారు ఎందరో శ్రీగురుచరిత్ర పారాయణ వలన శ్రీ శిరిడీసాయి సంపూర్ణమయిన అనుగ్రహానికి పాత్రులు కాగలిగేరు. అసలు గురువు లేనివారు, గురువు ఉన్నా ఆయన కృప పొందలేకపోయినవారు, గురువు పెట్టే పరీక్షలో నెగ్గి, గురువు అనుగ్రహము సంపూర్ణముగా పొందాలి అని అనుకునేవారు, కుల, మత, జాతితో సంబంధం లేకుండా అందరూ పారాయణ చేయవలసిన అద్భుత గ్రంథరాజము "శ్రీగురుచరిత్ర". శ్రీగురుచరిత్రను సంస్కృతములో వ్రాసిన శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామి వారియొక్క శిష్యులైన శ్రీ గుళవణి మహరాజ్ (పూణే) గారిచే ప్రసాదింపబడి "సంహితాయన గురుద్విసాహస్రి" అని పిలువబడే శ్రీగురుచరిత్ర పారాయణ ద్వారా పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు సంపూర్ణమైన సాయికృపను పొంది, సాయిమాస్టర్ గా వినుతికెక్కి, శుభ్రమైన సాయిమార్గంలో లక్షలాది మందిని నడిపిస్తున్నారు. శ్రీ భరద్వాజగారిచే తెలుగులోకి అనువదింపబడిన శ్రీగురుచరిత్ర పారాయణ ద్వారా నేడు లక్షలాదిమంది నిర్దుష్టమైన గురుసంప్రదాయ మెరిగి, సాయిని సేవించి, కృతార్థులవుతున్నారు. కుహనాగురువుల పాలిటినుంచి రక్షించి, సాటిలేని సద్గురువు చెంతకు చేర్చే గ్రంథరాజము "శ్రీగురుచరిత్ర". కలియుగములో మొదటి దత్తావతారమైన శ్రీపాదశ్రీవల్లభులు తూర్పుగోదావరి జిల్లా పిఠాపురములో జన్మించినా, దత్త సంప్రదాయము మీదుమిక్కిలి గురు సంప్రదాయము అంతగా పాటించని మనలను వీడివెళ్ళి, కర్ణాటకలోని కురువపురంలో తన తపస్సును కొనసాగించి, అక్కడే అంతర్ధానమైనారు. రెండవ దత్తావతారము అయిన శ్రీ నృసింహసరస్వతీ స్వామివారు, శ్రీశైలములోని పాతాళగంగలో పుష్ప నావపై కదళీవనము వెళ్ళి అంతర్హితులైనారు. గురు సంప్రదాయముగా, శ్రీశైలము, కదళీవనము దర్శించే వారిలో ఆంధ్రులకన్నా కన్నడీయులు, మహారాష్ట్రవారే ఎక్కువ. మహారాష్ట్ర దేశస్తులు నిరంతరం శ్రీగురుచరిత్ర పారాయణ చేసి, గురు, దత్త సంప్రదాయమెరిగి జీవించటమువల్లనే, నాల్గవ దత్తావతారమైన శ్రీ అక్కల్‌కోట స్వామి, ఐదవ అవతారమైన శ్రీ శిరిడీసాయి మహారాష్ట్రలో ప్రకటమవ్వటము జరిగింది. అంతేకాక, నామదేవు, తుకారాం, మీరాబాయి, సక్కుబాయి, పాండురంగడు, ఇంక ఎందరెందరో భక్తులకు జన్మస్థానము అయింది ఆ ప్రాంతం. అటువంటి శ్రీగురుచరిత్ర నిత్యము పారాయణ చేయటము ద్వారా మనము దత్తానుగ్రహము పొందటమే కాకుండా, సాటివారిని కూడ వారి అనుగ్రహపాత్రులను చేయటానికి మనము నిమిత్తమాత్రులవుతాము. అటువంటి శ్రీగురుచరిత్ర నిత్య పారాయణ, శుచిగా, శుభ్రమైన ప్రదేశములో చేయటము ఒక్కటే ప్రధానమైన నియమము. మిగిలిన నియమాలు వారి వారి సంస్కారాన్ని, సౌలభ్యాన్ని బట్టి అనుసరించవచ్చును. గురువు రక్షించే వాడే కాని, భయపెట్టి శిక్షించేవాడు కాదు. ప్రతిరోజూ (స్త్రీలు బహిష్టు సమయము, తదితరముట్టు, మైల దినములు వదలి) పారాయణ చేయటం ద్వారా కష్టాలు తీరి, కోరికలు నెరవేరి, సంపూర్ణమైన సాయి కృపను పొందినవారెందరో. నిత్య పారాయణతోపాటు అవకాశాన్ని బట్టి ఆ యా సందర్భాలలో, పుణ్య తిథులలో ఏకాహ, సప్తాహ, త్రిసప్తాహ మొదలైన పారాయణలు చేయవచ్చు. నిత్యము పారాయణ ద్వారా సద్గురువు సమాశ్రయము కలుగుతుంది. జీవితంలో ఎదురయ్యే కొన్ని సమస్యలను అధిగమించటానికి అనువుగా, ప్రత్యేకించి కొన్ని అధ్యాయాలు పారాయణ చేయటము ద్వారా, శీఘ్రముగా ఆ యా పరిస్థితులనుంచి ఉపశమనం పొందవచ్చు. శ్రీగురుచరిత్ర లోని ప్రతి అధ్యాయము ఒక అద్భుతమైన ఫలితం ఇస్తుంది. డిసెంబరు 29వ తేదీ మంగళవారము శ్రీదత్తజయంతి సందర్భముగా వీలయినన్నిసార్లు శ్రీగురుచరిత్ర పారాయణ చేసి సద్గురువు కృప సర్వులూ పొందాలనే భావనతో శ్రీగురుచరిత్ర లోని అధ్యాయాలు పారాయణ ద్వారా పొందే ఫలితం గురించి మీకందిస్తున్నాము.

డిసెంబరు 29వ తేదీ మంగళవారము
శ్రీదత్తజయంతి శుభాకాంక్షలతో...

సేకరణ : **"విరించి"**

## శ్రీ గురుచరిత్ర పారాయణ ఫలితాలు

(అధ్యాయపరంగా)

| | |
|---|---|
| 1వ అధ్యాయము | శ్రీదత్తరూపులైన మహాత్ముల దర్శనప్రాప్తి కలుగును. |
| 2వ ,, | గురుభక్తి దృఢపడుటకొరకు, ఆధ్యాత్మిక అభ్యున్నతి కొరకు, కలి ప్రభావం మనపై పడకుండా ఉండుటకొరకు |
| 3వ " | ఎవ్వరి కోపమునకు గురికాకుండుటకై మరియు స్వకీయ శీల రక్షణకొరకు |
| 4వ " | శ్రీదత్తదేవుని కృపపొందుటకు |
| 5వ " | యోగ్యులు, బుద్ధిమంతులైన సంతానం కొరకు |
| 6,7వ " | ఘోరపాప నిర్మూలనకొరకు, శాపవిముక్తి కొరకు మరియు రోగ విముక్తికొరకు |
| 8వ " | ఉత్తమమైన ఉత్తర జన్మ లభించుటకొరకు |
| 9వ " | భోగభాగ్యములు, సంపద కొరకు |
| 10వ " | వ్యాపారాభివృద్ధి కొరకు |
| 11,12వ " | సుపుత్రప్రాప్తికొరకు |
| 13వ " | కడుపునొప్పి మొదలైన ఉదరవ్యాధి నివారణకొరకు |
| 14వ " | అధికారుల అనుకూలతకొరకు |
| 15వ " | పుణ్యక్షేత్రాలు, తీర్థాటన ఫలితం కొరకు |
| 16వ " | సద్గురువు అనుగ్రహం పొందుటకు |
| 17వ " | విద్యా ప్రాప్తికొరకు |
| 18వ " | పేదరిక నిర్మూలనకొరకు |
| 19వ " | శ్రీగురు నిజతత్త్వ ప్రాప్తికొరకు |
| 20,21వ " | ఋణవిముక్తికొరకు |
| 22,23వ " | దారిద్ర్య నిర్మూలనకొరకు |
| 24-28వ" | అహంకార నిర్మూలనకొరకు |
| 29వ " | భస్మ మహత్త్యం తెలియుటకొరకు |
| 30-34వ " | అపమృత్యుభయం తొలగుటకొరకు |
| 35వ " | స్త్రీ సౌభాగ్యం కొరకు |
| 36, 37వ " | సదాచార నియమములు తెలియుటకు, సందేహ నివృత్తికొరకు |
| 38వ " | అక్షయ సంపదల కొరకు |
| 39వ " | గొడ్రాలుకు సంతానప్రాప్తికొరకు |
| 40-42వ " | రోగనివారణకొరకు, గురుభక్తి దృఢపడుటకొరకు |
| 43వ " | పోగొట్టుకున్న సంపదలు తిరిగి పొందుటకు |
| 44వ " | క్షేత్రయాత్ర భాగ్యంకొరకు |
| 45,46వ " | రోగనివారణ కొరకు |
| 47వ " | గురుమహిమ తెలియుటకొరకు |
| 48వ " | సస్యసమృద్ధికొరకు |
| 49వ " | గాణ్గాపుర తీర్థమహిమ తెలియుటకొరకు |
| 50, 51 " | గురుకృప ప్రాప్తికొరకు |

అపారమైన విశ్వాసము, భక్తిశ్రద్ధలతో ఆ యా అధ్యాయముల పారాయణతోపాటు శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామి వారు నిర్దేశించిన శ్లోకములు తగురీతిన పఠించి, తగనన్ని దత్త ప్రదక్షిణలు చేయటము ద్వారా సంపూర్ణ ఫలితము పొందగలరు.

సౌజన్యం : **శ్రీగురుచరిత్ర**

## శ్రీ దత్తస్వరూపము

శ్రీ వాసుదేవానందులు దేశ సంచారం చేస్తున్నప్పుడు ఆంధ్రప్రదేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నెల్లూరు, శ్రీశైలం సందర్శించారు. ముక్త్యాలలో 1908లో చాతుర్మాస్యం చేశారు. తర్వాత హంసలదీవి వచ్చి, సాగరసంగమంలో స్నానం చేశారు. తర్వాత మచిలీపట్నం మీదుగా సప్తగోదావరిని సందర్శించారు. అక్కడ గోదావరి నది వశిష్ట, కోటిలింగ, కౌశిక, వృద్ధగౌతమి, భరద్వాజ, ఆత్రేయ, తురీయ అను ఏడు పాయలై సముద్రంలో కలుస్తుంది. తర్వాత రాజమండ్రి విచ్చేసి, అక్కడ నుండి పిఠాపురం చేరి, ఆ పట్టణ వాసులకు అక్కడ శ్రీపాద శ్రీవల్లభులు అవతరించారని చెప్పి, వారి జన్మస్థలం గూడ చూపి, అక్కడ దత్త పాదుకలు ప్రతిష్టించారు. తర్వాత కాకినాడ చేరి సముద్రస్నానం చేశారు. మరల రాజమండ్రి చేరి అచట శృంగేరీ శంకరమఠంలో 'భక్త వత్సలుడు' అను పేర 1910 ప్రాంతంలో శ్రీదత్తమూర్తిని ప్రతిష్టించారు. చివరకు 1914 సం॥లో జ్యేష్ట బహుళ చతుర్దశినాడు తన శిష్యులతో "రేపు రాత్రి అమావాస్య ఘడియలు వెళ్ళాక మేము శరీరం త్యజిస్తాము" అన్నారు. ఆ సమయానికి దత్తమూర్తి యెదుట ధ్యానంలో కూర్చొని పరమపదించారు. "శ్రీగురుచరిత్ర" పారాయణ ద్వారా వీరిని దత్తస్వామి తమ ప్రతి రూపంగా రూపొందించటమే గాదు, వారి ద్వారా ఆయన మరొక అవతారమెత్తారు. ఆయన "శ్రీగురుచరిత్ర"లో కీర్తించబడిన శ్రీగురుడిగా అవతరించినప్పుడు చివరకు శ్రీశైలంలో అంతర్ధానమయ్యే ముందు "శ్రీగురుచరిత్ర" గ్రంథం రూపంలో తామెల్లప్పుడూ వుంటామని ప్రమాణం చేశారు. ఒకప్పుడు ఆ గ్రంథాన్ని 7 వేల సంస్కృత శ్లోకాలలోకి అనువదించమని దత్తస్వామి ఆదేశించారు. మరొకప్పుడు వాసుదేవానందులతో ఈ గ్రంథాన్ని రెండువేల సంస్కృత శ్లోకాలలోకి అనువదించి దానికి "సంహితాయన గురుద్విసాహస్రి" అని పేరు పెట్టమని దత్తుడు చెప్పారు.

అలానే "శ్రీ వాసుదేవాంద సరస్వతీ స్వామి చేసిన ఈ రెండు రచనల రూపాలలో దత్తస్వామి నేడు దేశమంతటా తాండవిస్తున్నారు. శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారుగారు చేత దత్తస్వామి వ్రాయించుకున్న స్వేచ్ఛానువాదంలో ఈ రెండు గ్రంథాలలోని విశేషాంశాలను గూడ పొందుపరచారు. కారణం : అది శ్రీ దత్తావతార కథ; శ్రీగురుని అక్షర స్వరూపం; వారి ప్రత్యక్ష శిష్యుడైన సిద్ధయోగి చేత వ్రాయబడింది. మరల శ్రీ దత్తాత్రేయ స్వరూపులయిన శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి ద్వారా సంస్కృతంలో శ్రీ దత్తాత్రేయుడు అక్షరస్వరూపం ధరించారు.

దిగంబరా దత్త దిగంబర శ్రీ పాద వల్లభ దిగంబరా దిగంబరా దిగంబరా దత్త దిగంబరా శ్రీ నృసింహ సరస్వతీ దిగంబర

# బాల వికాసం - దీపావళి - అన్నం పరబ్రహ్మ స్వరూపం

## దీపావళి

అనగనగా ఒక ఊరికి ఒక రాజుగారు వుండేవారు. ఆయనికి చుట్టు పక్కల అన్ని రాజ్యాల్లో తన రాజ్యం గొప్పదిగా గుర్తించబడాలని చాలా తాపత్రయం వుండేది. ఒక సంవత్సరం దీపావళి పండుగ దగ్గర పడుతుంటే రాజుగారికి ఓ ఆలోచన వచ్చింది. అన్ని రాజ్యాలకన్న ఆయన రాజ్యంలో పండుగ బాగా జరిగింది అనిపించుకోవాలని ఒక పోటీ ప్రకటించారు. రాజ్యంలో అందరికన్నా బాగా దీపాలు పెట్టిన వారికి రాజుగారు స్వయంగా బహుమానం ఇస్తారని రాజ్యమంతా దండోరా వేయించారు. రాజ్యంలోని ప్రజలంతా పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరినిమించి ఒకరు ఇంటికి దీపాలు పెట్టుకుని అలంకరించుకున్నారు. దీపావళి రోజు సాయంత్రం రాజుగారు తన పరిచారకులతో రాజ్యాన్ని పర్యటించారు. దీపాలతో అందంగా అలంకరించబడిన ఎన్నో అందమైన ఇళ్ళను చూసి చాల సంతోషించారు రాజుగారు.



ఊరి చివరన మట్టుకు ఒక ఇల్లు చీకటిగా కనిపించింది. రాజుగారు ఆ ఇంటిని చూసి " ఆ ఇంట్లో ఎవరుంటారు? ఎందుకు వాళ్ళు ఇల్లు అలంకరించుకోలేదు?" అంటూ ఆ ఇంటి వైపుకు అడుగులు వేశారు. ఇంటి దగ్గరకు వెళ్ళి చూస్తే ఇంటి బయట రహదారిలో ఒక చిన్న దీపం వెలుగుతోంది. ఆ దీపం వెలుగులో, రహదారిలో ఉన్న ఒక గొయ్యి కనిపించింది. ఇంటి అరుగు మీద ఒక అవ్వ కూర్చుని ఆ దీపం ఆరిపోకుండా చూస్తూ అందులో నూనె పోస్తోంది. అది చూసి " అవ్వా నువ్వు ఇక్కడ కూర్చొని ఏమి చేస్తున్నావు? మీ ఇంటికి దీపాలు ఎందుకు పెట్టలేదు?" అని అడిగారు రాజుగారు.

"నా దగ్గర రోజు ఒక్క దీపానికి సరిపోయే అంత నూనె మాత్రమే ఉంది, ఎక్కువ కొనటానికి నా దగ్గర డబ్బులేదు. రహదారి మీద ప్రయాణం చేసే బాటసారులకు ఈ గొయ్యి కనిపించకపోతే ఇందులో పడిపోతారు. అందుకే ఉన్న ఒక్క దీపాన్ని నా ఇంటిలో పెట్టుకోకుండా అందరికి ఉపయోగంగా ఉంటుందని ఇక్కడ పెట్టేను" అని చెప్పింది.

జవాబు విన్న రాజుగారు చాల ఆశ్చర్యపోయారు. ఊళ్ళో అందరూ వారి ఇళ్ళని దీపాలతో అలంకరించుకుంటే అవ్వ మట్టుకు బాటసారులకు దారి చూపించటంకోసం దీపం పెట్టిందని, రాజ్యంలో అందరికన్న బాగా దీపాలు పెట్టింది ఆ అవ్వేనని ప్రకటించి బహుమానం కూడా ఆ అవ్వకి ఇచ్చారు. మర్నాడే రాజుగారి ఆదేశంపై పనివాళ్ళు వచ్చి రహదారిలో వున్న గోతిని మరమ్మత్తు కూడా చేసారు.

"పదిమంది శ్రేయస్సుకై చేసే పనిలో మొదట శ్రమ పడవచ్చుగాని, దాని వలన పొందే ఫలితం పదుగురితోపాటు మనము ఆనందంగా అనుభవించవచ్చు!" మన జీవితంలో ఎదుటివారి శ్రేయస్సుకోసం ఒకరికొకరు పాటుపడటమే నిజమైన దీపావళి. ఏమంటారు పిల్లలు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం

ఇంట్లోని పిల్లలు భోజనం సరిగా తినకుండా వెదజల్లితే పెద్దలు వారిని మందలిస్తారు. అంతే కాకుండా దాన్ని అలా పారవేయరాదని "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అని వారితో అంటారు. అసలు అలా ఎందుకు అంటారు అని అంటే దానికి కారణం ఇది.

ప్రతి జీవికి కావలసిన ఆహార పదార్థాలను పుట్టుకతోనే ఈ భూమి మీద భగవంతుడు కల్పిస్తాడు. కాబట్టి ఎవరైనా జన్మించిన తర్వాత "నారు పోసిన వాడు నీరు పోయకపోడు" అని భగవంతుని గురించి పెద్దలు చెబుతుంటారు. అంటే అమ్మ కడుపులో నుంచి బయటకు రాకముందే మనకు ఇంత ఆహారం అని, ఇన్ని నీళ్లని నిర్ణయిస్తాడు. గత జన్మలో చేసిన పాప పుణ్యాలను లెక్కించి వాటికి అనుగుణంగా మనకు సమకూర్చి ఎవరి కడుపులో పుట్టాలో కూడా నిర్ణయిస్తాడట భగవంతుడు.


ఆయన సమకూర్చిన అన్న, పానీయాలు ఎప్పుడు నిండుకుంటాయో ఆ జీవికి ఈ భూమిమీద నూకలు చెల్లిపోయినట్లే. అందుకే మీరు తినగా ఉన్న ఆహారాన్ని, తాగే నీటిని వృథా చేయకుండా అవసరమైన వారికి దానంగా ఇవ్వడం వల్ల పుణ్యఫలం పెరుగుతుందట. అలాగే భవిష్యత్తులో మనకు నచ్చిన ఆహారం మరింత లభించి దీర్ఘాయుష్షు కలుగుతుందట. అలా కాకుండా సృష్టికర్త ఇచ్చిన ఆహారాన్ని వృథాచేస్తే నీ ఆయువు క్షీణించిపోతుందట.

ఏ తల్లి అయినా తన బిడ్డల ఆయుక్షీణాన్ని తట్టుకోలేదు. అందుకే అన్నం పారబోయవద్దని ఒకటికి పదిసార్లు చెబుతుంది. అవసరమైతే దండిస్తుంది కూడా. అందుకనే ''అన్నం పరబ్రహ్మస్వరూపం" అని అంటారు. అందువలనే అన్ని దానాలలో కన్నా అన్నదానం మిన్న. ఎవరికైనా కోట్లు ఇచ్చినా సంతృప్తి చెందరు కడుపు నిండా భోజనం పెడితే చాలు అంటారు. అంతేకాదు మనం అన్నం తినే ముందు అది మన చేతినుంచి నోటివరకు రావటానికి అనేక రూపాలలో అనేక విధాలుగా సహకరించిన ప్రకృతి రూపంలోని భగవంతునికి కృతజ్ఞతగా ఒక ముద్ద బయట కాకబలికి పెట్టి మిగిలిన భోజనం భగవంతుని ప్రసాదముగా భావించి స్వీకరించటము ద్వారా, భగవంతుడికి మన కృతజ్ఞత తెలియజేసుకోవటమే కాకుండా వారి ప్రేమకు పాత్రులయ్యి, తీసుకున్న ఆహారం మనకు ఆరోగ్యము కలగజేయటమే కాదు మంచి ఆలోచనలు కూడ కలుగజేస్తుంది.

సేకరణ : **శ్రీమతి కె. సాయిప్రత్యూష**, గోవా

# హృదయ జ్యోతి

ఓ దుష్టుడైన కుర్రవాడున్నాడు. వాడు ఎవరినైనా సరే తిట్టి పారిపోతుంటాడు. ఓనాడు ఓ సాధువు ఓ మర్రిచెట్టు క్రింద కూర్చుని ఉన్నాడు. ఆ కుర్రవాడు వచ్చి అతణ్ణి దూషించి పారిపోయాడు, తిట్టడం వల్ల సాధువు కుపితుడై తనను కొట్టడానికి పరుగెత్తుకు వస్తాడనీ, అప్పుడు మహామజాగా ఉంటుందనీ వాడనుకున్నాడు. సాధువు మౌనంగా కూర్చున్నాడు. అతడు వాడివైపు చూడనైనా లేదు.



ఆ కుర్రవాడు ఆ సాధువుకు మరీ దగ్గరగా వచ్చి మరల గట్టిగా దూషించ సాగాడు. సాధువు తన ధ్యానములో లీనమై ఉన్నాడు. ఏదో కుక్కయో, కాకియో అరుచుకుంటున్నదని ఆ సాధువు అనుకున్నాడు. అక్కడకు మరో కుర్రవాడు వచ్చి– "బాబాజీ! వీడు మిమ్మల్ని తిడుతున్నాడు కదా!" అని అడిగాడు. బాబాజీ సమాధానం యిచ్చాడు "అవును నాయనా! దూషిస్తున్నాడు. కాని నేను ఆ తిట్లను స్వీకరిస్తేకదా! నేను వాటిని పట్టించుకోనప్పుడు ఆ తిట్లన్నీ వాడిదగ్గరే ఉంటాయి కదా!."

"కానీ వాడు చాలా చెడుతిట్లు తిడుతున్నాడు బాబా" అని ఆ కుర్రవాడనగా ఆ సాధువు, ''బాబూ! ఇది మరీ నీచవిషయమంటావా? అవేమీ నాకు తగలలేదు, అన్నీ వాడి నోటిలోనే ఉండిపోయాయి. వాడినోరే మలినమై పోతుంది" అన్నాడు.

ఆ తిట్లుతిట్టే కుర్రవాడు సాధువు సమాధానాలు ఆలకిస్తున్నాడు. వాడు ఆలోచించాడు "ఈ సాధువు సత్యమే చెబుతున్నాడు. ఎవరినైనా నేను దూషిస్తుంటే వారు నా తిట్లను స్వీకరించి నన్ను కొట్టుటకు పరుగులు తీస్తుంటారు. పరుగెత్తలేని వారైతే దుః ఖించేవారు. నా తిట్లను యీ సాధువు స్వీకరించక పోవడంవల్ల అవన్నీ నా దగ్గరే ఉండిపోయాయికదా!". ఆ కుర్రవానికి ఆతని స్థితి చాలా నీచంగా అనిపించింది. ''ఛీ! ఛీ! నా దగ్గర అసహ్యకరమైన ఎన్ని తిట్లు ఉండిపోయాయో కదా" అని మనసులో అనుకున్నాడు.

చివరికి వాడు సాధువుకు దగ్గరగా వెళ్ళి "బాబాజీ! నా అపరాధాలు ఎలా విముక్తమవుతాయి? నా నోరు ఎలా శుద్ధమవుతుంది?" అని ప్రశ్నించాడు.

సాధువు శాంతంగా సమాధానం యిచ్చాడు. "పశ్చాత్తాపం చెందడం వల్లనూ, ముందెన్నడు దూషించను అని ప్రతిజ్ఞ చేయడం వల్లనూ నీ అపరాధాలు దూరమవుతాయి. సద్గురువునామ స్మరణవల్ల నోరు శుద్ధమవుతుంది".

బాబా కూడ "అన్ని ప్రాణులలోను నేనే ఉంటాను. అందుకే ఎవరు ఎవరిపై కోపించిన, దూషించినా నాకు చాలా బాధ కలుగుతుంది. ఎవరు ధైర్యంగా అపనిందలను, దూషణలను ఓర్పుతో సహిస్తారో వాళ్ళు నాకెంతో ఇష్టులు. నిన్ను ఎవరైనా దూషించినా, బాధించినా వారితో తిరిగి పోట్లాడవద్దు, వారు అనే మాటలు, చర్యలు సహించలేకపోతే ఓర్పుతో ఒకటి రెండు మాటలతో సమాధానం చెప్పు. వారు వినకుంటే, నా నామం స్మరిస్తూనీవు ఆ ప్రదేశాన్ని విడిచివెళ్ళిపో, అట్లాకాక వాడితో నీవు సమానంగా యుద్ధానికి దిగితే నాకు చాలా అసహ్యం కలుగుతుంది. నీవు ఎవరి గురించి తప్పుగా మాట్లాడవద్దు, ఎవరైనా నీ గురించి తప్పుగా మాట్లాడితే చలించవద్దు, ఎవరు చేసే పనులకు ఫలితంవారే అనుభవిస్తారు. ప్రపంచమంతా తల క్రిందులు కానివ్వు నీవు మాత్రం దానిని లక్ష్యపెట్టక సక్రమమైన మార్గంలో సత్యమైన మార్గంలో ప్రయాణించు" అన్నారు సాయినాధుడు.

ఎదుట వ్యక్తిని అకారణంగా దూషించే వ్యక్తి, మలం తినే పందితో సమానమన్నారు సాయి. సాధన చేస్తాము, ధ్యానము చేస్తాము, అనే ముందుగా మనలోని రాగ ద్వేషాలు జయించాలి. అలాకాక బలవంతంగా ఏదో మార్గం ద్వారా భగవంతుడిని మెప్పించి కోరికలు తీర్చుకుందామన్నా అది రాక్షసులు చేసిన తపస్సుతో పోలి ఉంటుంది. అందుకని **ధ్యానం చేస్తాము, మంత్రం జపిస్తామనేదాని కన్నముందు ఆ నోటితో ఇతరులను దూషించటము మానాలి.** అదే నిజమైన తొలిమెట్టు. పూజ్యశ్రీ భరద్వాజగారు అన్నట్లు "సాధన అంటే మనలోని సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమైన ప్రయత్నమే." అలాంటి సాధన ప్రారంభించి మనలోని అజ్ఞానమనే చీకటిని పారద్రోలి జ్ఞానమనే వెలుగుతో హృదయాన్ని నింపుకొని, ఆ వెలుతురులో మన మార్గం సుగమం చేసుకుంటూ ఆధ్యాత్మిక పథంలో ముందుకు సాగుతూ, నిరంతరం హృదయ దివ్వెను సరిచేసుకుంటూ, ఆ వెలుతురు పది మందికి పంచుతూ సాయి పథంలో పయనం చేయటమే నిజమైన దీపావళి.


దీపావళి శుభాకాంక్షలతో ...

(నవంబరు 14వ తేదీ శనివారం దీపావళి సందర్భంగా సమర్పణ)

రచన : **వి.వి.పూర్ణచంద్రరావు**

# ఆదర్శమూర్తి - శ్రీ ఎక్కిరాల భరద్వాజ

మహనీయుడైన మాష్టరుగారి ఆచరణ మానవజాతి అంతటికీ ఆచరణయోగ్యమే. మాష్టరుగారు విద్యానగర్‌లో ఉండగా ప్రతి గురువారము జరిగే భజన సత్సంగమములకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చేవారు. ఈ కార్యక్రమం నిత్యం జరిగేదే అయినా ఆరోజు ప్రక్కగ్రామాలనుండి కూడా భక్తులు వచ్చేవారు. వారిలో క్రొత్తపాలెంనుండి వచ్చే భక్తులు ఎక్కువగా ఉండేవారు. విద్యానగర్ నుండి క్రొత్తపాలెం వెళ్ళేందుకు రాత్రి 8 గంటలకు లాస్ట్‌బస్సు. ఆ తర్వాత బస్సులు లేవు. కనుక మాష్టరుగారు ఏడున్నర గంటలకే సత్సంగం నిలిపి క్రొత్తపాలెం భక్తులకు, టెంకాయలు కొట్టి, హారతిచ్చి ప్రసాదమిచ్చి పంపేవారు. వాళ్ళంతా ఎంతో సంతేషంగా ప్రసాదం తీసుకొని వెళ్ళేవారు.



వాళ్ళు 8 గంటలకు బస్సుకు పోలేకపోతే ఇంటిలో వారికి గల ఎన్నో పనులు నిర్వహించడం కష్టం. ఇంట్లోవారికి, సేద్యగాళ్ళకు అన్నాలు పెట్టాలి. తెల్లవారికి చద్ది అన్నాలు జాగ్రత్త చేయాలి. ఇలాంటివెన్నో పనులుంటాయి. ఒక్కవారం వారు రాలేక విద్యానగర్‌లో ఉండిపోతే మరుసటివారం ఇంటిలోని పెద్దలు వారిని సత్సంగానికి రానివ్వరు.

ఇదంతా తెలిసిన మాష్టరుగారు సనాతన ఆచారాలకు స్వస్తిచెప్పి సత్సంగం మధ్యలోనే వారికి టెంకాయలు కొట్టి హారతిచ్చేవారు. ఈ సూత్రం తెలిసి ఆచరించగలిగితే మానవాళికెంత శాంతి, సౌఖ్యాలు లభిస్తాయో ఆలోచించండి. అందుకే మాష్టరుగారు మనందరికీ పూజనీయులైనారు.

ఒకరోజు మాష్టరుగారు తలస్నానంచేసి తెల్లని గ్లాస్కో పంచె, తెల్లని బనీను, పెద్ద సరిగంచుగల కండువా కప్పుకొని నుదుట విభూతి ధరించి నోటిలో వక్కపొడి వేసుకొని, పుస్తకం చేతిలో పట్టుకొని విద్యానగర్ సత్సంగం రూములో ప్రవేశించారు. ఒక గ్రంథం చదువుతూ చదువుతూ చాపపై పడుకున్నారు. సరిగ (జరీ) కండువా ప్రక్కనపడిపోయింది. ఇంతలో ఒక బిచ్చగాడు వచ్చి, "సామీ, మీరిచ్చిన గుడ్డ చినిగిపోయింది. చలికి చస్తున్నాను. అంత గుడ్డపీలిక పారెయ్యండి" అన్నాడు. వెంటనే మాష్టరుగారు తన ఎడమచేతితో సరిగంచు కండువా తీసి నాకందిస్తూ దాన్ని ఆ బిచ్చగాడికివ్వమని సైగచేశారు. వారు పుస్తకపఠనం నుండి బయట పడలేదు. ఆ కండువా కనీసం రెండు మూడు వందలు విలువ చేస్తుంది. వారేదో పరధ్యానంలో ఉన్నారని "సార్! ఇది క్రొత్త కండువా సార్!" అన్నాను. అయితే ఫరవాలేదు ఇచ్చెయ్ అన్నట్లు సైగచేశారు. ఇక దాన్నే భిక్షగానికివ్వక తప్పలేదు. కుడిచేత్తో దానం చేస్తే ఎడమ చేతికి తెలియకూడదంటారు. ఇదే కాబోలు. ఇదేవిధంగా ఎప్పుడు బిచ్చగాళ్ళు వచ్చినా తన ముందున్న పంచల్లో పెద్దవాటినే వారికిచ్చేవారు. ఆ వచ్చిన వారు "సాయి" అన్న ఎరుక నిరంతరం వారిని అంటిపెట్టుకుని ఉండేది.

విద్యానగర్ సాయిబాబా మందిరం స్లాబుపోసి క్యూరింగ్ చేస్తున్నాము. మధ్యాహ్నం ఒంటిగంట, రెండుగంటల మధ్య సమయం, పది పదిహేనుమందిమి నీరు చేది నిచ్చెనమీద మోసుకుపోయి పోస్తున్నాము. ఎండ చాలా తీవ్రంగా ఉంది. స్నేహితులమందరము బాగా తడిసిపోయాము. పని శ్రమ అయినా మాకు చాలా సంతోషంగా ఉంది. అప్పుడే మాష్టరుగారు మందిరం పైకి ఎక్కి వచ్చారు. ఎర్రటి ఎండలో పనిచేసే మమ్ములను చూసి వారికెంత జాలివేసిందో చెప్పలేను. వెంటనే దామోదర్‌ను పిలిచి ''ఇంటికి వెళ్ళి అమ్మగారినడిగి పంచెలు తీసుకురా పో'' అన్నారు. వెంటనే దామోదర్ వెళ్ళి ఆమాట అలాగే వల్లించాడు. అమ్మగారు ఏమి పంచెలు ఎన్ని తెమ్మన్నారు అని కూడా అడగకుండా గ్లాస్కో పంచెలు, టవల్స్ అన్నీ పెద్దమూట కట్టి పంపారు. మాష్టరుగారు అవి మాకియ్యబోతుంటే "సార్! ఈ ఇస్త్రీ గుడ్డలన్నీ మాకెందుకుసార్, బురద అయిపోతాయి" అన్నాము. "ఎండ తగలకుండా తలకు చుట్టుకోండి. బురద అవుతుందా?" అంటూ ప్రతి పంచెమీద కొంచెం బురద నీరు చల్లి తలా ఒకటి మాపై విసిరేశారు. ఇక తప్పదని తలా ఒకటి తలకు చుట్టుకున్నాము. కొంతసేపు గడిచాక, "ఇంక మీకీ పంచెలు తిరిగిరావు సార్" అన్నాము. "ఎందుకూ? అని మీకొరకే తెప్పించాను'' అని అన్నారు. ఆ ఎండలో మేమందరము వారికి సాయిబాబా వలె కనిపించి ఉంటాము. లేకుంటే వేల రూపాయలు ఖరీదుచేసే గుడ్డలన్నీ మాకు సమర్పించడమేమిటి! ఏమి పంచెలు ఎన్ని తెమ్మన్నారు అని కూడా అడగకుండా అన్నీ మూట కట్టి పంపిన అమ్మగారి ఔదార్యమేమని కొనియాడగలను? సర్వులను సాయిరూపాలుగా చూసే ఈ మహా మహితాత్ములకు సాటి ఎవరు? సాధన పరాకాష్ట అంటే అదే కాబోలు!

ఒకరోజు మాష్టారుగారు నెల్లూరినుండి శ్రీ సాయిలీలామృతాలు ఒక బస్తాడు బస్సులో తెచ్చారు. మిట్టమధ్యాహ్న సమయం. మే నెల, మండువేసవి. విద్యానగర్ వీధులు ఆరోజులలో ఇప్పుడున్నంత రద్దీగా వుండేవికావు. కూలీలు ఎవరూ కనిపించలేదు. మాష్టరుగారు బస్తాదగ్గర నుండి నాలుగువైపులా కూలీల కొరకు చూస్తున్నారు. మాష్టరుగారి పిలుపులేకుండానే ఒకతను వచ్చి "మూట నాకెత్తండి,

నేను తెస్తాను" అని మూట యిల్లు చేర్చాడు. ఆరోజులలో ఆ మూట తెచ్చినందుకు కూలి ఒక రూపాయి యిస్తే ఎక్కువ. కాని మాష్టరుగారు అతనిచేతిలో ఐదురూపాయల నోటు ఉంచారు. అతను నాదగ్గర చిల్లరలేదుసార్ అన్నాడు. మాష్టరుగారు, "చిల్లరవద్దు, వుంచుకో పో" అన్నారు. ఆ మాటతో అతని ముఖం చాటంతై నవ్వుకుంటూ పోతున్నాడు. చేతిలో రూ. 5/- నోటు వుంది. ఒక సత్సంగేయుడు ఎదురై, "ఏమిటి నవ్వుకుంటూ పోతున్నావు" అన్నాడు. "పుస్తకాలమూట తెచ్చినందుకు స్వామివారు రూ. 5/- లు దయచేశారు" అని ఎంతో సంబరంగా చెప్పాడు. ఆ సత్సంగేయుడు మాష్టరుగారి దగ్గరకొచ్చి, సార్, మీరు ఒక మూటకు రూ. 5/-లు యిచ్చారే. ఒక్క రూపాయేగదా మనమిచ్చేది. అదే ఎక్కువే. ఇట్లా మీరు మరచి పోయారంటే ఇక ఏ వస్తువు మనింటికి రావాలన్నా రూ. 5/-లు లేనిదే తేలేము" అన్నాడు. మాష్టరుగారు : నేనతనికి మూట తెచ్చినందుకు కూలి ఇవ్వలేదు. మనం మనిషి దొరక్క యిబ్బందులలో వున్నప్పుడు గమనించి మనం పిలవకుండానే తానే వచ్చి మూట యింటికి చేర్చాడు. మనబిడ్డ అయితే ఎంతైనా యిస్తాం గదా! కొనుక్కునేందుకు, అందుకని యిచ్చాను" అని ముగించారు. ఎంతటి దాతృత్వం! ప్రేమ పూర్వకంగా సహాయమందించి నందుకు హృదయ పూర్వకంగా పారితోషకం.

"కాకబలికి యింటి బయట సమృద్ధిగా ఆహారం విడిచిరా వేటిని పిలవవద్దు. తరుమ వద్దు యిలా చేస్తే నీవు లక్షలాది అతిధులకు ఆతిధ్యమిచ్చినట్లేనని" సాయి సూక్తి. ఎక్కువ మందికి ఎటువంటి కష్టం లేకుండా ఆచరించుకోగలగిన విధానమని గురుదేవులు చెప్పేవారు. గురుదేవులు మొదట ప్రాధాన్యతనిచ్చినది సత్సంగానికి, తరువాత చరిత్రపారాయణ, ఈరెండింటి ద్వారా అలనాడు ఋషులు యజ్ఞయాగాదులు, జప తపాలు చేసి సాధించిన ఫలితాన్ని మనం పొందవచ్చని చెప్పేవారు. ఎంతో మందికి సాయిలీలామృతం, శ్రీ గురుచరిత్ర, యితర గ్రంధాలు ఉచితంగా యివ్వడం నేను కళ్ళారా చూసాను. తమవద్దకు వచ్చిన ప్రజలందరూ తరించాలన్నదే వారి ధ్యేయం. ఏది నిజం, మతం ఎందుకు, విజ్ఞాన వీచికలనే గ్రంధాల ద్వారా విజ్ఞాన శాస్త్రం ఆధ్యాత్మికత వేరుకావు. ఈ విశ్వానికి మూలాధారంగా చైతన్యం (భగవంతుడు) వున్నదన్న విషయాన్ని ఆధునిక విజ్ఞాన శాస్త్రంద్వారా నిరూపించారు. ఇంతవరకూ మేధావులెవ్వరు అది తప్పని నిరూపించలేకపోయారు. ఎందుకంటే అది సార్వజనీనమైన సత్యం కనుక. తద్వారా చాలామంది జీవితాలలో చాలాచాలా మార్పువచ్చి సరైన మార్గాన పోతున్న వారిని చాలా మందిని చూశాను. దానినొక ఉద్యమంగా చెప్పుకోవచ్చు. నేను, ఆస్థికుడను అంటే దైవంపట్ల విశ్వాసం కలిగిన వాడినన్నా, నాస్థికుడను అంటే దైవం పట్ల విశ్వాసం లేనివాడనన్నా గురుదేవులు సంతోషించరు. ఒక్క అన్వేషకునికే నూటికి నూరు మార్కులిస్తారు గురుదేవులు ఎందుకంటే అన్వేషకుడొక్కడే సత్యం తెలుసుకొని తరిస్తాడంటారు. వారి జీవితం కూడా మరణమంటే ఏమిటన్న అన్వేషణతో సాగి, చివరికి పూర్ణత్వం పొందింది. ఎన్నో కఠినమైన సాధనలద్వారా ఆస్థితిని సాధించారు. ఈ విషయాన్నే ఒకప్పుడు విద్యానగర్‌లో చెపుతూ "నేనెంతో కాలం ఎన్నో కఠినమైన సాధనలు చేసి, ఎంతో మంది మహోన్నత శిఖరాలనందిన మహాత్ములను దర్శించి, సాధించిన దాన్నంతా మీకు సిద్ధాన్నంగా వండి విస్తరిలో వడ్డిస్తే దానిని తినడానికి కూడా చేతకాని మిమ్ములను ఏమి చేయాలి?" అని ఆవేదన చెందేరు. అది మా దౌర్భాగ్యమే. వారు ధర్మానుష్టానాన్ని గురించి పదే పదే చెప్పేవారు. దాని ఆచరణ ద్వారా మాత్రమే మనందరి జీవితాలు సక్రమంగా కొనసాగుతాయని, అధర్మాచరణ వలన ఎంతో పాపం మూటగట్టుకోవలసి వస్తుందని, దాని ఫలితంగా ఎన్నో జన్మలకు సరిపడా ప్రారబ్ధ కర్మను పోగుచేసుకొని ఆయా జన్మలలో అంతులేని దుఃఖాన్ని అనుభవించవలసి వస్తుందని చెప్పేవారు. గురుదేవులు అధర్మంగా నడవడం నేనెన్నడూ చూడలేదు. ఒకప్పుడు ఒక వ్యక్తి సార్ మీరు అధర్మంగా నడుస్తున్నారు సార్ అని అన్నప్పుడు "ఒరేయ్ యిటు సూర్యుడటు పొడిచినా నేను అధర్మంగా నడవను. నేను అధర్మంగా నడిచానంటే పడమట సూర్యుడు ఉదయిస్తాడని" చెప్పారు. గురుదేవులు తాను కష్టాలను కొనితెచ్చుకుని తన నాశ్రయించిన వారికి సుఖశాంతులను ప్రసాదించారు. ఈనాడు ఆయన శిష్యులమని చెప్పుకునే చాలామంది సుఖశాంతులతో ధనధాన్యాలతో, భోగభాగ్యాలతో తులతూగుతున్నారు. ఒకప్పటి వీరి పరిస్థితి తిండికూడా గడిచే స్థితిలేదు. తనకు, తన కుటుంబానికంటూ ఏమీపోగుచేసుకోలేదు, చివరికి ఉండటానికొక గృహాన్ని కూడా నిర్మించుకోలేదు. తమ చివరి శ్వాసవరకు అద్దె యింటిలోనే వున్నారు. సర్వం సాయినాధుని మీదభారం వేసి ఆయన దయమీద మాత్రమే జీవితాన్ని గడిపిన త్యాగశీలి భరద్వాజ మహరాజ్. శ్రీ భరద్వాజ గారు ఎవ్వరిని పల్లెత్తుమాట అనలేదు, విమర్శించలేదు. ఆర్థికంగా చాలా యిబ్బందుల్లో వున్న రోజులలో పెసల సుబ్బరామయ్య వెళ్ళి, మాష్టారు మీకు ఆర్థిక సాయం చేస్తామంటే "సుబ్బరామయ్య యింత విశాల విశ్వంలో యిన్ని జీవులను పోషిస్తున్న సాయినాధుడు నన్ను, నాకుటుంబాన్ని వదిలేస్తాడా, అదే జరిగితే నా కులవృత్తి చేసుకొని నా భార్యాపిల్లలను పోషించుకుంటాను. మీరెక్కడుంటే అక్కడ సత్సంగాలు చేయండి అదే నాకు మీరు లక్షలిచ్చినట్లు" అని గురుదేవులు చెప్పారట. అంటే వారికి సాయినాధుని పట్ల ఎంత అకుంఠిత విశ్వాసమో. వారి యావత్తు జీవితాన్ని సాయి సేవకే అంకితం చేసిన మహామహితాత్ముడు పూజ్య గురుదేవులు. ఆచరణద్వారా ఆచార్యులైనారు ఆదర్శమూర్తి శ్రీ భరద్వాజగారు. వారు చూపిన మార్గంలో పయనం చేయటమే వారికి మనమిచ్చే దక్షిణ.

(అక్టోబరు 30వ తేదీన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **నాకు తెలిసినమాస్టారు, గురుదేవులు**

సేకరణ : **శ్రీ విద్యాసాగర్**

# స్ఫూర్తి ప్రధాత - గణితావధాని - శ్రీ సంజీవరాయశర్మ

గణితావధాని, గణితబ్రహ్మగా పేరొంది ప్రపంచములో ఆరువేల గణితావధానాలు చేసిన ఏకైక వ్యక్తిగా ఖ్యాతిగాంచిన శ్రీ లక్కోజు సంజీవరాయశర్మ 1907 నవంబరు 27వ తేదీన కడప జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరులో జన్మించారు. ఈయన తల్లితండ్రులు నాగమాంబ, పెద్ద పుల్లయ్యలు. శ్రీ సంజీవరాయ శర్మ జన్మతః అంధుడు. అప్పట్లో బ్రెయిలీ లిపి కానీ, అంధుల్ని చేరదీసే వ్యవస్థ కానీ లేదు. శ్రీశర్మ గారి అక్క, పాఠశాలలో చదివినవి ఇంటి దగ్గర గొంతెత్తి బిగ్గరగా మననం చేస్తే, అవి విని గుర్తుపెట్టుకుని, గణితంలో అపార విజ్ఞానం సాధించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో, తల్లి పెంచి పెద్దచేసింది. కల్లూరులో రైతులకు ధాన్యం ధర, భూమి కొలతలు చెప్పేవారు. వారు ఆయనకి కొంత సొమ్ము చెల్లించేవారు. గణితంలో పేరు ప్రఖ్యాతులు పొందుతున్న కాలంలోనే ఆయన వయొలిన్ పట్ల ఆకర్షితులై నేర్చుకున్నారు.



శ్రీ సంజీవరాయశర్మ తొలిసారి 1928లో గణితావధానం నిర్వహించారు. అప్పటినుంచి 1995 వరకు ఆయన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, బీహారు, ఢిల్లీ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి గణితావధాన ప్రదర్శనలు ఇచ్చారు. మహా నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగుళూరు, హైదరాబాదులలోను పలు ప్రదర్శనలను ఇచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు 1928 నవంబరు 15న నంద్యాలలో జరిగినప్పుడు, ప్రధాన ఆకర్షణ శ్రీ సంజీవరాయశర్మగారి గణితావధానమే.

సాధారణంగా, గణితావధానంలో పుట్టిన తేదీ ఇస్తే, అది ఏ వారము అయిందో చెప్పడం ఒక అంశం. కాని ఈ విషయంలో శ్రీ సంజీవరాయశర్మకు ఒక ప్రత్యేకత ఉంది, పుట్టిన తేదీ, సమయము, ప్రదేశము చెప్పగానే దానికి సంబంధించిన తిథి, వారము, నక్షత్రము, కరణము, యోగము, వర్జ్యము, రాశి కూడాచెప్పి, కొంతవరకు జాతకం కూడా చెప్పేవారు. ఈ అనితరసాధ్యమైన ప్రత్యేకతను మరెవరూ చూపలేకపోయారు.

గణిత బ్రహ్మ డా॥ లక్కోజు సంజీవరాయశర్మ అంకెల వినీల నిశీధి ఆకాశంలో ఉదయించిన సంపూర్ణ చంద్రుడు. చూపులేని కారణంగా, విద్యావంతుడు కాలేకపోయినా, చూడలేకపోయినా ఆహుతులు వేల సంఖ్యలో అడిగే ప్రశ్నలకు క్షణం ఆలోచించకుండా శ్రీ శర్మగారు చెప్పే సమాధానాలు విని, సరిచూసుకోవటానికి గణిత మేధావులకు గంటల తరబడి సమయం కావలసి వచ్చేది. ప్రపంచంలో ఆరువేల గణితావధానాలు చేసిన ఏకైక మేధావి శ్రీశర్మ.


ఆయన పొందిన సన్మానాలు, గౌరవాలు అసంఖ్యాకం. అప్పట్లో మద్రాసు గవర్నరు, భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయ ప్రముఖులు ఆయన మేధాశక్తికి ఆశ్చర్యచకితులయ్యారు! నాలుగువేల సంవత్సరాల వరకు సరిపోయే క్యాలండరు సైతం తయారుచేశారు. అప్పటి రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ శ్రీశర్మ ప్రతిభకు ముగ్ధులై తన దగ్గర ఉన్న సొమ్ము మనియార్డరు చేయడం విశేషం! అప్పట్లో అనీబీసెంట్, నెహ్రూ, రాజేంద్రప్రసాద్‌లతో పాటు, బెజవాడ గోపాలరెడ్డి, శ్రీమాలి, హుమాయూన్ కబీర్. కాశీనాధుని నాగేశ్వరరావు, పి.వి. రాజమన్నార్, గవర్నర్ సర్ జార్జి స్టాన్లే, మేథ్స్ విజార్డ్ శకుంతలాదేవి తదితరులంతా శ్రీశర్మ గణితావధాన ప్రదర్శనలు స్వయంగా తిలకించి, ఇది అన్యులకు సాధ్యం కాదని వేనోళ్ల కీర్తించారు. శ్రీశర్మ పలు విశ్వవిద్యాలయాల్లో, ప్రసిద్ధ కళాశాలల్లో అవధానం ప్రదర్శించి విద్యార్థుల్ని ఉత్తేజితుల్ని చేశారు. అలాగే గ్రంధాలయాల పిలుపునందుకొని పలు గ్రంధాలయాల్లోనూ తమ గణితావధాన ప్రదర్శనలు చేశారు. అలాగే మేథమేటికల్ సొసైటీల ఆహ్వానం మేరకు వాటి సభ్యుల ముందు ప్రదర్శనలిచ్చారు. ఆయన ప్రతిభ రాయలసీమ నుంచి అంతర్జాతీయ వేదికలకెక్కింది. దురదృష్టం ఏమిటంటే 1993లో అమెరికా సందర్శించాలని ఆయన్ని అక్కడి తెలుగు సంఘాలు ఆహ్వానించినా, సకాలంలో వీసా రాకపోవడంతో ఆ మేధావి ఇల్లు కదలలేకపోయారు. వివిధ విశ్వవిద్యాలయాలు, ఆయన్ని సత్కరించాయి. కొన్ని ఆయన్ని బంగారు పతకాలతో సత్కరించాయి. దురదృష్టమేమిటంటే 1964 అక్టోబరు పదో తేదీన శ్రీశర్మ రేణిగుంట నుంచి తిరుపతికి రైల్లో ప్రయాణిస్తున్న సందర్భంలో ఆయన 14 బంగారు పతకాల సూట్‌కేసును దొంగలు తస్కరించారు.

ప్రపంచంలో అంధులైన మహా ప్రతిభావంతుల్లో జాన్‌మిల్టన్, బ్రెయిలీ కనుగొన్న హెలెన్ కెల్లర్, ద్వారం వెంకటస్వామినాయుడు వంటివారు పుట్టుకతో అంధులు కారు. తదనంతర కాలంలో వారు అంధులయ్యారు. మన దేశంలో గణిత శాస్త్రజ్ఞుల్లో భాస్కరాచార్యులు, రామానుజన్, శకుంతలాదేవి వంటివారు మంచి శిక్షణ పొందారు కానీ శ్రీ సంజీవరాయశర్మ అంధుడే కాక చదువు సంధ్యలు లేని వ్యక్తి. అంతా వినికిడి జ్ఞానమే.... ప్రపంచంలోని ఆరుగురు అగ్ర గణిత శాస్త్రజ్ఞుల్లో ఒకరు శ్రీ సంజీవరాయశర్మ.

అలనాడే బ్రిటిష్ వైస్రాయ్ “ఈయన మా దేశంలో పుట్టి వుంటే దేశం నడిబొడ్డున విగ్రహం పెట్టి రోజు పూజలు చేసేవాళ్లం” అని శ్రీశర్మ నుద్దేశించి అన్నారు. శకుంతలాదేవి స్వయంగా నాకన్నా ప్రతిభావంతుడు అని అంగీకరించింది. అయినా ఆయన పేదరికంలోనే జీవించారు, ఎందరికో స్ఫూర్తిప్రదాత అయిన శ్రీ సంజీవరాయశర్మ. 1997 డిసెంబరు రెండోతేదీన అస్తమించారు. ‘అంక విద్యాసాగర’ విశ్వసాంఖ్యాచార్య, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్ పొందిన శ్రీశర్మ తన చివరి రోజుల్ని శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధిలో వయొలిన్ మీటుతూ స్వామినర్చిస్తూ గడిపేరు (డిసెంబరు 2వ తేదీ గణితప్రవీణ శ్రీ సంజీవరాయశర్మ వర్ధంతి సందర్భముగా సమర్పణ)

అంతర్జాలము మరియు ఇతర మాధ్యమాల నుంచి సేకరణ

సంకలనము : **శ్రీ పవన్‌కుమార్**



# పుస్తక పరిచయం





## సర్వసమన్వయ దత్తయోగము (విశ్వయోగము)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి పరిచయంతో 1980లో సాయి తత్వంవైపుకు, అటుపిమ్మట శ్రీ భరద్వాజగారు రచించిన మహాత్ముల చరిత్రలు పారాయణ చేసి శ్రీ దత్త సంప్రదాయంలోనికి ప్రవేశించి శ్రీ దత్తానుగ్రహముతో అనేక మంది అవధూతలను, మహాత్ములను దర్శించిన అనుభవం ద్వారా, సుమారు రెండు వందలమంది మహాత్ముల, సద్గురువుల జీవితచరిత్ర గ్రంథాల పారాయణ ద్వారా పొందిన అనుభవజ్ఞాన సారాన్ని ఏకీకృతం చేస్తూ, సమన్వయము చేస్తూ, సృష్టి అంతటా నిండి ఉన్నది శ్రీ దత్త తత్వమేనని తానెరిగిన విషయాన్ని, శ్రీదత్తానుగ్రహంతో శ్రీ పోణంగి శ్రీరామ విజయభాస్కర్ అందించిన గ్రంథము ''సర్వసమన్వయ దత్తయోగము'' (విశ్వయోగము). తత్వజ్ఞాన ప్రబోధకులు, యోగసాధకులు, ఆనందదాయకమైన, మోక్షకారకమైన మార్గాన్ని అత్యంత సులువుగా ప్రతి ఒక్కరికీ అర్ధమయ్యే రీతిలో ఉండి, మహాసంకల్పము – సృష్టిక్రమమముతో ప్రారంభమయ్యి అనేక విషయాలను సమన్వయ పరస్తూ భారతీయ ఋషులు సర్వసమైక్యత సందేశములో మునిగిన తత్వగ్రంథము సర్వులకు, ప్రత్యేకించి శ్రీసాయి భక్తులు, శ్రీదత్తభక్తులు అవశ్య పఠనీయము

పేజీలు : 254 వెల : రూ. 150/–

**ప్రతులకు :** రచయిత శ్రీ పి.యస్. ఆర్. విజయభాస్కర్
ఇంటి నెం. 2–2డి–2, ఆత్రేయ నిలయం, విద్యానగర్ కాలనీ
నిడదవోలు (పోస్టు) – 534 301 పశ్చిమగోదావరి జిల్లా
సెల్ నెం. : 9848789071




## కలియుగ శ్రీదత్తపంచకము

సకల జనావళిని ఉద్ధరించాలనే లక్ష్యంతో, అత్రి, అనసూయలకు త్రిమూర్తులు అయిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఏకరూపంగా, త్రిమూర్త్యాత్మకమై, నారాయణుడుగా కృత యుగములో అవతరించిన జ్ఞాన అవతారము శ్రీదత్తాత్రేయుడు. పరశురాముడిని, కార్తవీర్యార్జునులను అనుగ్రహించిన శ్రీదత్తాత్రేయుడు కలియుగములో శ్రీపాద శ్రీవల్లభుడుగా, శ్రీ నృసింహసరస్వతి, శ్రీమాణిక్యప్రభువు, శ్రీ అక్కల్‌కోటస్వామి, శ్రీశిరిడీసాయిబాబాగా అవతరించిన అయిదు అవతారాల సంగ్రహచరిత్రలతోపాటు ఆది నుండి శ్రీ దత్తస్వరూపము, సంప్రదాయము, నవనాధ చరిత్రలతో పాటు శ్రీ దత్త భగవానుని ఆరాధనకు సంబంధించిన అనేక అరుదైన విషయాలు, భక్తి శ్రద్ధలతో విషయ సేకరణ చేసి అందించారు శ్రీ కె. రాధాకృష్ణమూర్తి. శ్రీదత్త సంప్రదాయానుసారులు, సాయి భక్తులు అందరూ సర్వకాలములలో పఠించదగ్గ గ్రంథము 'కలియుగ శ్రీ దత్తపంచకము'.

పేజీలు : 136 వెల : రూ. 225/–లు

రచన : శ్రీ కె. రాధాకృష్ణమూర్తి

**ప్రతులకు :** శ్రీచక్ర నిలయము చారిటబుల్‌ట్రస్టు
నెం. : 18–4–12/1, లింగంపేట, 4వ లైను, కృష్ణానగర్,
రాజమండ్రి – 533 103, తూర్పుగోదావరి జిల్లా
సెల్ : 9866930780





## ఆధ్యాత్మికము మతము వేరు వేరు హిందూ ఆధ్యాత్మిక ధర్మ సందేహాలు

ఆత్మ శోధనలో శాస్త్రాలలో కలిగే ధర్మసందేహాలకు శాస్త్ర రీతిన చక్కటి సమన్వయముతో విశదీకరించిన గ్రంథము ఇది. దాదాపు 60 సంవత్సరాల తన యోగజీవితంలో ఎదురైన అనేక శాస్త్ర విషయాలకు దశాబ్దాలు తరపడి, హిమాలయ యోగుల శిక్షణలో పొందిన విస్తారమైన విజ్ఞానముతో బెస్ట్ సిటి జన్ ఆఫ్ ఇండియా, రాజీవ్‌గాంధీ ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత, భారత గౌరవ పురస్కార్ అవార్డు గ్రహిత, యోగా స్కూల్ ఫ్రెండ్స్ సొసైటీ సంస్థ స్థాపకులు, భారతజ్యోతి ఆచార్య డా॥ యోగశ్రీ కలము నుండి జాలువారిన బృహత్తర గ్రంథరాజము ఇది. ఆధ్యాత్మిక జీవితాన్ని సవ్యంగా, సమగ్రంగా, అవగాహన చేసుకోవటానికి అనువైన ప్రామాణికతతో అనేక పరిశోధనల ఫలితాలతో కూడి ఉన్నది "ఆధ్యాత్మికము మతము వేరువేరు అనే హిందూ ఆధ్యాత్మిక ధర్మ సందేహాలు" గ్రంథము.

పేజీలు : 716 వెల : రూ. 400/–లు

**ప్రతులకు :** రచయిత "భారతజ్యోతి" ఆచార్య డా॥ యోగశ్రీ
ది. యోగ స్కూల్ ఫ్రెండ్స్ సొసైటీ
28–3–393, శారదానగర్, 2వ మెయిన్
అనంతపురం – 515 001 ఆంధ్రప్రదేశ్
సెల్ : 9848618095




## ప్రకృతి - మనిషి - త్రిసూత్రాలు

**1. ప్రకృతి యొక్క మొదటి నియమం :** ఒకవేళ పొలంలో విత్తనం వేయకపోతే ప్రకృతి దానిని గడ్డిగాదంతో నింపేస్తుంది. అదేవిధంగా మనసును మంచి ఆలోచనలతో నింపకపోతే ఆ మనసులో చెడుఆలోచనలు చేరుకుంటాయి.

**2. ప్రకృతి యొక్క రెండవ నియమం :** ఎవరివద్ద ఏమి ఉంటుందో వారు దానినే పంచుకోగలరు. సుఖం కలిగిన వారు సుఖాన్నే పంచగలరు. దుఃఖం కలిగిన వారు దుఃఖాన్నే పంచగలరు. జ్ఞానులు జ్ఞానాన్నే పంచగలరు. భ్రమలలో ఉన్నవారు భ్రమలనే పంచగలరు. భయస్తులు భయాన్నే పంచగలరు,

**3. ప్రకృతి యొక్క మూడవ నియమం :** మీకు మీజీవితంలో ఏది లభించినా దానిని జీర్ణం చేసుకోవడం నేర్చుకోండి. ఎందుకంటే భోజనం అరగకపోతే రోగాలు పెరుగుతాయి. ధనం అరగకపోతే బడాయి పెరుగుతుంది. మాటలు అరగకపోతే చాడీలు పెరుగుతాయి. ప్రశంస అరగకపోతే అహంకారం పెరుగుతుంది. నిందలు అరగకపోతే దుర్మార్గం పెరుగుతుంది. అధికారం అరగకపోతే ప్రమాదం పెరుగుతుంది. దుఃఖం అరగకపోతే నిరాశ పెరుగుతుంది. సుఖం అరగకపోతే పాపం పెరుగుతుంది.

## పంచశుద్ధి

**మొదటిది – వాక్‌శుద్ధి :** ఆ భగవంతుడు మాట్లాడే వరాన్ని ఒక్క మనిషికే ఇచ్చాడు. వాక్కును దుర్వినియోగం చేయకూడదు. సాటివారిని ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ నిందించకూడదు. మంచిగా, నెమ్మదిగా, ఆదరణతో పలకరించాలి. అమంగళాలు మాట్లాడే వారి నుంచి తప్పుకుపోండి.

**రెండవది – దేహశుద్ధి :** మన శరీరం దేవుని ఆలయం. దాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ రెండు పూటలా స్నానం చెయ్యాలి. చిరిగిన, మలినమైన వస్త్రాలను ధరించరాదు.

**మూడవది – భాండ శుద్ధి :** శరీరానికి కావలసిన శక్తిని ఇచ్చేది ఆహారం. అందుకే ఆ ఆహారాన్ని అందించే పాత్ర పరిశుభ్రంగా ఉండాలి. స్నానం చేసి, పరిశుభ్రమైన పాత్రలతో వండిన ఆహారం అమృతతుల్యము.

**నాలుగవది – కర్మశుద్ధి :** అనుకున్న పనిని మధ్యలో ఆపిన వాడు అధముడు. అసలు పనినే ప్రారంభించనివాడు అధమాధముడు. తలపెట్టిన పనిని కర్మశుద్ధితో పూర్తిచేసినవాడు ఉత్తముడు.

**ఐదవది – మనశ్శుద్ధి :** మనస్సును ఎల్లప్పుడూ ధర్మ, న్యాయాలవైపు మళ్ళించాలి. మనస్సు చంచలమైనది. ఎప్పుడూ వక్రమార్గాలవైపు వెళ్ళాలని ప్రయత్నిస్తూ వుంటుంది. దానివల్ల అనేక సమస్యలు వస్తాయి. దీనివల్ల దుఃఖం చేకూరుతుంది. కాబట్టి ఎవ్వరికీ హాని తలపెట్టని మనస్తత్వం కలిగివుండటమే మనఃశ్శుద్ధి

## ఇంటివైద్యం

**క్యారెట్ :** కంటిచూపు వృద్ధి చెందటానికి దంతాలు పటిష్టంగా మారడానికి ఉపయోగపడుతుంది. అంతేకాదు  అల్సర్, క్షయ, మధుమేహం, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఔషధంలా పనిచేస్తుంది.

**బొప్పాయి :** లివర్, జీర్ణక్రియ, క్యాన్సర్, కిడ్నీ సమస్యలు ఉన్నవారు దీనిని తీసుకుంటే మంచిది. బొప్పాయి తింటే యవ్వనపు ఛాయలు చెక్కుచెదరకుండా ఉంటాయని ఆయుర్వేదవైద్యులు అంటున్నారు.


**ములగాకు రసం** : కంటికి చాలా మంచిది. అల్సర్, చుండ్రు, గ్యాస్ట్రిక్ సమస్య, మలబద్ధకాలను తొలగిస్తుంది. ఎముకల పుష్టికి దోహదపడుతుంది.

**రాగి జావ :** వ్యాధినిరోధక శక్తి పెంచుతుంది. బలాన్ని పెంచి, ఎముకల అరుగుదలను నివారిస్తుంది. రాగిజావతో ఆరోగ్యం పదిలం.

**సొరకాయ :** బరువు, అలర్జీలు తగ్గటానికి, మలబద్ధకానికి, రక్తశుద్ధికి సొరకాయ జ్యూస్‌ను వాడతారు. వారానికి ఒకసారైనా తీసుకుంటే మేలు.

## పూజ - పుష్పాలు

పుష్పాలకు గల ఆకర్షణశక్తి వల్ల అవి వాతావరణంలోని దైవిక శక్తుల తరంగాలను తమలో ఐక్యం చేసుకుంటాయి, అలా ఐక్యం చేసుకున్న దైవిక శక్తికి తమలోని సువాసనను జోడించి, పరిసర ప్రాంతాలను అవి పవిత్రంగా మార్చుతాయి. వాటిని దైవానికి సమర్పించినప్పుడు వాటిలోని పుప్పొడి కోశం దైవంలోని శక్తిని గ్రహించి, ఆ శక్తిని సుగంధ పరిమళాలనిచ్చే ప్రాణవాయువు రూపంలో తిరిగి బయటకు ప్రసరింపచేస్తుంది. శాస్త్రపరంగా చెప్పాలంటే పుష్పాలు మనలోని వ్యతిరేక భావనలను సానుకూలంగా మార్చి, మనస్సులను ఆహ్లాదపరుస్తాయి. అందుకే పూజలో పుష్పాలను తప్పనిసరిగా ఉపయోగిస్తారు.




### శ్రమ - విజయం

"నిరంతరం శ్రమిస్తేనే విజయం నిన్ను వరిస్తుంది"

"పనిచేయి దేవుని నామం ఉచ్చరించు,
సద్గ్రంథాలు చదువు, పోటీలు, వంతులు కీచులాటలు
మానితే భగవంతుడు నిన్ను కాపాడతాడు"

– శ్రీశిరిడీసాయి

### అడుగు - విజయం

మొదటి అడుగు ఎప్పుడు కఠినంగానే ఉంటుంది
పట్టువీడక శ్రమించి ముందుకు సాగితే విజయం నీదే

ఒక అడుగు నావైపు వేస్తే పది అడుగులు
నీవైపువేసి ముందుకు నడిపిస్తాను

– శ్రీ శిరిడీసాయి

### విధానం - వికాసం

దారిలో అడ్డువస్తే ఆపాల్సింది ప్రయాణం కాదు,
నడిచేపద్ధతి
చేసే పనిలో అడ్డంకులు వస్తే ఆపాల్సింది పనికాదు,
ప్రయత్నించే విధానం

క్షణక్షణమూ ఆత్మవికాసానికై కృషిచేయటము
ఒక్కటే మానవజీవిత లక్ష్యం కావాలి

– ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

### ఆలోచన - జీవితం

ఆకలిగొప్పదా ఆలోచన గొప్పదా అంటే ఆకలి అవసరాన్ని
చూపిస్తుంది, ఆలోచన బ్రతకటం నేర్పుతుంది

అన్నదానం ఆరోజు జీవింపచేస్తే, ఆధ్యాత్మిక విద్యాదానం
జీవితాన్ని వికసింపచేసి జీవితాన్ని ఇస్తుంది

– మాస్టర్ ఇ.బి.

### మానవజన్మ - నిరర్థకం

సాధారణంగా లభ్యం గాని మానవజన్మ ఎత్తి కూడ
ఆ జన్మలో భగవంతుడిని తెలుసుకోలేని మనిషి
పుట్టుక నిరుపయోగము

– శ్రీ రామకృష్ణ పరమహంస

సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు
ఎందుకు వచ్చినట్లు, పిడకలు ఏరుకోవటానికా

– శ్రీ శిరిడీసాయి

### జీవిత - సత్యం

మంచి మనిషిగా జీవించు కానీ,
మంచి మనిషిని అని నిరూపించుకునే ప్రయత్నం చేశావో
చెడు వ్యక్తిగా మారిపోయే అవకాశం ఉంది.

నీవు సత్యాన్ని అంటిపెట్టుకో నీవెంట నేను ఉంటాను

– శ్రీ శిరిడీసాయి

### ఉజ్వల - ప్రతిఫలం

ఓర్పు అనేది ఎంత చేదుగా ఉంటుందో దానివల్ల లభించే
ప్రతిఫలం అంత తీయగా ఉంటుంది

నీవు ఇప్పుడు ఎంత ఓర్చుకుంటావో నీ భవిష్యత్తు
అంత ఉజ్వలంగా ఉంటుంది.

– శ్రీ శిరిడీసాయి

### గురువు - జ్ఞానం

జ్ఞానం అనేది సంపాదిస్తే వచ్చేది కాదు
మనలో ఉన్న అజ్ఞానాన్ని విడిచిపెడితే వచ్చేది

గురువు సమాశ్రయము ద్వారా మనలోని అజ్ఞానం
తొలగి జ్ఞాన స్వరూపులుగా మారటం జరుగుతుంది

– శ్రీ శిరిడీసాయి

### మాట - మౌనం

"మౌనంకంటే మాటలే ఎక్కువ పనిచేస్తాయి అని
అనుకున్నప్పుడు మాత్రమే నీవు మాట్లాడు"

"పదిమాటలకొకమాట సమాధానం ఇవ్వాలి"

– శ్రీ శిరిడీసాయి

### విజ్ఞాని - వివేకి

ఇతరులను అర్థంచేసుకున్నవాడు విజ్ఞాని
తనను తాను తెలుసుకున్నవాడు వివేకి

ఆత్మ విమర్శ ఒక్కటే ఆధ్యాత్మిక విద్యలో సరియైనది

– మాస్టర్ ఇ.బి.

### సహాయ - లక్షణం

గెలవటం గొప్ప లక్షణమే కాని గెలిచినవారు
ఓడినవారి చేయిపట్టి గెలిపించటము ఇంకా గొప్ప లక్షణం

సహాయం చేస్తే మరచిపో
సహాయం పొందితే గుర్తుంచుకో

– మహాత్మాగాంధీ